గురువారం
28-12-2023
విజయవాడ ప్రచురణ
సంపుటి : 72, సంచిక : 186
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from
Vijayawada, Hyderabad, Visakapatnam,
Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

'సరనా' గుర్తింపునకు 30న భారత్ బంద్

రాంచీ: సరనా మతానికి గుర్తింపు కోసం గిరిజన సంఘాలు ఈనెల 30న భారత్ బంద్‌కు పిలుపునిచ్చాయి. ఆదివాసీ సెంగెల్ అభియాన్ (ఏఎస్‌ఏ) చాలా కాలంగా ఈ మతానికి గుర్తింపు కోసం డిమాండ్ చేస్తోంది. దేశంలోని 15 కోట్ల మంది గిరిజనులు ఈ మతాన్ని ఆచరిస్తున్నారని ఏఎస్‌ఏ అధ్యక్షుడు సలాన్ ముర్ము తెలిపారు. 1951 జనాభా గణనలో సరనా మతానికి ప్రత్యేక కోడ్ ఉందన్నారు. గిరిజన మతానికి గుర్తింపును నిరాకరించడం రాజ్యాంగ విరుద్ధమన్నారు. కాంగ్రెస్, బీజేపీ రెండూ గిరిజనుల మత స్వేచ్ఛను హరిస్తున్నాయని ఆరోపించారు. తమ మతాన్ని గుర్తింపు కల్పించే పార్టీకే ఓటేస్తామని స్పష్టంచేశారు.

జీవోఐఆర్‌లో జీవోలేవి?

హైకోర్టులో పిటిషనర్ల వాదన - విచారణ నాలుగు వారాలకు వాయిదా

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ప్రభుత్వ జీవోలను జీవోఐఆర్‌లో పెట్టకపోవడంపై హైకోర్టులో దాఖలైన పిటిషన్‌పై బుధవారం విచారణ జరిగింది. రాజ్యాంగపరమైన అంశాలు ఉండటంతో లోతైన విచారణ అవసరమని హైకోర్టు పేర్కొంది. జీవోలకు సంబంధించిన తీర్పులను మెమో రూపంలో వేయాలని ఆదేశాలు జారీ చేసింది. ఏపీఈ గెజిట్‌లో ఐదు శాతం మాత్రమే జీవోలను పెడుతున్నారని పిటిషనర్ల తరపు న్యాయవాది ఉమేశ్‌చంద్ర కోర్టుకు తెలిపారు. ఆర్టీఐ ద్వారా దరఖాస్తు చేసి జీవోలను తీసుకోమనడం సరికాదన్నారు. ఆర్టీఐ, రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా జీవోల విషయంలో ప్రభుత్వం వ్యవహరిస్తుందని న్యాయవాది శ్రీకాంత్ వాదించారు. జీవోలను వివిధ కేటగిరీల్లో విభజించి దేనిని వెబ్‌సైట్‌లో ఉంచడం లేదని న్యాయవాది కారుమంచి ఇంద్రనీల్ చెప్పారు. ఆర్టీఐ చట్టానికి విరుద్ధంగా ప్రభుత్వ చర్యలు ఉన్నాయని, అసలు జీవోలు

- మిగతా 2 లో

మంతనాలు... బుజ్జగింపులు

- అభ్యర్థుల ఎంపికపై సీఎం జగన్ కసరత్తు
- తాడేపల్లికి ఎమ్మెల్యేల క్యూ
- సీఎం వరుస సమీక్షలు
- నేతలకు బుజ్జగింపులు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: వైసీపీలో సీట్ల రగడ కొనసాగుతోంది. ఎన్నికల సమీపిస్తున్న వేళ వైసీపీ అధినేత, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అభ్యర్థుల ఎంపికను వేగవంతం చేశారు. అవసరమైన చోట అభ్యర్థులను మారుస్తున్నారు. కొంతమందికి టికెట్ ఇవ్వలేనని నిర్మొహమాటంగా చెబుతున్నారు. భవిష్యత్‌లో అందరికీ సముచిత స్థానం కల్పిస్తానని భరోసా ఇస్తున్నారు. అయినా కొంతమంది పక్కచూపులు చూస్తున్నారు. సీఎం క్యాంపు కార్యాలయంలో సీఎం జగన్ బుధవారం ఎమ్మెల్యేల ఎంపికపై రోజంతా మంతనాలు సాగించారు. తాజాగా ఉత్తరాంధ్ర ప్రాంతానికి చెందిన ఎమ్మెల్సీ వంశీకృష్ణ యాదవ్ వైసీపీకి గుడ్‌బై చెప్పారు. దీంతో వైసీపీ అధిష్ఠానం అప్రమత్తమై వివిధ జిల్లాలకు చెందిన ముఖ్య నేతలను తాడేపల్లికి పిలిపించింది. తొలివిడతగా 11 మంది వైసీపీ ఇన్‌చార్జిల మార్పులతో చాలాచోట్ల అసంతృప్తి కనిపించింది. ఉదయం నుంచి ప్రాంతీయ సమన్వయకర్తలతో సీఎం వరుసగా చర్చలు జరిపారు. క్యాంపు కార్యాలయానికి మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, బొత్స సత్యనారాయణ, ఎంపీలు విజయసాయిరెడ్డి, మాగుంట శ్రీనివాసరెడ్డి, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాస్‌రెడ్డి, ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి వచ్చారు. ఇప్పటికే ఉభయ గోదావరి జిల్లాలపై సీఎం కసరత్తు పూర్తి చేశారు. మిగిలిన ప్రాంతాల సమీక్షలో భాగంగా క్యాంపు కార్యాలయానికి వివిధ జిల్లాలకు చెందిన ఎమ్మెల్యేలను పిలిపించారు. మంత్రి ఉషశ్రీ చరణ్, ఎమ్మెల్యేలు కరణం ధర్మశ్రీ, గొల్ల బాబూరావు, కంబాల జోగులు, శంకర నారాయణ, సిద్ధారెడ్డి, అదీప్‌రాజ్, వాసుపల్లి గణేశ్, బియ్యపు మధుసూదన్‌రెడ్డి, కాపు రామచంద్రారెడ్డి, శ్రీరంగనాథరాజు తదితరులు సీఎంను కలిశారు. ఎమ్మెల్యే ఎలిజాను అమలాపురం ఎంపీగా వెళ్లాలని సీఎం సూచించగా...అందుకు ఆయన నిరాకరించారు. అనారోగ్య కారణాలతో రానున్న

- మిగతా 2 లో

కాంగ్రెస్ బలోపేతం!

- దిల్లీ కేంద్రంగా కీలక సమావేశం
- పూర్వ వైభవం కోసం అధిష్ఠానం కసరత్తు
- చేరికలపై దృష్టి...షర్మిల ఎంట్రీపై పుకార్లు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్ బలోపేతంపై ఆ పార్టీ అధిష్ఠానం దృష్టి పెట్టింది. మరో నాలుగు నెలల్లో లోక్‌సభతో పాటు రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు రానుండటంతో కసరత్తు ప్రారంభించింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విభజన అనంతరం పదేళ్లుగా రాష్ట్రంలో కాంగ్రెస్‌కు గెలుపులేదు. ఒక్కరు కూడా చట్టసభలకు ఎన్నికవలేదు. స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ కాంగ్రెస్ ఘోర పరాజయాన్ని చవిచూసింది. ఒక్కమాటలో చెప్పాలంటే కాంగ్రెస్‌కు కేవలం నాయకత్వ కమిటీలు మాత్రమే ఉన్నాయని, ఓటర్లు లేరని తేలిపోయింది. అయితే కర్నాటక, తెలంగాణలో గెలుపొంది... అధికారంలోకి రావడంతో ఆ పార్టీలో కొంత జోష్ నెలకొంది. వచ్చే ఎన్నికల్లో ఏపీలో కాంగ్రెస్ తమ సత్తా చాటాలనే దిశగా వ్యూహాలు రచిస్తోంది. దీంతో దిల్లీ కేంద్రంగా ఏఐసీసీ కార్యాలయంలో ఏపీ నేతలతో కలిసి అధిష్ఠానం కీలక సమావేశం నిర్వహించింది. కాంగ్రెస్ నేతలు రాహుల్ గాంధీ, ఖర్గే తదితర నేతల సమక్షంలో జరిగిన సమావేశానికి రాష్ట్రం నుంచి కాంగ్రెస్ అధ్యక్షుడు గిడుగు

- మిగతా 2 లో

ఆందోళనలు ఉధృతం

- ఎమ్మెల్యేల నివాసాలు ముట్టడించిన అంగన్‌వాడీలు
- అరెస్టులు... ఉద్రిక్తత

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: ప్రభుత్వంతో చర్చలు విఫలం కావడంతో అంగన్‌వాడీలు బుధవారం రాష్ట్రవ్యాప్తంగా పోరాటాన్ని ఉధృతం చేశారు. ఏఐటీయూసీ, సీఐటీయూ, ఐఎఫ్‌టీయూల అనుబంధ సంఘాల అధ్వర్యాన శాసనసభ్యుల ఇళ్ల ముట్టడి కార్యక్రమం చేపట్టారు. ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలతోపాటు ఇతర సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. గుంటూరు పశ్చిమ నియోజకవర్గం ఎమ్మెల్యే మద్దాలి గిరిధర్‌రావు కార్యాలయం ఎదుట నిరసన ప్రదర్శన చేపట్టారు. తూర్పు గోదావరి జిల్లా గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు ఇంటిని ముట్టడించారు. ఎమ్మెల్యే ఇంటి ముందు బైఠాయించి నినాదాలు చేశారు. విజయవాడలో ధర్నా చౌక్ నుంచి ఎమ్మెల్యేల ఇంటికి బయలుదేరిన అంగన్‌వాడీ కార్యకర్తలను పోలీసులు బలవంతంగా అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా తోపులాటలు చోటుచేసుకోవడంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతి ఇంటి ముట్టడికి యత్నించిన అంగన్వాడీ కార్యకర్తలను పోలీసులు అడ్డుకున్నారు. దీంతో ఇక్కడ పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. పోలీసులు, అంగన్వాడీల మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. అనంతపురంలో మంత్రి ఉష శ్రీచరణ్ ఇంటి ముట్టడికి యత్నించిన అంగన్వాడీలను పోలీసులు అడ్డుకున్నారు. సమ్మె చేస్తున్న శిబిరం నుంచి నియోజకవర్గంలోని అన్ని మండలాల అంగన్వాడీ కార్యకర్తలు ర్యాలీగా వెళ్లి మంత్రి ఇంటి ముట్టడికి యత్నించారు. అప్పటికే అక్కడికి చేరుకున్న పోలీసులు వారిని ముందుకు వెళ్లనీయకుండా కట్టడిచేశారు. అంగన్వాడీలు ప్రభుత్వానికి, మంత్రికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం మంత్రి ఇంటి ముందు బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. డిమాండ్లు పరిష్కరించే వరకూ సమ్మె కొనసాగిస్తామని తేల్చి చెప్పారు. ఏలూరులో ఎమ్మెల్యే ఆళ్ల నాని ఇంటి ఎదుట ధర్నా నిర్వహించేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. హిందూపురంలో టీడీపీ ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ ఇంటి ముందు ధర్నా చేశారు. ఆ సమయంలో బాలకృష్ణ ఇంట్లో లేకపోవడంతో వ్యక్తిగత కార్యదర్శి ద్వారా విషయం తెల్సుకున్న బాలకృష్ణ అంగన్‌వాడీల ఉద్యమానికి తన పూర్తి మద్దతు తెలియజేస్తున్నట్లు సమాచారం పంపారు. రాయదుర్గంలో కాపు రామచంద్రారెడ్డి ఇంటి ఎదుట గంటపాటు ధర్నా చేపట్టారు. మన్యం జిల్లా పాలకొండలో ఎమ్మెల్సీ విక్రాంత్ బాబు ఇల్లు ముట్టడించారు. వినుకొండలో ప్రదర్శన చేపట్టిన అంగన్‌వాడీలు శాసనసభ్యులు బొల్లా బ్రహ్మనాయుడు ఇంటి ముట్టడికి యత్నించారు. అప్పటికే పెద్దఎత్తున పోలీసులు అక్కడకు చేరుకోవడంతో బారికేడ్లు అడ్డంగా పెట్టి అడ్డుకున్నారు. దీంతో అక్కడే బైటాయించి ఎమ్మెల్యే బయటకు రావాలంటూ నినాదాలు చేశారు. ఎమ్మెల్యే పీఏకు వినతిపత్రం ఇవ్వాలంటూ పోలీసులు సూచించగా అసోసియేషన్ ప్రతినిధులు అంగీకరించలేదు. దీంతో పోలీసులు ఆందోళనకు నాయకత్వం వహిస్తున్న నాయకులతో చర్చలు జరిపి కొద్దిమందిని ఎమ్మెల్యే ఇంటికి వినతిపత్రం అందించేందుకు అనుమతించారు. నాయకులతో పాటు అంగన్వాడీ నాయకులు, సభ్యులు కలిసి ఎమ్మెల్యే ఇంటి వద్దకు వెళుతుండగా అకస్మాత్తుగా ఎమ్మెల్యే అక్కడకు చేరుకున్నారు. ఎమ్మెల్యేలతో పాటు ఆయన అనుచరులు కొందరు పరుష పదజాలంతో అంగన్‌వాడీలు ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో కొద్దిసేపు ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. పోలీసులు రంగ ప్రవేశం చేసి సర్దుబాటు చేశారు. సమస్యలపై వినతిపత్రం ఇచ్చేందుకు ఎమ్మెల్యే ఇంటికి వెళ్లిన వారిపై బ్రహ్మనాయుడు దౌర్జన్యానికి పాల్పడడం దుర్మార్గమని అంగన్‌వాడీ నేతలు ప్రసన్నకుమారి, సారమ్మ మండిపడ్డారు. మహిళలకు ఎమ్మెల్యే బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. మొత్తానికి రాష్ట్రవ్యాప్తంగా ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీల ఇళ్లకు వెళ్లి తమ నిరసన తెలియజేస్తూ వినతిపత్రాలు సమర్పించారు.

సీఎం జోక్యం చేసుకోవాలి

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి
ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు వామపక్షాల లేఖ

2లో

ఎమ్మెల్యే సతీశ్ ఇంట విషాదం

- అమెరికాలో రోడ్డు ప్రమాదం... బాబాయి కుటుంబంలో ఐదుగురి దుర్మరణం
- మరొకరి పరిస్థితి విషమం

విశాలాంధ్ర-కాట్రేనికోన: ఆంధ్రప్రదేశ్, ముమ్మడివరం వైసీపీ ఎమ్మెల్యే వెంకట సతీశ్ కుమార్ ఇంట విషాదం జరిగింది. కుమార్ సొంత బాబాయి పి.నాగేశ్వరరావు, పిన్ని సీతామహాలక్ష్మి, వారి కుమార్తె నవీనా, ఆమె పిల్లలు కృత్రిక్, నిషితా అమెరికా, టెక్సాస్ జాతీయ రహదారిపై జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో మరణించారు. జాన్సన్ కౌంటీలో ఉన్న 67వ నంబరు హైవేపై మినీవ్యాన్‌ను ఓ ట్రక్కు ఢీ కొట్టగా ఐదుగురు అక్కడికక్కడే ప్రాణాలు విడిచారు. అమెరికా కాలమానం ప్రకారం మంగళవారం సాయంత్రం ఈ దుర్ఘటన సంభవించింది. మృతుడు నాగేశ్వరరావు అల్లుడు లోకేశ్ తీవ్రంగా గాయపడగా, ఆయనను ఎయిర్‌లిఫ్ట్ చేసి ఆసుపత్రికి తరలించారు. అయితే ఆయన ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉంది. ఈ ఘటనలో ఇద్దరికి గాయాలైనట్లు అమెరికా మీడియా పేర్కొంది. క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించినట్లు వెల్లడించాయి. ట్రక్కు డ్రైవర్ నిర్లక్ష్యమే ప్రమాదానికి కారణమని అక్కడి వార్తా నివేదికలు పేర్కొన్నాయి. పిన్ని, బాబాయి, వారి కుమార్తె, మనుమడు, మనువరాలు ఈ దుర్ఘటనలో చనిపోయినట్లు ఎమ్మెల్యే సతీశ్ కుమార్ స్థానిక మీడియాకు తెలిపారు. 17ఏళ్ల కుర్రాడు ట్రక్కుతో వచ్చి తన కుటుంబం ప్రయాణిస్తున్న కారును ఢీకొట్టడంతో వారంతా

- మిగతా 2 లో

జనంలోకి మళ్లీ రాహుల్

- మణిపూర్ నుంచి ముంబై వరకు
- 14న భారత న్యాయయాత్ర ప్రారంభం

న్యూదిల్లీ: కాంగ్రెస్ అగ్రనాయకుడు రాహుల్‌గాంధీ మరోసారి జనంబాట పట్టనున్నారు. పాదయాత్ర, బస్సుయాత్ర ద్వారా ప్రజలతో మమేకం కావడానికి సన్నద్ధమవుతున్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఎట్టిపరిస్థితుల్లోనూ బీజేపీని ఓడించాలని కాంగ్రెస్ పార్టీ కృతనిశ్చయంతో ముందుకెళుతోంది. బీజేపీకి వ్యతిరేకంగా దేశ ప్రజలను ఏకం చేసేందుకు కొద్ది నెలల క్రితం రాహుల్ గాంధీ 'భారత్ జోడో యాత్ర' చేపట్టిన

- మిగతా 2 లో

బెంగళూరు ఉద్రిక్తం

హోటళ్లు, దుకాణాలపై దాడులు 2లో

కన్నడ భాషలోనే నేమ్‌బోర్డులు ఉండాలంటూ నినాదాలు



విశాఖ వైసీపీలో ముసలం

- పార్టీని వీడుతున్న నేతలు
- ఎమ్మెల్సీ వంశీకృష్ణ జనసేనలో చేరిక

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: విశాఖ వైసీపీలో ముసలం పుట్టింది. ఒక్కొక్కరుగా ఆ ఆ పార్టీని వీడుతున్నారు. వైసీపీలో సముచిత స్థానం దక్కలేదంటూ పక్కచూపులు చూస్తున్నారు. ఇటీవల కొంతమంది కార్పొరేటర్లు వైసీపీకి రాజీనామా చేయగా, మరి కొంతమంది అలకబూని పార్టీకి ఆమడదూరంలో ఉంటున్నారు. తాజాగా

- మిగతా 2 లో

ఇదీ లోకం!

మన పార్టీలో చేరడానికి ఇంకా చాలామంది వెయిట్ చేస్తున్నార్సార్!

రాజ్యసభ నుంచి 55 మంది ఔట్

ఏప్రిల్‌లో మన్మోహన్, నడ్డా సహా 9మంది మంత్రుల పదవీ విరమణ

మార్చిలోనే ఎన్నికలు?

న్యూదిల్లీ: వచ్చే ఏడాది ఏప్రిల్ నాటికి భారీ సంఖ్యలో రాజ్యసభ సభ్యులు పదవీ విరమణ చేయనున్నారు. మొత్తం 55 మంది రాజ్యసభ ఎంపీలు తమ పదవీ కాలాన్ని పూర్తి చేయనుండగా... వీరిలో అత్యధికంగా 27 మంది బీజేపీకి చెందినవారు కాగా... 10 మంది కాంగ్రెస్ నేతలు ఉన్నారు. తెలుగు రాష్ట్రాల పార్టీలు బీజేపీ నుంచి ముగ్గురు, టీడీపీ, వైసీపీ నుంచి ఒక్కొక్కరు కూడా ఈ జాబితాలో ఉన్నారు. అయితే ఈ స్థానాల భర్తీకి మార్చిలోనే ఎన్నికలు జరిగే అవకాశాలున్నాయి. ఏప్రిల్‌లో ఎగువ సభకు వీడ్కోలు పలకనున్న బీజేపీ నేతల్లో ఆ పార్టీ అధ్యక్షుడు జేపీ నడ్డాతోపాటు కేంద్ర మంత్రులు ధర్మేంద్ర ప్రధాన్, అశ్వినీ వైష్ణవ్, మన్సుఖ్ మాండవీయ, భూపేందర్ యాదవ్, నారాయణ రాణే, పరుషోత్తమ్ రూపాలా, రాజీవ్ చంద్రశేఖర్, వి.మురళీధరన్, ఎల్.మురుగన్ తదితరులు ఉన్నారు. మాజీ ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్ పదవీ కాలం కూడా ఏప్రిల్‌తోనే ముగియనుంది. ఉత్తర్‌ప్రదేశ్ నుంచి కాషాయ పార్టీ తరఫున

- మిగతా 2 లో

కిలో బియ్యం రూ. 25కే

మోదీ సర్కారు యోచన

న్యూదిల్లీ: నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదలపై ప్రజాగ్రహం వెల్లువెత్తుతున్న వేళ మోదీ సర్కారు దిద్దుబాటు చర్యలకు పూనుకుంటుంది. మరోపక్క సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తుండటంతో ప్రభుత్వ పెద్దలు వణికిపోతున్నారు. ఆహార పదార్థాలను సామాన్యులకు అందుబాటు ధరల్లో అందించడంలో భాగంగా బియ్యాన్ని డిస్కౌంట్ ధరకు విక్రయించాలని కేంద్రం యోచిస్తున్నట్లు తెలుస్తోంది. త్వరలోనే 'భారత్ రైస్' పేరుతో కిలో బియ్యాన్ని రూ.25కే విక్రయించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం. ఈ మేరకు జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. దేశవ్యాప్తంగా రిటైల్ స్టోర్లలో సగటున కిలో బియ్యం ధర క్రితం ఏడాదితో పోలిస్తే 14.1శాతం పెరిగింది. దీంతో అందుబాటు ధరలో బియ్యాన్ని అందించేందుకు కేంద్రం 'భారత్ రైస్'ను తీసుకురానున్నట్లు సమాచారం. నాఫెడ్, ఎన్‌సీసీఎఫ్, కేంద్రీయ భండార్, మొబైల్ వ్యాన్ల ద్వారా రాయితీ ధరకు బియ్యం విక్రయాలు చేపట్టనున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం భారత్ బ్రాండ్ కింద రూ.60కే కిలో శనగపప్పు,

- మిగతా 2 లో

హమాస్ అంతమయ్యే వరకు

గాజాపై దాడుల్ని ఆపేదిలేదు

ఇందుకు నెలల సమయం పట్టొచ్చు

ఇజ్రాయిల్ సైన్యాధికారి స్పష్టీకరణ

జెరూసలేం: హమాస్ అంతమే లక్ష్యంగా గాజాపై భీకర దాడులను ఇజ్రాయిల్ కొనసాగిస్తోంది. 11 వారాలుగా భూతల, వైమానిక దాడులను తీవ్రతరం చేసింది. ఇప్పటికే దాదాపు 21వేల మంది పలస్తీనియన్ల ప్రాణాలు తీసింది. ఇందులో ఎనిమిది వేల మందికిపైగా చిన్నారులే ఉన్నారు. నిర్విరామంగా భీకర దాడులు జరుపుతూ గాజాలో జీవనం అసాధ్యమన్న పరిస్థితి నెలకొల్పింది. పౌరులతో పాటు మూగజీవాల ప్రాణాలకు రక్షణ లేని పరిస్థితులు ఉన్నాయి. నిత్యావసరాలు అందకుండా చేయడమే కాకుండా మానవతా సాయానికి అడ్డుకుంటూ అక్కడి ప్రజలకు గుక్కెడు నీళ్లు అందకుండా చేస్తూ తీవ్రమైన మానవతా సంక్షోభ పరిస్థితులను ఇజ్రాయిల్ సృష్టించింది. ఇది చాలదన్నట్లు మరికొన్ని నెలలు తమ దాడులు కొనసాగుతాయని ఇజ్రాయిల్ సైన్యాధికారి హెర్జి హవేలీ ప్రకటించారు. 'ఉగ్ర సంస్థ నిర్వీర్యమే లక్ష్యం. ఇందుకు పోరాటమే మార్గం. హమాస్ నాయకత్వాన్ని అంతం చేసే వరకు దాడులు ఆగబోవు. ఇందుకు కొన్ని నెలల సమయం పట్టవచ్చు' అని అన్నారు. అనుకున్నది సాధించే వరకు వెనకడుగు వేసే ప్రసక్తే లేదని హవేలీ పేర్కొన్నారు. గాజాలో రోజురోజుకు క్షీణిస్తున్న పరిస్థితులపై ఐక్యరాజ్య సమితి మానవహక్కుల అధికారి సెయిప్ మగ్సాగో తీవ్ర ఆందోళన వ్యక్తంచేశారు. క్రిస్మస్ రోజు నుంచి ఇజ్రాయిల్ బాంబుల వర్షం ఆగలేదన్నారు. 24 గంటల్లో 241 మంది చనిపోయారని, పౌరుల రక్షణకు ఇజ్రాయిల్ అన్ని రకాల చర్యలు తీసుకోవాలని కోరారు. మంగళవారం దాడుల్లో 100 మందికిపైగా పలస్తీనియన్లు ప్రాణాలు కోల్పోయినట్లు చెప్పారు. ఇప్పటివరకు 20,914 మంది పలస్తీనియన్లు చనిపోయినట్లు గాజా ఆరోగ్యశాఖ బుధవారం ప్రకటించింది. వేలాది మంది శిథిలాల కింద చిక్కుకుపోయినట్లు పేర్కొంది. గుర్తుతెలియని 80 మృతదేహాలను మంగళవారం ఖననం చేసినట్లు గాజా అధికారులు వెల్లడించారు. వీరంతా ఎవరో గుర్తించే వీలుగా చిత్రాలు తీసివుంచినట్లు ఇస్లామిక్ వక్ఫ్ శాఖ తెలిపింది.

మావో ఆశయాల సాధనే లక్ష్యం: జిన్‌పింగ్

బీజింగ్: చైర్మన్ మావో జెడాంగ్ ఆశయాల సాధనే లక్ష్యమని చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ అన్నారు. దేశం కోసం, దేశ ప్రజల కోసం తన జీవితాన్ని అర్పించిన మహా నాయకుడు మావో అని, ఆయన ఆలోచనలు, ఆశయాలను ముందుకు తీసుకెళ్లడం ద్వారా దేశాన్ని మరింతగా అధునికీకరించడమే ధ్యేయమని చెప్పారు. మావో జెడాంగ్ 130వ జయంతి సందర్భంగా మావో మెమోరియల్ హాలులో మావో విగ్రహానికి అధ్యక్షుడు జిన్‌పింగ్, ప్రధాని లి కియాంగ్‌తో పాటు అగ్ర నాయకులు జావో లెజి, వాంగ్ హునింగ్, కై క్వీ తదితరులు తమ సంప్రదాయ ప్రకారం నివాళులర్పించారు. అనంతరం బీజింగ్‌లోని గ్రేట్ హాల్ ఆఫ్ ది పీపుల్‌లో చైనా కమ్యూనిస్టు పార్టీ (సీపీసీ) కేంద్ర కమిటీ నిర్వహించిన సదస్సులో జిన్‌పింగ్ స్మారకోపన్యాసం చేశారు. మావో జెండాగ్ ఆలోచనలను, ఆశయాలు అనుసరణీయమని, అవి తమకు మార్గదర్శకాలని అన్నారు. వాటిని ముందుకు తీసుకెళ్లడం కమ్యూనిస్టుల కర్తవ్యమని చెప్పారు. చైనాను మరింత శక్తిమంతమైన దేశంగా నిలిపేందుకు కసరత్తు జరగాలని పిలుపునిచ్చారు. చైనా అధునికీకరణ అన్ని రంగాల్లో జరగాలన్నారు. మావో జెడాంగ్ ఆలోచనలు, ఆశయాలు పార్టీకి విలువైన ఆధ్యాత్మిక సంపద, మార్గదర్శకాలు అని జిన్‌పింగ్ వర్ణించారు. ఆయన చూపిన మార్గంలో ముందుకెళ్లి విజయం సాధించడం ద్వారా మావోకు నిజమైన నివాళి ఇవ్వగలమన్నారు. దేశ సుసంపన్నతకు, ప్రజల సంతోషానికి మావో తన జీవితం మొత్తం కృషిచేశారని, ఆధునిక సమాజం స్థాపనకు పాటుపడ్డారని, ఆయన సేవలు మరువలేనివని జిన్‌పింగ్ శ్లాఘించారు. కొత్త ప్రయాణంలో మూలాలను, వాస్తవ ఉద్దేశాలను మర్చిపోరాదని సూచించారు. చైనా అధునికీకరణ కోసం శ్రమించాలని పిలుపునిచ్చారు. సంపూర్ణ చైనా సాధించాలని లక్ష్యం పెట్టుకున్నట్లు చెప్పారు. శాంతి, అభివృద్ధి, సహకారం, పరస్పర ప్రయోజనాలకు అంకితం కావాలని కమ్యూనిస్టులకు పిలుపునిచ్చారు. అంతర్జాతీయ అభివృద్ధి- భద్రతా కార్యక్రమాలకు తమ వంతు సహకారాన్ని చైనా అందిస్తుందని జిన్‌పింగ్ చెప్పారు. అలా చేయడం ద్వారా సమ్మిళిత, స్వచ్ఛ, సుందర ప్రపంచం సృష్టికి, శాంతి, అంతర్జాతీయ భద్రత, ఉమ్మడి సుస్థిరతకు దోహదం కాగలదని అన్నారు. చైనా అభివృద్ధితోనే అంతర్జాతీయ శాంతి దళాలు బలోపేతం కాగలవన్నారు. ఆధిపత్యాన్ని, విస్తరణవాదాన్ని చైనా ప్రోత్సహించబోదని జిన్‌పింగ్ స్పష్టం చేశారు.

అర్జెంటైనా ప్రభుత్వ నయా-ఫాసిస్టు విధానాలు తిప్పికొట్టాలి

డబ్ల్యూఎఫ్‌టీయూ పిలుపు

ఏథెన్స్: అర్జెంటైనాలోని జేవియర్ మిలే ప్రభుత్వం అనుసరిస్తున్న నయా -ఫాసిస్టు విధానాలను ప్రపంచ కార్మిక సంఘాల సమాఖ్య (డబ్ల్యూఎఫ్‌టీయూ) తీవ్రంగా ఖండించింది. ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చింది. అప్రజాస్వామిక ప్రోటోకాల్స్, తీవ్రస్థాయిలో కార్మికవర్గాన్ని బెదిరించడం, అణచి వేసేందుకు ప్రయత్నించడం, సామాజిక న్యాయానికి ముప్పు వాటిల్లజేయడం వంటి వాటిని ప్రతిఘటించాలని డబ్ల్యూఎఫ్‌టీయూ నొక్కిచెప్పింది. అర్జెంటైనా కార్మికులు, కార్మిక సంఘాల ఉద్యమాలకు సంపూర్ణ సంఘీభావాన్ని ప్రకటించింది. ప్రభుత్వ సంస్థల ప్రైవేటీకరణకు జరుగుతున్న ప్రయత్నాలను దుయ్యబట్టింది. కార్మిక హక్కుల అణచివేత, ప్రభుత్వ నయాఉదారవాద అజెండా అమలు చేస్తుండటాన్ని ఆక్షేపించింది. 133 దేశాల్లోని 105 మిలియన్ల మందికి డబ్ల్యూఎఫ్‌టీయూ ప్రాతినిధ్యం వహిస్తోంది.

విశాఖ వైసీపీలో ముసలం

(మొదటిపేజీ తరువాయి)

బుధవారం వైసీపీ ఎమ్మెల్సీ వంశీకృష్ణ శ్రీనివాస్ యాదవ్ మంగళగిరిలో జనసేన అధినేత పవన్ కల్యాణ్ సమక్షంలో ఆ పార్టీలో చేరారు. వంశీకృష్ణ విశాఖ తూర్పు నియోజకవర్గం నుండి 2009లో ప్రజారాజ్యం పార్టీ నుంచి పోటీ చేసి ఓడిపోయారు. 2014లో వైసీపీ నుండి పోటీ చేశారు. 2019లో వైసీపీ టికెట్ దక్కలేదు. నాడు విజయనిర్మలకు వైసీపీ టికెట్ ఇచ్చినా టీడీపీ నుండి వెలగపూడి రామకృష్ణ బాబు గెలుపొందారు. వైసీపీ విశాఖ జిల్లా అధ్యక్షుడిగా మూడేళ్ల పనిచేశారు. అనంతరం జరిగిన గ్రేటర్ మున్సిపల్ ఎన్నికల్లో 21వ వార్డు నుండి కార్పొరేటర్‌గా గెలుపొందారు. యాదవ సామాజిక వర్గానికి మేయర్ పదవి దక్కుతుందని ఆశించిన వంశీకృష్ణకు ఆఖరి నిమిషంలో భంగపాటు తప్పలేదు. అదే సామాజిక వర్గానికి చెందిన గోలగాని హరి వెంకట కుమారికి మేయర్ పదవి దక్కడంతో తీవ్ర అసంతృప్తి చెందిన వంశీకృష్ణకు ఎమ్మెల్సీ పదవి ఇచ్చి వైసీపీ నేతలు బుజ్జగించారు. ఇదే నియోజకవర్గం ఇన్‌చార్జి అక్రమాని విజయనిర్మలకు కొంతకాలం తర్వాత వీఎంఆర్‌డీఏ చైర్మన్ పదవి కట్టబెట్టారు. విశాఖ తూర్పు టికెట్ రేసులో ఉన్న యాదవ సామాజిక వర్గ నేతలైన వంశీకృష్ణ శ్రీనివాస్, అక్రమాని విజయనిర్మల, గొలగాని హరి వెంకట కుమారి మేయర్‌లను కాదని తాజాగా విశాఖ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణకు తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించడంతో స్థానిక నేతలంతా తీవ్ర అసంతృప్తితో రగిలిపోతున్నారు. దాదాపు 10 ఏళ్లపాటు వైసీపీలో క్రియాశీల నేతగా కొనసాగినా పార్టీలో తనకు మనుగడ లేదని భావించిన వంశీకృష్ణ తాజాగా జనసేన పార్టీలో చేరారు. తొలి నుండి వంశీకృష్ణ విశాఖ తూర్పు నియోజకవర్గం వైసీపీ టికెట్ కావాలని పట్టుబడుతున్నారు. మేయర్ పదవిని ఆశగా చూపి కార్పొరేటర్‌గా పోటీకి దింపిన వైసీపీ పెద్దలు...చివరి నిమిషంలో మేయర్ పదవి సైతం ఇవ్వలేదు. అందుకే వంశీకృష్ణ పార్టీ మారినట్లు ఆయన అనుచరులు అంటున్నారు.

వైసీపీ విశాఖ జిల్లా అధ్యక్షులుగా ఉన్న మాజీ ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు ఇప్పటికే వైసీపీకి రాజీనామా చేసి జనసేనలో చేరారు. ఇటీవల 39వ వార్డు కార్పొరేటర్ మహమ్మద్ సాదిక్ సైతం వైసీపీ నుంచి బయటికి వచ్చారు. మరో 10 మంది కార్పొరేటర్లు కూడా వైసీపీని వీడి జనసేన, టీడీపీలో చేరతారని ప్రచారం సాగుతోంది. గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి కుమారుడు తిప్పల దేవాన్‌ను నియోజకవర్గ ఇన్‌చార్జి బాధ్యతల నుంచి తప్పించిన వెంటనే రాజీనామాకు ఉపక్రమించారు. వెంటనే ఉత్తరాంధ్ర వైసీపీ ఇన్‌చార్జి వైవీ సుబ్బారెడ్డి రంగంలోకి దిగి బుజ్జగించడంతో రాజీనామా ఊసు బయటికి రాలేదు. మరోపక్క ఉమ్మడి విశాఖ జిల్లాలో చోడవరం ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ, పాయకరావుపేట ఎమ్మెల్యే గొల్ల బాబురావు, విశాఖ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు, మాజీ ఎమ్మెల్యేలు మల్ల విజయప్రసాద్, తైనాల విజయ్‌కుమార్, ఎస్ఏ రెహమాన్ వంటి నేతలు వైసీపీని వీడతారని జోరుగా ప్రచారం సాగుతోంది.

మంతనాలు...బుజ్జగింపులు

(మొదటిపేజీ తరువాయి)

ఎన్నికల్లో పోటీ చేయబోనని గిద్దలూరు వైసీపీ ఎమ్మెల్యే రాంబాబు ప్రకటించారు.రాజకీయాల నుంచి తాను తప్పుకుంటున్నట్లు ప్రకటించడం చర్చనీయాంశంగా మారింది. రాష్ట్ర మంత్రి ఉషశ్రీ చరణ్‌కు స్థాన చలనం కలగనున్నట్లు సీఎం చెప్పారు. మొత్తం మీద వైసీపీ ఇన్‌చార్జిల మార్పుతో ఆ పార్టీలో కలవరం నెలకొంది. టికెట్లు దక్కబోవని తెలిసిన వారంతా ఇతర పార్టీలవైపు వెళ్లేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేశారు. దీనిని గుర్తించిన అధిష్ఠానం వారికి సర్ది చెప్పినప్పటికీ ఫలితం కనిపించడం లేదు. కాగా, తాను కొవ్వూరు నుంచే పోటీ చేస్తానని, ఒకవేళ టికెట్ ఇవ్వకపోయినా...మరో చోటకు పంపినా పార్టీని వదిలేది లేదని రాష్ట్ర హోంమంత్రి తానేటి వనిత స్పష్టంచేశారు. కాగా పాయకరావుపేట ఎమ్మెల్యే గొల్ల బాబురావును రాజ్యసభకు పంపించే యోచనలో వైసీపీ అధిష్ఠానం ఉన్నట్లు తెలుస్తోంది.

సీఎం జోక్యం చేసుకోవాలి

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: అంగన్‌వాడీల వేతనాలు, గ్రాట్యూటీ, తదితర సమస్యల్ని ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని వామపక్షాలు డిమాండ్ చేశాయి. ఈ మేరకు సీపీఐ, సీపీఎం రాష్ట్ర కార్యదర్శులు కే రామకృష్ణ, వీ శ్రీనివాసరావుతోపాటు సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకులు వై సాంబశివరావు, సీపీఐ(ఎంఎల్) నుంచి జాస్తి కిశోర్‌బాబు, ఎంసీపీఐ(యూ) నాయకులు కాటం నాగభూషణం, సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ నాయకులు ఎన్.మూర్తి, సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ నుంచి చిట్టిపాటి వెంకటేశ్వర్లు, ఎస్‌యూసీఐ(సీ) నుంచి బీఎస్ అమర్‌నాథ్, ఫార్వర్డ్ బ్లాక్ నుంచి పీవీ సుందరరామరాజు, రివల్యూషనరీ సోషలిస్ట్ పార్టీ నాయకులు జానకి రాములు బుధవారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి సంయుక్తంగా లేఖ రాశారు. లక్ష మందికి పైగా అంగన్‌వాడీ ఉద్యోగులు 15 రోజులకు పైగా సమ్మె చేస్తున్నప్పటికీ... వారి సమస్యల్ని పరిష్కరించే దిశగా ప్రభుత్వం ప్రయత్నించ లేదన్నారు. ఈనెల 26 రాత్రి జరిగిన చర్చలు విఫలమయ్యాయని... పైగా ఈ సమస్య ఇంత వరకు ప్రభుత్వ దృష్టికి తీసుకురాలేదని మంత్రులు చెప్పడం ఆశ్చర్యకరంగా ఉందని... మంత్రి, అధికారులు అంగన్‌వాడీలను బెదిరించినట్లుగా వార్తలు వచ్చాయని తెలిపారు. సమ్మెను పరిష్కరించడానికి బదులుగా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తామని చెప్పడం విచారకరమన్నారు. అంగన్‌వాడీలలో అత్యధికులు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఒంటరి మహిళలున్నారని వివరించారు. వారంతా అత్యంత దుర్భర జీవితాలు గడుపుతున్నారని తెలిపారు. అలాంటి మహిళల పట్ల రాష్ట్ర ప్రభుత్వం సానుకూలంగా వ్యవహరించాలని కోరారు. ఇప్పటికైనా సీఎం జగన్ తక్షణమే జోక్యం చేసుకుని వారి న్యాయమైన కోర్కెలను పరిష్కరించి సమ్మెను విరమింపజేయాలని విజ్ఞప్తి చేశారు. నాలుగైదేళ్లకోసారి వేతన సవరణ కోసం ఏ రంగంలోనైనా కార్మికులు, ఉద్యోగులు పోరాడతారని, ఇది సర్వసాధారణమని పేర్కొన్నారు. అంగన్‌వాడీల వేతనాల పెంపుదల, గ్రాట్యూటీ చెల్లింపు డిమాండ్లు న్యాయసమ్మతమైనవిగా భావిస్తున్నామని తెలిపారు. గుజరాత్ అంగన్‌వాడీల గ్రాట్యూటీ సమస్య సందర్భంగా సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు... అంగన్‌వాడీలు వర్కర్లేనని పేర్కొన్నదని, యాజమాన్యం-కార్మిక సంబంధం ఉందని, ప్రభుత్వమే నియమించి పదవీ విరమణ తో సహా కొన్ని నిబంధనల ప్రకారం వారితో పని చేయించుకుంటోందని, వారికిచ్చే వేతనం గౌరవ వేతనం కాదనీ, వేతనమేనని స్పష్టం చేసిందని గుర్తుచేశారు. ఈ రీత్యా చూసినప్పుడు అంగన్‌వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి కనీస వేతనాలు ఇవ్వాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. మన రాష్ట్రం కంటే దేశంలో తెలంగాణ సహా ఏడు రాష్ట్రాల్లో అంగన్‌వాడీలకు వేతనాలు అధికంగా ఉన్నాయని తెలిపారు. తెలంగాణ కంటే నెలకు వెయ్యి రూపాయల చొప్పున అదనంగా వేతనాలు చెల్లిస్తామని సీఎం హామీ ఇచ్చారని, పక్కన ఉన్న తమిళనాడుతో సహా అనేక రాష్ట్రాల్లో సంవత్సరానికి రూ.500 చొప్పున వేతనాలు పెంచుతున్నారన్నారు. మినీ అంగన్‌వాడీలలో పనిచేసేవారు అత్యధిక భారం మోస్తూ తక్కువ వేతనం పొందుతున్నారని, వాటిని పూర్తిస్థాయి కేంద్రాలుగా మార్చి వారి వేతనాలు పెంచాలని కోరారు. పదవీ విరమణ చేసిన అంగన్‌వాడీలు గ్రాట్యూటీకి అర్హులని గుజరాత్ రాష్ట్రానికి సంబంధించిన కేసులో సుప్రీంకోర్టు తీర్పు చెప్పిందని... ఆ ప్రకారంగా గుజరాత్‌తో పాటుగా మన పక్కనున్న కర్నాటకలో ఈ ఆర్థిక సంవత్సరం నుంచి గ్రాట్యూటీ చెల్లిస్తున్నారన్నారు. సుప్రీంకోర్టు తీర్పు స్పష్టంగా ఉన్నప్పటికీ కోర్టుకు వెళ్లి ఆర్డర్లు తెచ్చుకోమని చెప్పడం సమంజసం కాదన్నారు. అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు, మినీలకు చెల్లించే వేతనం చాలా అధమ స్థాయిలో ఉందని... ఎప్పుడో 2006లో ప్రైవేట్ కార్మికులకు ప్రభుత్వం నిర్ణయించిన వేతనం కంటే చాలా తక్కువగా ఉందన్నారు. దేశంలోని అనేక రాష్ట్రాల్లో పెన్షన్ సౌకర్యం కల్పిస్తున్నారన్నారు. గర్భిణీలు, బాలింతలు, పిల్లలకు పోషకాహారం లేకుండా మరింత కాలం ఉంచడం భావ్యం కాదని, ఎప్పటినుండో అంగన్‌వాడీలు ప్రభుత్వానికి వినతులు ఇస్తున్నప్పటికీ ప్రభుత్వం స్పందించలేదన్నారు. తప్పని సరి పరిస్థితుల్లో సమ్మెలోకి వెళ్లారని తెలిపారు. పిల్లలను అంగన్‌వాడీ స్కూల్‌కు తీసుకురావడం, వారికి సేవలు చేయడం, ఇంటికి దింపి రావడం అంగన్‌వాడీలు చేస్తున్నారని వివరించారు. లబ్ధిదారులు సైతం అనేక చోట్ల సమ్మెకు మద్దతుగా నిలబడుతున్నారని స్పష్టం చేశారరు. జనవరి 1 నుంచి అంగన్‌వాడీ కేంద్రాలను తెరిచేందుకు ఏర్పాట్లు చేస్తామని మంత్రివర్గం హెచ్చరించడం సమంజసం కాదన్నారు. ప్రభుత్వం ప్రతిష్ఠకు పోకుండా వెంటనే వారి సమస్యలు పరిష్కారం చేయాలని కోరారు. ఏజెన్సీ ప్రాంతంలో, మారుమూల గ్రామాల్లో 5,606 మినీ సెంటర్లు మెయిన్ సెంటర్‌లుగా మారుస్తూ వెంటనే జీవో ఇవ్వాలన్నారు. సీఎం జగన్ వ్యక్తిగతంగా చొరవ తీసుకొని వేతనాలు, గ్రాట్యూటీ సమస్యలను పరిష్కరించి సమ్మెను విరమింపజేయాలని ఆ లేఖలో వామపక్ష పార్టీల నేతలు కోరారు.

జనంలోకి మళ్లీ రాహుల్

(మొదటిపేజీ తరువాయి)

విషయం తెలిసిందే. తాజాగా ఆయన మరోసారి యాత్రకు సిద్ధమయ్యారు. ఈసారి దేశంలోని తూర్పు నుంచి పశ్చిమ ప్రాంతం వరకు 'భారత్ న్యాయ యాత్ర' చేపట్టనున్నట్లు కాంగ్రెస్ బుధవారం ప్రకటించింది. వచ్చే ఏడాది సార్వత్రిక ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో రాహుల్ యాత్ర ప్రాధాన్యం సంతరించుకుంది. వచ్చే ఏడాది జనవరి 14 నుంచి మార్చి 20వ తేదీ వరకు ఈ యాత్ర నిర్వహించనున్నట్లు ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ మీడియాకు వెల్లడించారు. మణిపూర్ నుంచి ముంబై వరకు మొత్తం 6,200 కి.మీ మేర భారత్ న్యాయయాత్ర నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ యాత్రలో మహిళలు, యువత, బలహీనవర్గాల ప్రజలతో ఆయన ముచ్చటించనున్నట్లు పేర్కొన్నారు. మణిపూర్ నుంచి ప్రారంభమయ్యే ఈ న్యాయ యాత్ర... నాగాలాండ్, అసోం, మేఘాలయ, పశ్చిమ బెంగాల్, బీహార్, ఝార్ఖండ్, ఒడిశా, ఛత్తీస్‌గఢ్, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, రాజస్థాన్, గుజరాత్ మీదుగా సాగి మహారాష్ట్రకు చేరనుంది. ఈసారి మొత్తం 14 రాష్ట్రాల్లోని 85 జిల్లాల్లో యాత్ర కొనసాగుతుంది. అయితే, గతంలో మాదిరిగా పూర్తిగా పాదయాత్ర కాకుండా... ఈసారి బస్సుయాత్ర చేపట్టనున్నట్లు వేణుగోపాల్ తెలిపారు. మధ్యమధ్యలో పాదయాత్ర ఉంటుందన్నారు. గతేడాది సెప్టెంబరు 7న రాహుల్ గాంధీ... భారత్ జోడో యాత్ర చేపట్టిన విషయం తెలిసిందే. కన్యాకుమారిలో మొదలైన ఈ యాత్ర... దాదాపు ఐదు నెలల పాటు 4500 కిలోమీటర్ల మేర 12 రాష్ట్రాల్లో సాగింది. కశ్మీర్‌లోని లాల్‌చౌక్‌లో జాతీయ జెండా ఎగురవేసి యాత్రను ముగించారు. రాహుల్‌గాంధీ పాదయాత్ర చేస్తున్న సమయంలో ఆయా రాష్ట్రాలకు చెందిన ప్రముఖులు సంఘీభావం తెలిపారు. అప్పుడు దక్షిణ భారత్ నుంచి ఉత్తరాది వరకు యాత్ర చేపట్టిన రాహుల్‌గాంధీ... ఈ సారి తూర్పు నుంచి పశ్చిమ వరకు బస్సుయాత్రలో పాల్గొననున్నారు.

రాజ్యసభ నుంచి 55 మంది ఔట్

(మొదటిపేజీ తరువాయి)

ప్రాతినిధ్యం వహిస్తున్న జీవీఎల్ నరసింహారావు పదవీకాలం కూడా ఏప్రిల్‌తో పూర్తికానుంది. రాజస్థాన్ నుంచి రాజ్యసభ ఎంపీగా మాజీ ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్ ఉన్నారు. ఏప్రిల్‌తో ఆయన పదవీకాలం ముగియనుంది. ప్రస్తుతం అనారోగ్యం కారణంగా ఆయన నడవలేని స్థితిలో ఉన్నారు. కాబట్టి మళ్లీ పెద్దల సభకు పోటీ చేయకుండా తప్పుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి. అయితే రాజ్యసభకు మార్చిలో జరిగే ఎన్నికల్లో ఉత్తర్‌ప్రదేశ్‌లో బీజేపీకు ఆరు, సమాజ్‌వాదీ పార్టీకి మూడు సీట్లు వచ్చే అవకాశాలున్నాయి. మహారాష్ట్రలోని ఆరు సీట్లను బీజేపీ, ప్రతిపక్షాలు ప్రస్తుతం ఉన్నట్లే సగం సగం పంచుకొనే సూచనలు కనిపిస్తున్నాయి. బీహార్‌లో జేడీయూ, ఆర్‌జేడీ కూటమి మెజార్టీ సీట్లు కైవసం చేసుకోవడం దాదాపుగా ఖాయమే. గుజరాత్‌లో రెండు సీట్లను కాంగ్రెస్ నుంచి బీజేపీ లాగేసుకునే అవకాశాలున్నాయి. బీజేపీ రాజస్థాన్‌లో కూడా మరో సీటును అధికంగా గెలుచుకుని ఉత్తరాఖండ్, చత్తీస్‌గఢ్, హరియాణా, మధ్యప్రదేశ్‌ల్లో ఇప్పుడున్న బలాన్ని నిలబెట్టుకునే వీలుంది. కాగా హిమాచల్‌ప్రదేశ్‌లోని స్థానాన్ని కాంగ్రెస్‌కు బీజేపీ కోల్పోనుంది. దీంతో ప్రస్తుతం హిమాచల్ ప్రదేశ్ నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా వేరే రాష్ట్రానికి మారాల్సి వస్తుంది. కర్నాటకలో కాంగ్రెస్ తన బలాన్ని నిలుపుకుని, తెలంగాణలో రెండు సీట్లు లాభపడే వీలుంది. ఇక్కడ బీజేపీ రెండింటిని కోల్పోయి ఒక సీటును నిలబెట్టుకునే సూచనలు ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో అధికార వైసీపీ ఇప్పుడున్న ఒక సీటుకు అదనంగా మరో రెండు స్థానాలను గెలుచుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి.

బెంగళూరు ఉద్రిక్తం

బెంగళూరు: వాణిజ్య, వ్యాపార సంస్థల పేర్లలో '60శాతం కన్నడ' అక్షరాలే ఉండాలన్న నిబంధనను అమలు చేసేందుకు కర్నాటక ప్రభుత్వం సిద్ధమవుతోంది. ఇందుకు సంబంధించి ఆదేశాలు జారీచేసింది. దీనికి మద్దతుగా కర్నాటక రక్షణ వేదిక పేరుతో రాష్ట్రవ్యాప్తంగా ర్యాలీలు జరిగాయి. ఇందులో భాగంగా బెంగళూరులో నిర్వహించిన ర్యాలీలు ఉద్రిక్తతకు దారితీశాయి. కెంపెగౌడ అంతర్జాతీయ విమానాశ్రయంతోపాటు అనేక ప్రాంతాల్లో రెచ్చిపోయిన ఆందోళనకారులు హోటళ్లు, దుకాణాలపై ఆంగ్లంలో ఉన్న నేమ్‌బోర్డులను తొలగించారు. ఇందుకు సంబంధించిన వీడియోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. కన్నడలో నేమ్‌బోర్డులకు సంబంధించి బెంగళూరు నగరపాలక సంస్థ ఇచ్చిన ఆదేశాలను తక్షణమే అమలు చేయాలని డిమాండు చేస్తూ కర్నాటక రక్షణ వేదిక కార్యకర్తలు బెంగళూరులో ర్యాలీ చేపట్టారు. నగరంలోని కొన్ని దుకాణాల నామఫలకాలు తొలగించేందుకు యత్నించారు. హోటళ్లు, దుకాణాల బయట ఆంగ్లంలో ఉన్న బోర్డులు ధ్వంసం చేశారు. మరికొన్ని షాపుల పేర్లపై నల్లరంగు చల్లారు. ఆందోళనకారుల చర్యలను అడ్డుకున్న పోలీసులు... అదుపులోకి తీసుకున్నారు. ఈ వివాదంపై బృహత్ బెంగళూరు మహానగర సంస్థ ప్రధాన కమిషనర్ తుషార్ గిరినాథ్ స్పందించారు. ఈ ఆదేశాలు ఫిబ్రవరి 28 నుంచి అమల్లోకి వస్తాయని, వాటిని పాటించకుంటే సంస్థలపై చర్యలు ఉంటాయన్నారు. వాణిజ్య, వ్యాపార సంస్థలు కన్నడ బోర్డులు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలంటూ కర్నాటక రక్షణ వేదిక చేసిన విజ్ఞప్తిపై రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. కన్నడ భాషకు ప్రాధాన్యం ఇవ్వాలని నిర్ణయించింది. వాణిజ్య, వ్యాపార సంస్థలు, దుకాణాల నామఫలకాల్లో 60శాతం కన్నడ అక్షరాలే ఉండాలని ఆదేశించింది. ఈ నిబంధన ఫిబ్రవరి చివర నుంచి అమల్లోకి రానున్నట్లు ముఖ్యమంత్రి సిద్దరామయ్య వెల్లడించారు. వ్యాపారులంతా వీటిని తప్పనిసరిగా అమలు చేయాలన్నారు.

కాంగ్రెస్ బలోపేతం!

(మొదటిపేజీ తరువాయి)

రుద్రరాజు, సీడబ్ల్యూసీ సభ్యుడు రఘువీరారెడ్డి, పల్లంరాజు, ముఖ్య నేతలు హాజరయ్యారు. లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికల సన్నద్ధతతో పాటు కొత్తగా ఆపార్టీలోకి వచ్చే వారిపైనా చర్చించారు. కాంగ్రెస్‌కు ఎలాగైనా ఏపీలో పూర్వ వైభవం తీసుకొచ్చేందుకు వచ్చే ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలని, అందుకు కావాల్సిన అనుకూల రాజకీయ పరిస్థితులపై చర్చించారు. ఇప్ప టికే దేశ వ్యాప్తంగా కాంగ్రెస్ నేతృత్వంలో వివిధ పార్టీలు కలిపి ఇండియా కూటమిగా ఏర్పాటయ్యాయి. ఈ కూటమి ఏర్పాటు తర్వాత జరిగిన రాష్ట్రాల అసెం బ్లీ ఎన్నికల్లో, కూటమి భాగస్వామ్య పార్టీలతో ఆయా రాష్ట్రాల్లో సీట్ల సర్దుబాటు, కలిసి పోటీ చేయడంలో కాంగ్రెస్ విఫలమైంది.

పర్యవసానంగా కాంగ్రెస్ మూడు రాష్ట్రాల్లో ఓటమి పాలైంది. భవిష్యత్‌లో జరిగే ఎన్నికల్లో అలాంటి తప్పిదాలు కొనసాగకుండా, ఐక్యంగా ముందుకు పోవాలని విపక్షాలు సూచిస్తు న్నాయి. ఏపీలో జరిగే ఎన్నికల్లో ఇండియా కూటమిలో ఉన్న పార్టీలతో కలిసి కాంగ్రెస్ పోటీ చేస్తుందా? లేదా? అనేదీ తేలాల్సి ఉంది. 2019 ఎన్నికల్లో కాంగ్రెస్‌కు 1.17 ఓటింగ్ శాతం మాత్రమే ఉంది. ఇంత తక్కువగా ఉన్న ఓటింగ్ శాతంతో రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ ఎలా తన సత్తా చాటుతుందనేదీ ఆ పార్టీ అధిష్ఠానానికి అంతుచిక్కడం లేదు. దీనిని దృష్టిలో ఉంచుకుని ఈ మూడు నెలల్లో ప్రజల్లోకి విస్తృతంగా వెళ్లేందుకు కాంగ్రెస్ ప్రణాళిక రచిస్తోంది. 175 నియోజకవర్గాల్లో పార్టీ అభ్యర్థులను పోటీలోకి దించేందుకు సమాయాత్తమైంది.

సంస్థాగతంగా వెనుకబాటు

ఏపీలో కాంగ్రెస్ సంస్థాగతంగా పూర్తిగా వెనుకబాటుకు గురైంది.. దాదాపు పదేళ్ల నుంచి కాంగ్రెస్ బలోపే తంపై పార్టీ నేతలు కృషి చేసినప్పటికీ ఫలించలేదు. ఇటీవల కాలంలో పార్టీలోకి ద్వితీయ, తృతీయ శ్రేణి నాయకత్వం చేరడం ఆ పార్టీ నేతల్లో కొంత సంతో షం నెలకొంది. అయితే కొత్తగా వచ్చిన వారిలో ఎమ్మెల్యే, లేదా ఎంపీ స్థాయి పోటీ చేసే నేతలు లేరు. 175 నియోజకవర్గాల్లో కాంగ్రెస్‌కు బలమైనవి ఉన్నా యని చెప్పుకునే పరిస్థితి లేదు. గతంలో ఉన్న కాంగ్రెస్‌కు ఉన్న ఓటు బ్యాంక్ అంతా వైసీపీ చేతిలోకి వెళ్లిపోయింది. 2014, 2019 ఎన్నికల్లో కాంగ్రెస్ పోటీ చేసినప్పటికీ తన సాంప్రదాయ ఓట్ బ్యాంక్‌ను తిరిగి రప్పించుకోలేకపోయింది. వాటిని దృష్టిలో ఉంచుకుని రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపే లక్ష్యంగా పార్టీ అధిష్ఠానం సన్నద్ధత సమావేశాలను ప్రారంభించింది. పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేయడంతోపాటు ఏపీలోని ప్రధాన సమస్యలపై మూడు ప్రాంతాల్లో బహిరంగ సభల నిర్వహణకు కాంగ్రెస్ అధిష్ఠానం ప్రణాళిక రూపొందిస్తున్నట్లు తెలిసింది. వాటికి అగ్రనేతలు సోనియా, రాహుల్, ప్రియాంకను ఆహ్వానించేందుకు ఆ పార్టీ రాష్ట్ర నాయకత్వం కార్యాచ రణ రూపొందిస్తోంది. మరోవైపు పార్టీలోకి కొత్తవారిని ఆహ్వానించే దిశగా కార్యక్రమాలకు శ్రీకారం చుట్టనుంది.

షర్మిల ఎంట్రీ? :

ఏపీ కాంగ్రెస్‌లోకి తెలంగాణ వైఎస్ఆర్‌టీపీ అధినేత్రి షర్మిల ప్రవేశిస్తున్నారన్న ప్రచారం కాంగ్రెస్ శ్రేణులకు కాస్త ఊరటనిస్తుండగా... వైసీపీలో మాత్రం ఆందోళన నెలకొంది. తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సమయంలో ఆమె కాంగ్రెస్‌లో కలిసేందుకు చాలా ప్రయత్నాలు చేశారు. ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి ఆమెను అడ్డుకోవడంతోనే షర్మిల చేరిక నిలిచిపోయిందన్న ప్రచారం ఉంది. ఆమె పార్టీని కాంగ్రెస్‌లోకి విలీనం చేయకపోయినప్పటికీ, కాంగ్రెస్‌కే మద్దతును ప్రకటించారు. తెలంగాణ రాష్ట్రంలో పూర్తిగా ఆమె రాజకీయ కార్యకలాపాలు విఫలమవ్వడంతో... ఇప్పుడు ఆమె దృష్టి ఏపీపై పడినట్లుగా వార్తలు వస్తున్నాయి. కాంగ్రెస్‌లోకి తన పార్టీని విలీనం చేసి, దాని ద్వారా ఏపీలోకి ప్రవేశించేందుకు షర్మిలతో కొందరు కీలక నేతలు ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే వైసీపీలో టికెట్లు రావని తెలిసి, అసంతృప్తిగా ఉన్న ఇద్దరు ఎమ్మెల్యేలకు కాంగ్రెస్ సీనియర్ నేత కేవీపీ రామచంద్రరావు ఫోన్లు చేస్తున్నట్లు సమాచారం. షర్మిల భర్త అనిల్‌కుమార్ సైతం ఏపీలోని ఆయన మత వర్గానికి చెందిన వారితో ఫోన్లలో సంప్రదింపులు చేస్తున్నట్లుగా సామాజిక మాధ్యమాల్లో ప్రచారముంది. కాగా కాంగ్రెస్‌లో షర్మిల చేరికను ఆమె తల్లి వైఎస్ విజయమ్మ పూర్తిగా వ్యతిరేకిస్తున్నట్లు తెలిసింది. వైఎస్ రాజశేఖరరెడ్డి మరణానంతరం ఆమె తనయుడైన, ప్రస్తుత సీఎం జగన్‌ను కాంగ్రెస్ అధిష్ఠానం అనేక ఇబ్బందులకు గురిచేసి, జైలుకు పంపిందని... వాటన్నింటినీ మరచి కాంగ్రెస్‌లోకి వెళ్లడంపై ఆమె అభ్యంతరం వ్యక్తం చేస్తున్నట్లు సమాచారం. తెలంగాణలో షర్మిల పార్టీ పెట్టడంతో విజయమ్మ కూడా ఏపీలోని వైసీపీ గౌరవాధ్యక్షురాలి బాధ్యతల నుంచి తప్పుకుని ఆమెతో వెళ్లిపోయారు. ఇప్పుడు షర్మిల కాంగ్రెస్ తీర్థం పుచ్చుకుంటే, విజయమ్మ మళ్లీ ఏపీలోని వైసీపీలోకి ప్రవేశించే అవకాశాలున్నాయి. అయితే కాంగ్రెస్‌లో చేరికపై ఇంతవరకు షర్మిల అధికారికంగా ఎటువంటి ప్రకటన చేయకపోవడం గమనార్హం.

9 మంది డీఐజీలకు ఐజీలుగా పదోన్నతి

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: రాష్ట్రంలో తొమ్మిది మంది డీఐజీలకు ఐజీలుగా పదోన్నతి లభించింది. డీఐజీలకు ఐజీలుగా పదోన్నతి కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కేఎస్ జవహర్‌రెడ్డి బుధవారం ఉత్వర్వులు జారీ చేశారు. ఐజీలుగా పదోన్నతి పొందిన వారిలో ఏలూరు రేంజ్ డీఐజీ జీవీజీ అశోక్ కుమార్, విశాఖపట్నం రేంజ్ డీఐజీ హరికృష్ణ, ఇంటిలిజెన్స్ డీఐజీ కొల్లి రఘురామరెడ్డి, ఆక్టోపస్ డీఐజీ రాజశేఖర్ బాబు, అడ్మిన్ డీఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి, ఏసీబీ డీఐజీ పీహెచ్‌డీ రామకృష్ణ, హోంశాఖ స్పెషల్ సెక్రటరీ జి.విజయకుమార్, ఎస్‌ఈబీ డీఐజీ రవిప్రకాశ్, డీజీపీ ఆఫీస్ డీఐజీ మోహనరావు, సెంట్రల్ డిప్యూటేషన్‌లో ఉన్న ఆకే రవికృష్ణ, జయలక్ష్మి ఉన్నారు.

జీవోఐఆర్‌లో జీవోలేవి?

(మొదటిపేజీ తరువాయి)

పెడితే కదా ప్రభుత్వంలో ఏం జరిగేది తెలిసేదని మరో న్యాయవాది యలమంజుల బాలాజీ వాదించారు. అన్ని జీవోలను గెజిట్‌లో ఉంచుతున్నామని ప్రభుత్వ న్యాయవాది సుమన్ తెలిపారు. రెండువర్గాల వాదనలు విన్న న్యాయస్థానం దీనిపై లోతుగా విచారించాల్సిన అవసరముందని పేర్కొంది. తదుపరి విచారణను నాలుగు వారాలకు వాయిదా వేసింది.

కిలో బియ్యం రూ.25కే

(మొదటిపేజీ తరువాయి)

రూ.27.50కే కిలో గోధుమ పిండి విక్రయిస్తోన్న విషయం తెలిసిందే. నేషనల్ కో ఆపరేటివ్ కన్స్యూమర్ ఫెడరేషన్, నేషనల్ అగ్రికల్చర్ కో ఆపరేటివ్ మార్కెటింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ద్వారా దేశంలోని 2వేల రిటైల్ పాయింట్లలో వీటిని విక్రయిస్తున్నారు. వీటిలాగే 'భారత్ రైస్' విక్రయాలు కూడా చేపట్టాలని కేంద్రం భావిస్తోంది. అయితే, దీనిపై ఇంకా అధికారిక ప్రకటన వెలువడలేదు. దేశంలో పెరుగుతున్న బియ్యం ధరలను నియంత్రించేందుకు ఇటీవల కేంద్రం కొన్ని చర్యలు చేపట్టింది. బాస్మతియేతర రకాల ఎగుమతులపై నిషేధం విధించింది. బాస్మతి బియ్యంపైనా ఆంక్షలు అమల్లోకి తెచ్చింది. టన్ను ధర 1200 డాలర్లకంటే తక్కువ ధర ఉన్న బాస్మతి బియ్యం ఎగుమతులు నిషేధించింది.

ఎమ్మెల్యే సతీశ్ ఇంట విషాదం

(మొదటిపేజీ తరువాయి)

అక్కడికక్కడే ప్రాణాలు వదిలారని చెప్పారు. క్రిస్మస్ సెలువులకు టెక్సాస్‌లో ఉంటే తమ బంధువు విశాల్ ఇంటికి వీరు వెళ్లారని, జూ పార్కును సందర్శించి తిరిగి వెళుతుండగా ప్రమాదం జరిగిందన్నారు. తన బాబాయి కుమార్తె జార్జియా రాష్ట్రంలోని అట్లాంటలో ఉంటున్నట్లు ఎమ్మెల్యే చెప్పారు. అయితే ఉత్తర అమెరికాలోని తెలుగు సమాఖ్య (తానా) నుంచి సహాయ సహకారాలు అందుతున్నట్లు వెల్లడించారు. మృతదేహాలను త్వరలోనే స్వస్థలానికి తరలించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయని చెప్పారు. కాగా, సతీశ్ కుమార్ ఇంటికి వెళ్లి కొందరు పరామర్శించారు.

లౌకిక ప్రజాస్వామ్య పరిరక్షణకు సమాయత్తం కావాలి

సీపీఐ కార్యదర్శివర్గ సభ్యుడు ఓబులేసు

విశాలాంధ్ర-కడపబ్యూరో: దేశంలో లౌకిక ప్రజాస్వామ్య పరిరక్షణ, ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణ కోసం, సమగ్రాభివృద్ధి కోసం ప్రజా పోరాటాలకు సమయత్తం కావాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జీ ఓబులేసు పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక డీసీఎల్ ఫంక్షన్ హాల్లో జరిగిన సీపీఐ జిల్లా స్థాయి వర్క్‌షాప్‌ను ప్రారంభించిన అనంతరం ఆయన ప్రసంగిస్తూ... కేంద్రం లోని మోదీ ప్రభుత్వం ఎన్నికల వాగ్దానాలను విస్మరించి నిరంకుశ ఫాసిస్టు చర్యలను ముమ్మరం చేసిందన్నారు. నల్లధనం వెలికితీత, ఏడాదికి కోటి ఉద్యోగాల కల్పనలో విఫలమైందన్నారు. సాగు చట్టాల పేరుతో ఇటు రైతులను అటు వినియోగ దారులను ఏకకాలంలో నిలువునా దోపిడీ చేసే చీకటి ఒప్పందాలను ఢిల్లీ రైతాంగ పోరాటం బద్దలు కొట్టి సాగుచట్టాలను రద్దు చేయించిందన్నారు. ముస్లిం మైనారిటీలను లక్ష్యంగా చేసుకొని... సీఏఏ, ఎన్ఆర్‌సీ, ఎన్‌పీఆర్ తెచ్చిందని తెలి పారు. కార్మికవర్గం పోరాడి సాధించుకున్న పనిగంటలు, హక్కులను కాలరాస్తూ కార్పొరేట్ కంపెనీల దోపిడీకి ద్వారాలు తెరుస్తూ చట్టాలు చేసిందని విమర్శించారు. ప్రభుత్వరంగ సంస్థలను తెగనమ్ముతూ చివరకు మన విశాఖ ఉక్కును కూడా ప్రైవేటు పరం చేయడానికి పూనుకున్నదన్నారు. పెట్రోల్, డీజిల్, గ్యాస్, నిత్యావసర వస్తువుల ధరల నియంత్రించలేక పోయిందని, కరోనా సంక్షోభంలో కూడా మోదీ ప్రకటించిన రూ.21లక్షల కోట్ల కరోనా ప్యాకేజీ కొంతమంది కార్పోరేట్లకు మేలుచేసిందే తప్ప శ్రామికుల కడుపు నింపలేకపోయిందన్నారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా, రాయలసీమ, ఉత్తరాంధ్రకు ప్రత్యేక ప్యాకేజీ, పోల వరానికి నిధులు కేటాయించడంలో, కడపలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటులో కావాలనే నిర్లక్ష్యం చేస్తోందన్నారు. తమ విధానాలకు వత్తాసు పలకని బీజేపీ యేతర రాష్ట్ర ప్రభుత్వాలను కూలదోసి తమ ప్రభుత్వాన్ని నెలకొల్పుతూ ప్రజాస్వామ్యాన్ని నిట్టనిలువునా ఖూనీ చేస్తోందన్నారు. ఇక రాష్ట్రంలో ల్యాండ్, శాండ్, మైన్స్, వైన్ మాఫియా ప్రజలను దోచుకుంటుండగా... వైసీపీ ప్రభుత్వం విద్యుత్ చార్జీలు, ఆర్‌టీసీ చార్జీలు, ఇంటి పన్ను, నీటిపన్ను, చెత్తపన్ను పెంచి ప్రజలపై పెనుభారం మోపిందన్నారు. నీటిపారుదల ప్రాజక్టులను నిధుల లేమి వెంటాడుతోందని, రైతు భరోసా కేంద్రాలు రైతుల అవసరాలు, ప్రయోజనాలు నెరవేర్చడం లేదని తెలిపారు. వ్యవసాయ పంపుసెట్లకు స్మార్ట్ మీటర్ల పేరుతో ఉచిత విద్యుత్, సూక్ష్మనీటి సేద్యపు పరికరాలపై, వ్యవసాయ యంత్రాలు, పనిముట్లు పై రాయితీని రద్దు చేయడమే కాకుండా వ్యవసాయ రుణమాఫీని ఎగ్గొట్టిందన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ కార్పోరేషన్లను కుల కార్పోరేషన్లుగా విభజించినప్పటికీ వారికిచ్చే నిధుల్లో భారీగా కోత విధించిందన్నారు. కడపలో ఉక్కుఫ్యాక్టరీ నిర్మాణంపై ఎలాంటి పురోగతి సాధించలేదన్నారు. చెన్నూరు చెక్కెర ఫ్యాక్టరీ తిరిగి తెరిపించడానికి మూడు పర్యాయాలు మూడు కమిటీలు వచ్చి పరిశీలించినప్పటికీ ఒక్క అడుగు ముందుకు పడలేదని చెప్పారు. కొప్పర్తి, కడప, కమలాపురం, పులివెందుల, ప్రొద్దుటూరు, బద్వేల్, మైదుకూరు, జమ్మలమడుగులో రైతులనుంచి భూమి సేకరించిన ఏపిఐఐసి... పరిశ్రమలు నెలకొల్పకుండా రియల్ ఎస్టేట్ వ్యాపారానికి ఒడిగట్టిందన్నారు. నీటిపారుదల ప్రాజెక్టులు గాలేరు-నగరి, హంద్రీ-నీవా, తెలుగుగంగ, కేసీ కెనాల్ చివరి ఆయకట్టు స్థిరీకరణకు రాజోలి పనులు నత్తనడకన సాగుతున్నాన్నారు. గాలేరు-నగరి రెండోదశ పనులు గండికోట, మైలవరం, చిత్రావతి, పైడిపాలెం, వామికొండ, సర్వరాయసాగర్, బ్రహ్మం సాగర్, ఎస్.ఆర్.1,2, ఎగువ, దిగువ సగిలేరు, బుగ్గవంక డ్యాముల్లో నీరు ఉన్నప్పటికీ పంటకాలువల నిర్మాణం పూర్తికాక... నీళ్ళున్నా వినియోగించుకోలేని పరిస్థితి ఉన్నదన్నారు. రైతులు అతివృష్టి, అనావృష్టితో నష్టపోతే పంటలబీమా, పెట్టుబడి రాయితీ పరిహారం అందించడంలో అధికారులు, స్థానిక నేతలు చేతివాటం ప్రదర్శించి కోట్లు కొల్లగొడుతున్నారని, పంటల కొనుగోలులో భారీ అక్రమాలకు పాల్పడుతున్నారని ఓబులేసు ఆరోపించారు. జగనన్న కాలనీలల్లో రోడ్లు, కాలువలు, కరెంటు, నీటి సౌకర్యం కల్పించలేదని, కేంద్ర ప్రభుత్వ వాటా రూ.1లక్ష 50వేలు, రాష్ట్ర ప్రభుత్వం 30వేలతో పేదలకిచ్చిన స్థలాల్లో ఇంటి నిర్మాణమని అసాధ్యమని తెలిపారు. వేసవి ఆరంభంలోనే తాగునీటికి ఇబ్బందులొస్తున్నాయన్నారు. బడుగు, బలహీన వర్గాలపై దాడులు, వేధింపులు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజా కంటక పాలన చేస్తున్న కేంద్రం మోదీ ప్రభుత్వం, రాష్ట్రంలోని వైసీపీ ప్రభుత్వ విధానాలను నిరసించాలని సీపీఐ శ్రేణులకు ఓబులేసు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా సీపీఐ సీనియర్ నాయకుడు పల్లవోలు చంద్రాయుడు జెండా ఆవిష్కరించగా, సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర, జిల్లా కార్యవర్గ సభ్యులు ఎల్.నాగసుబ్బారెడ్డి, బీ రామయ్య, బషీరున్నీసా, ఎంవీ సుబ్బారెడ్డి, పీ చంద్రశేఖర్, వీ వీరషేఖర్, పీ సుబ్బరాయుడు, జీ వేణుగోపాల్, కేసీ బాదుల్ల, పీ శ్రీరాములు, ఏవీ శివరాం, బందెల ఓబయ్య, పీ భాస్కర్, పవన్, పి.మస్తాన్, పిసియం రాజు, బాల ఓబయ్యా, రవికుమార్, పీరయ్య తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్ల సమ్మెకు ఏఐటీయూసీ మద్దతు

రవీంద్రనాథ్ ప్రకటన

విశాలాంధ్ర-విజయవాడ: వార్డు, గ్రామ సచివాలయాలలో పనిచేస్తున్న వలంటీర్లకు కనీస వేతనాలు చెల్లించాలని, సచివాలయ ఉద్యోగులుగా గుర్తించాలని, కార్మిక చట్టాలు అమలు చేయాలని, ఉద్యోగభద్రత కల్పించాలని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు రావులపల్లి రవీంద్రనాథ్ బుధవారం ఒక ప్రకటనలో రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తమను కట్టుబానిసల్లా పనిచేయించడాన్ని వ్యతిరేకిస్తూ సచివాలయ వలంటీర్లు డిసెంబర్ 29 నుండి నిర్వహించబోయే సమ్మెకు ఏఐటీయూసీ సంపూర్ణ మద్దతు తెలుపుతున్నట్లు పేర్కొన్నారు. నాలుగున్నర సంవత్సరాలుగా గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో వలంటీర్లు సమర్ధవంతంగా పని చేస్తున్నారని తెలిపారు. ఎటువంటి కనీస వేతనాలు, పనిగంటలు, విధి విధానాలు లేకుండా వలంటీర్లతో పనిచేయిస్తున్నారని విమర్శించారు. అధికార పార్టీ ప్రజాప్రతినిధుల వేధింపులు, తూలనాడడం, చులకన భావంతో చూడడం వంటి ఇబ్బందులకు గురౌతూ వారు సేవలందిస్తున్నారని పేర్కొన్నారు. అనేక ఇబ్బందులకు ఓర్చి కోవిడ్ కాలంలో కూడా సేవలందించారని గుర్తు చేశారు. కొందరు కోవిడ్ బారిన పడ్డారని, పదుల సంఖ్యలో కోవిడ్‌తో చనిపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. అయినా ప్రభుత్వం వలంటీర్ల న్యాయమైన సమస్యలు పరిష్కరించకుండా దుర్మార్గంగా వ్యవహరించిందని మండిపడ్డారు. గౌరవవేతనం పేరిట అగౌరవంగా అతి తక్కువ వేతనాలతో రాష్ట్ర ప్రభుత్వం పనిచేయించుకుంటుందని విమర్శించారు. వలంటీర్లను కట్టుబానిసల్లా చూస్తూ రాష్ట్ర ప్రభుత్వం పని చేయించుకుంటుందన్నారు. కేవలం ప్రశంసలు తప్ప కనీస వేతనాలను ఇవ్వడం లేదన్నారు. వలంటీర్ల కుటుంబాలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని తెలిపారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం వీరికి కనీసవేతనం చెల్లించాలని, సచివాలయ ఉద్యోగులుగా గుర్తించాలని, జాబ్ చాట్ ఇవ్వాలని, కార్మిక చట్టాలు అమలు చెయ్యాలని డిమాండ్ చేశారు.

కొలికపూడిపై డీజీపీకి రాంగోపాల్ వర్మ ఫిర్యాదు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: అమరావతి పరిరక్షణ సమితి నాయకుడు కొలికపూడి శ్రీనివాస్‌పై సినీ దర్శకుడు రాంగోపాల్ వర్మ బుధవారం ఏపీ డీజీపీ కార్యాలయానికి వచ్చి రాజేంద్రనాథ్ రెడ్డికి ఫిర్యాదు చేశారు. ఆయన వెంట నిర్మాత దాసరి కిరణ్ కుమార్ ఉన్నారు. అనంతరం మీడియాతో వర్మ మాట్లాడుతూ టీవీ5 చర్చలో పాల్గొన్న కొలికపూడి శ్రీనివాస్ తన తలను నరికి తెచ్చిన వాడికి కోటి రూపాయిలు ఇస్తానని ప్రకటించి డిబేట్‌ను కొనసాగించారని చెప్పారు. ఈ వ్యవహారంలో యాంకర్ సాంబశివరావు, యజమాని బీఆర్ నాయుడుపైనా ఫిర్యాదు చేస్తున్నట్లు తెలిపారు. శ్రీనివాస్ చేసిన మాటలను ఇంతవరకు ఎవరూ ఖండించలేదని వర్మ అన్నారు. "వ్యూహం' చిత్రం నా పొలిటికల్ కాన్సెప్ట్. మీరేమీ తప్పు చేయనప్పుడు భయమెందుకు?. గుమ్మడికాయల దొంగ ఎవరంటే వీళ్లంతా భుజాలు తడుముకుంటున్నారు' అని వ్యాఖ్యానించారు. తన ఫిర్యాదుపై తగు విధంగా చర్యలు తీసుకుంటామని డీజీపీ చెప్పారని రాంగోపాల్ వర్మ తెలిపారు.

భూ హక్కు చట్టాన్ని రద్దు చేయాల్సిందే

రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తల డిమాండ్

విశాలాంధ్ర-విజయవాడ(చిట్టినగర్): స్థిరాస్తుల వివాదాలు పరిష్కరించే సివిల్ కోర్టులను తప్పించి రెవెన్యూ ట్రిబ్యునళ్లకు అధికారాలు కట్టబెట్టే భూ హక్కుల చట్టాన్ని రద్దు చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్ డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం అధ్వర్యంలో దాసరి భవన్ వద్ద ఏపీ ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ (27/2023)పై రౌండ్ టేబుల్ సమావేశం కేవీవీ ప్రసాద్ అధ్యక్షతన బుధవారం జరిగింది. రైతుసంఘం సీనియర్ నాయకులు వై.కేశవరావు 1992, 2018లో చట్టాలు సవరించడానికి ప్రభుత్వాలు ప్రయత్నించాయని, అందులో పొరపాట్లను ఎత్తిచూపడంతో పాటు రైతుసంఘాలు వ్యతిరేకించడంతో ప్రభుత్వాలు వెనక్కి తగ్గాయని గుర్తుచేశారు. నీతి ఆయోగ్ ద్వారా కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా ప్రజల భూములు లాక్కోవటానికి, రియల్ ఎస్టేట్‌వ్యాపారుల కోసం అనుకూలంగా చట్టం తీసుకురావడం దుర్మార్గమన్నారు. 1977-78లో రైతుసంఘాలు పాస్ బుక్, పట్టాల కోసం ఆందోళన చేపట్టగా 1983లో ఎన్‌టీఆర్ చట్టం చేశారని తెలిపారు. బెంగాల్, కేరళ ప్రభుత్వాలు కౌలు దారులకు అనుకూల చట్టాలు చేశాయన్నారు. తెలుగు రైతు రాష్ట్ర అధ్యక్షుడు మర్రెడ్డి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ప్రపంచ బ్యాంక్ కనుసన్నల్లో నడుస్తున్న నీతి ఆయోగ్... ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేకహోదాను అడ్డుకున్నదని ఆరోపించారు. మోదీ సర్కారు తీసుకొచ్చిన మూడు సాగు చట్టాలపై పోరాటం అనుభవంతో ప్రజల్లోకి వెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. ప్రత్యేక హోదా సాధన కమిటీ కన్వీనర్ చలసాని శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రజల ఆస్తులు కాజేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం భూహక్కు చట్టం తీసుకొచ్చిందన్నారు. ఈ చట్టానికి వ్యతిరేకంగా పోరాటం చేయాల్సిన అవసరం ఉందన్నారు. బెజవాడ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కేబీ సుందర్ మాట్లాడుతూ ప్రజలకు అండగా నిలిచేందుకు తాము ముందుంటామన్నారు. బార్ అసోసియేషన్ సభ్యుడు భూ హక్కుల చట్టంలో అనేక సెక్షన్లు వివాదాస్పదంగా ఉన్నాయన్నారు. రాష్ట్రంలో 535 సివిల్ కోర్టులు ఉన్నప్పటికీ 26 మందితో నియమించిన ట్రిబ్యునళ్లు పరిష్కరిస్తాయా అని ప్రశ్నించారు. విజయవాడ బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు చలసాని అజయ్‌కుమార్ మాట్లాడుతూ న్యాయవ్యవస్థల పరిధిలను తప్పించే అధికారం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు లేదన్నారు. న్యాయం, ధర్మం కోసం జరిగే పోరాటానికి బార్ అసోసియేషన్ మద్దతుగా ఉంటుందన్నారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సీహెచ్ బాబురావు మాట్లాడుతూ భూహక్కుల చట్టం రద్దు చేయాల్సిందేనన్నారు. అంబానీ, అదానీలకు నీతి ఆయోగ్ ద్వారా లాభాలు చేకూర్చేందుకు జగన్ ఈ చట్టం తీసుకొచ్చారని ఆరోపించారు. ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు రావులపల్లి రవీంద్రనాథ్, ఏఐకేఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.వెంకటరెడ్డి, ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం నాయకుడు యు.వీరబాబు, జాగృతి రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి మరీదు ప్రసాదు, తెలుగు రైతు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుర్ర నరేంద్ర, రైతుసంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మార్పు సూర్యనారాయణ, ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం ఎన్టీఆర్ జిల్లా నాయకుడు మల్నీడు యల్లమందరావు, జిల్లా కార్యదర్శి చుండూరు సుబ్బారావు, ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం గుంటూరు జిల్లా కార్యదర్శి పచ్చల శివాజీ తదితరులు ప్రసంగించారు. ఆంధ్రప్రదేశ్ కౌలు రైతుసంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.జమలయ్య ప్రవేశపెట్టిన తీర్మానాలను సమావేశం ఆమోదించింది.

ఉద్యోగుల కేసుల పరిష్కార హామీ హర్షణీయం

ఏపీ పీటీడీ (ఆర్టీసీ) ఎంప్లాయిూస్ యూనియన్

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: ఆర్టీసీ ఉద్యోగులకు 19 నెలలుగా పెండింగులో ఉన్న కేసుల పరిష్కానికి మార్గదర్శకాలు ఇచ్చేందుకు యాజమాన్యం హామీ ఇవ్వడం పట్ల ఏపీ పీటీడీ (ఆర్టీసీ) ఎంప్లాయిూస్ యూనియన్ హర్షం వ్యక్తం చేసింది. ఈ మేరకు యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పలిశెట్టి దామోదరరావు, జీవీ నరసయ్య బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. దశాబ్దాలుగా ఉద్యోగులు కార్పొరేషన్ కింద పనిచేశారని, ప్రభుత్వంలో ఆర్టీసీ విలీనం అనంతరం సస్పెన్షన్లు, తొలగింపులు, ఇంక్రీమెంట్లు తదితర సమస్యలపై కొంతమంది ఉద్యోగులు 2022 మేలో హైకోర్టును ఆశ్రయించారని తెలిపారు. ఈ కేసుల పరిష్కారం కోసం స్పష్టమైన మార్గదర్శకాలు ఉండాలని ప్రభుత్వంతో అనేక దఫాలుగా జరిపిన చర్చలు ఫలించాయని, ఇందుకు సహకరించిన ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావుకు ధన్యవాదాలు తెలిపారు. దీనివల్ల దాదాపు రెండు వేల మంది ఉద్యోగులు ప్రయోజనాలు పొందుతారని పేర్కొన్నారు. పెండింగ్‌లో ఉన్న పదోన్నతుల సమస్యను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరారు.

'భారత రాజ్యాంగ రక్షణ-మన కర్తవ్యం'పై

30న విజయవాడలో సదస్సు

విశాలాంధ్ర-విజయవాడ: దళిత హక్కుల పోరాట సమితి (డీహెచ్‌పీఎస్) అధ్వర్యంలో ఈ నెల 30న ఉదయం 10.30 గంటలకు విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో 'భారత రాజ్యాంగ రక్షణ-మన కర్తవ్యం' అనే అంశంపై సదస్సు నిర్వహించనున్నట్లు డీహెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు జేవీ ప్రభాకర్, ప్రధాన కార్యదర్శి కరవది సుబ్బారావు, ఆర్గనైజింగ్ సెక్రటరీ బుట్టి రాయప్ప బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సదస్సుల్లో బీకేఎంయూ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్ ముఖ్యఅతిథిగా హాజరవుతారని చెప్పారు. సిద్ధార్థ లా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ చెన్నుపాటి దివాకర్‌బాబు, హైదరాబాద్‌కు చెందిన సామాజిక కార్యకర్త మద్దులూరి ఆంజనేయులు ప్రధాన వక్తలుగా పాల్గొంటారని పేర్కొన్నారు. దేశ ప్రజలకు రక్షణగా రూపొందించబడిన రాజ్యాంగం ప్రమాదపు టంచుల్లో ఉందని, రాజ్యాంగాన్ని రక్షించుకోవాల్సిన కర్తవ్యం ప్రజలపై ఉందని భావిస్తూ ఈ కార్యక్రమం జరుపుతున్నట్లు పేర్కొన్నారు. దేశ సమగ్రత, అభివృద్ధి, సమానత్వం వంటి ఉన్నత ఆశయాలతో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రూపొందించిన రాజ్యాంగాన్ని అమలు చేయాల్సిన పాలకులే...కుల, మత, ప్రాంతీయ విద్వేషాలతో, ఆర్థిక, సామాజిక అసమానతలు పెంచటం ఆందోళనకరమని విమర్శించారు. ప్రజలు అప్రమత్తమై సామాజిక సమైక్యత సాధించుకోవాలని సూచించాలనే ఉద్దేశంతో సదస్సు ఏర్పాటు చేశామన్నారు. రాజకీయ నాయకులు, ప్రజాసంఘాల బాధ్యులు, కార్యకర్తలు హాజరై సదస్సును విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.

ఏఐఎస్ఎఫ్ వినూత్న నిరసన

రోడ్డుపై కబడ్డీ, క్రికెట్ ఆడిన నేతలు

విశాలాంధ్ర-విజయవాడ(చిట్టినగర్): ఉద్యోగాల భర్తీ కోసం ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని అడుగుతామని ఏఐఎస్ఎఫ్ జాతీయ కార్యదర్శి దినేశ్ అన్నారు. ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కమిటీ అధ్వర్యంలో విజయవాడలో ఆడుదాం ఆంధ్ర-ఉద్యోగాల వేట-నిరుద్యోగుల మాట పేరుతో వినూత్న రీతిలో నిరసన కార్యక్రమం బుధవారం జరిగింది. దినేశ్‌తోపాటు రాష్ట్ర కార్యదర్శి కె.శివారెడ్డి పాల్గొన్నారు. నాయకులు మాట్లాడుతూ జగన్‌మోహన్‌రెడ్డి రెండు రోజులుగా మంత్రులతో కలిసి ఆడుదాం ఆట ఆడుతున్నారని, కానీ నాలుగేళ్ల నుంచి ఖాళీగా ఉన్న 2.37 లక్షల ఉద్యోగాలకు నోటిఫికేషన్ ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. డీఎస్‌సీ, గ్రూప్ 1, 2 ఉద్యోగాల నోటిఫికేషన్ ఎప్పుడు ఇస్తారని నిలదీశారు. విద్యార్థులు తినో, తినకో బీఈడీ, టెట్‌కు శిక్షణ తీసుకొని... ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్నారన్నారు. ఖాళీ పోస్టుల భర్తీ కోసం అడుగుతాం- ఉద్యోగాల ఉద్యమిస్తామని స్పష్టంచేశారు. ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కోశాధికారి ఎం.సాయికుమార్, నగర నాయకులు అయ్యప్ప, వివిధ జిల్లాల నాయకులు వినూత్న నిరసనలో పాల్గొని కబడ్డీ, క్రికెట్ ఆడారు.

1 నుంచి గ్రూప్-1 దరఖాస్తుల స్వీకరణ

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: గ్రూప్ 1 పోస్టుల భర్తీకిగాను జనవరి ఒకటో తేదీ నుంచి దరఖాస్తులు స్వీకరించనున్నట్లు ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపీపీఎస్సీ) తెలిపింది. ఈ మేరకు ఏపీపీఎస్సీ కార్యదర్శి జె. ప్రదీప్ కుమార్ బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. అర్హులైన వారంతా వచ్చేనెల 1 నుంచి 21వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. గ్రూప్ 1 నోటిఫికేషన్ పూర్తి వివరాలను కమిషన్ వెబ్‌సైట్ psc.ap.gov.inలో పొందుపర్చినట్లు వెల్లడించారు.

తెలుగు వెలుగులకు 'పూర్ణకుంభ పురస్కారాలు'

విశాలాంధ్ర-విజయవాడ: అంతర్జాతీయ స్థాయిలో 72 మంది తెలుగు వెలుగులకు, సంస్థలకు ఆంధ్ర సారస్వత పరిషత్ ప్రతిష్ఠాత్మక 'పూర్ణకుంభ పురస్కారాలు' ప్రకటించింది. ఆంధ్ర సారస్వత పరిషత్, చైతన్య విద్యాసంస్థల సంయుక్త అధ్వర్యంలో రాజమహేంద్రవరం గైట్ కళాశాల ప్రాంగణంలో జనవరి 5,6,7 తేదీలలో జరిగే 2వ అంతర్జాతీయ తెలుగు మహాసభలలో ఈ అవార్డులు ప్రదానం చేయనున్నట్లు ఆంధ్ర సారస్వత అధ్యక్షులు డా.గజల్ శ్రీనివాస్, చైతన్య విద్యాసంస్థల ప్రతినిధులు చైతన్య రాజు, రెడ్డప్ప ధవేజి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మహాసభలకు ముఖ్య అతిథిగా కేంద్ర పర్యావరణ అటవీ శాఖమంత్రి అశ్వినీ కుమార్ చౌబే, విశిష్ట అతిథిగా జస్టిస్ బి.కృష్ణమోహన్ పాల్గొంటారని పేర్కొన్నారు.

కీర్తిశేషులైన తెలుగు వెలుగుల కుటుంబాలు: తరిగొండ వెంగమాంబ- భక్తి సాహిత్యం, కవయిత్రి మొల్ల-భక్తి సాహిత్యం, కవి తిక్కన సోమయాజీ-ఆంధ్ర పురాణ సాహిత్యం, డొక్కా సీతమ్మ-ఆధ్యాత్మిక సేవా రంగం, గుర్రం జాషువా- సాహిత్యం, శ్రీపాద కృష్ణమూర్తి-ఆధ్యాత్మిక సాహిత్యం, మధునాపంతుల సత్యనారాయణ శాస్త్రి-తెలుగు సాహిత్యం, కందుకూరి వీరేశలింగం పంతులు-సాహిత్య, సేవా రంగాలు, పెద్దింటి దీక్షిత్ దాసు-హరికథ, దామోదరం సంజీవయ్య-ప్రజాసేవ, బోయి భీమన్న-తెలుగు సాహిత్యం, అల్లూరి సత్యనారాయణ రాజు-ప్రజాసేవ, ఘంటసాల వెంకటేశ్వరరావు-చలనచిత్ర సంగీతం, మండలి వెంకట కృష్ణారావు- తెలుగు భాషా సేవ, సాలూరి రాజేశ్వరరావు- చలనచిత్ర సంగీతం, పీబీ శ్రీనివాస్-చలనచిత్ర సంగీతం, బసవరాజు పద్మనాభం-చలనచిత్రం, బాపు-చలనచిత్రం, చిత్రలేఖనం, జంధ్యాల-రంగస్థల నాటక రచన, చలనచిత్రం, సీవీ రాఘవాచారి- పత్రికా రంగం, తుర్లపాటి కుటుంబరావు-పత్రికా రంగం, జాలాది రాజారావు-తెలుగు సాహిత్యం, కాళీపట్నం రామారావు-తెలుగు సాహిత్య సేవ, సిరివెన్నెల సీతారామ శాస్త్రి-చలనచిత్ర సాహిత్యం, డా. దాసరి నారాయణరావు-చలనచిత్రం, సురభి జమున రాయలు, సురభి రంగస్థలం, పాతపాటి సర్రాజు-ప్రజాసేవ, వైకే నాగేశ్వరరావు- సాంస్కృతిక సేవ, పరవస్తు చిన్నయ సూరి- తెలుగు భాషా వికాసం.

రాజ వంశీకులు: మైలవరం సంస్థానాధీసులు, చింతపల్లి సంస్థానాధీసులు. ఇంకా పత్రికలు, సాహితీ సాంస్కృతిక సంస్థలకు పూర్ణకుంభ పురస్కారాలు అందజేయనున్నారు.

వీఆర్వోల సమస్యలు పరిష్కరించాలి

గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం డిమాండ్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: వీఆర్వో (గ్రేడ్2) సమస్యల్ని తక్షణమే పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం డిమాండ్ చేసింది. ఈ మేరకు బుధవారం విజయవాడ మంగళగిరిలో భూ పరిపాలన ముఖ్య కమిషనర్ (సీసీఎల్‌ఏ) కార్యాలయంలోని ప్రత్యేక ముఖ్య కార్యదర్శి జి.సాయి ప్రసాద్, అదనపు సంయుక్త కార్యదర్శి ఇంతియాజ్‌ను వీఆర్వోల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు భూపతిరాజు రవీంద్రరాజు కలిశారు. అధికారులకు వీఆర్వోల సమస్యల్ని వివరించారు. ఇటీవల నిర్వహించిన సర్వే సప్లిమెంటరీ పరీక్షల ఫలితాల్లో దాదాపు 650 మంది ఉత్తీర్ణులయ్యారన్నారు. ఉత్తీర్ణులు కాని వారు, సర్వే శిక్షణకు హాజరుకాని వారికి ప్రస్తుతం ఎన్నికల విధులు రానున్నాయని, ఆయా పరీక్షలను ఇప్పట్లో నిర్వహించే అవకాశం లేదన్నారు. 13వ జీవో ప్రకారం సీపీటీ సర్వే పరీక్షలో తప్పనిసరిగా ఉత్తీర్ణత కావాలన్న నిబంధనలు ఉన్నాయని తెలిపారు. ఉత్తీర్ణత సాధించేందుకు ఏడాది గడువు ఇవ్వాలని కోరారు. మిగిలిన గ్రేడ్-2 వీఆర్వోలకు ముందస్తుగా ప్రొబిషన్ డిక్లేర్ చేసేలా ఉత్తర్వులు ఇవ్వాలన్నారు. న్యాయం జరిగేలా చూస్తామని వీఆర్వోల ప్రతినిధులకు అధికారులు హామీనిచ్చారు. కాగా, అధికారులను కలిసిన వారిలో వీఆర్వో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మిరియాల లక్ష్మీనారాయణ, కృష్ణాజిల్లా ప్రచార కార్యదర్శి నళిని కుమార్, శ్రీనివాస్ ఉన్నారు.

రాష్ట్రాభివృద్ధిలో మా పాత్ర కీలకం

పవన్ కల్యాణ్... జనసేనలోకి వైసీపీ ఎమ్మెల్సీ వంశీకృష్ణ

విశాలాంధ్ర-మంగళగిరి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర భవిష్యత్తు జనసేన పార్టీ లక్ష్యమని, ఉన్నత దశలో రాష్ట్రాన్ని నిలబెట్టే ప్రక్రియలో జనసేన పార్టీ కీలక భూమిక పోషిస్తుందని ఆ పార్టీ రాష్ట్ర అధ్యకుడు పవన్ కల్యాణ్ అన్నారు. విశాఖపట్నం నగరానికి చెందిన వైసీపీ ఎమ్మెల్సీ చెన్నుబోయిన వంశీకృష్ణ యాదవ్ బుధవారం పవన్ కల్యాణ్ సమక్షంలో జనసేన పార్టీలో చేరారు. వంశీకృష్ణ యాదవ్‌ను పవన్ కల్యాణ్ సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఆయన అనుచరులకు పవన్ కల్యాణ్ పార్టీ కండువాలు వేశారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ మాట్లాడుతూ వైసీపీ పాలనలో రాష్ట్ర అభివృద్ధి, ఉత్తరాంధ్ర అభివృద్ధి బాగుంటుందని భావించి చాలా మందినాయకులు ఆ పార్టీలోకి వెళ్లారని, వైసీపీ పాలనలో ఎలాంటి అభివృద్ధి జరిగిందో అర్థం చేసుకొని మళ్లీ తిరిగి వస్తున్నారన్నారు. ఉత్తరాంధ్రలో జనసేన పార్టీ బలోపేతమవుతోందని, వంశీకృష్ణ ప్రజారాజ్యంలో ఉన్నప్పుడు యువరాజ్యం విభాగం తరపున తనతోపాటు రాజకీయ ప్రయాణం చేశారన్నారు. ఇప్పుడు ఆయన జనసేనలోకి రావడం సొంత ఇంటికి రావడం లాంటిదన్నారు. యువరాజ్యంలో కీలకంగా పనిచేసిన ఎందరో నాయకులు రెండు తెలుగు రాష్ట్రాల్లో కీలక నాయకులుగా ఎదిగారని చెప్పారు. వంశీకృష్ణను కేవలం ఒక నియోజకవర్గానికి సంబంధించిన నాయకుడిగా చూడటం లేదని, ఆయన రాష్ట్ర నాయకుడిగా ఎదగాలన్నారు. వంశీకృష్ణ వైసీపీపై ఎలాంటి వ్యాఖ్యలు చేయకుండా జనసేన పార్టీ భావజాలం నచ్చడంతోనే పార్టీలోకి వస్తున్నట్లు చెప్పడం తనను ఆకట్టుకుందన్నారు. ఏ నమ్మకంతో జనసేనలోకి వంశీకృష్ణ వచ్చారో అలాంటి ప్రాధాన్యం ఆయనకు కచ్చితంగా దక్కుతుందన్నారు. ఆయనకు అండగా నిలబడతానని, జనసేన పార్టీ ఉన్నతి కోసం, ఉత్తరాంధ్రలో పార్టీ బలోపేతం కోసం వంశీకృష్ణ మనస్ఫూర్తిగా పనిచేస్తారని భావిస్తున్నానని అన్నారు. జనసేన పీఏసీ చైర్మన్ నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ వంశీకృష్ణ యాదవ్ సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉన్న నాయకుడని, విశాఖపట్నం నగరంలో వైసీపీ బలోపేతం కోసం అహర్నిశలు కష్టపడ్డారన్నారు. విశాఖ నగర అధ్యక్షుడిగా కిందిస్థాయి నుంచి అందరికీ అందుబాటులో ఉంటూ సేవలు అందించారన్నారు. ఆయన నామినేటెడ్ ఎమ్మెల్సీ కాదు... స్థానిక సంస్థల్లో గెలిచి ఎన్నికైన నాయకుడని, అలాంటి వ్యక్తి జనసేన పార్టీలోకి రావడం చాలా ఆనందంగా ఉందన్నారు. వంశీకృష్ణ మాట్లాడుతూ రాజకీయంగా వైసీపీ మొదలు కాకముందు నుంచి తాను రాజకీయ ప్రయాణం మొదలుపెట్టానన్నారు. వైసీపీలోకి వెళ్లిన తరువాత ఆ పార్టీ అభివృద్ధి కోసం కష్టపడ్డానని, తనకు జరిగిన అన్యాయం అందరికీ తెలుసని, జనసేనలోకి రావడం తన సొంత ఇంటికి వచ్చినట్లు ఉందన్నారు. పవన్ కల్యాణ్‌తో ఉన్న పరిచయం, ఆయన ఆలోచన తీరు తనకు ఇష్టమన్నారు. కచ్చితంగా ఉత్తరాంధ్రలో జనసేన పార్టీ ఉన్నతి కోసం పనిచేస్తానని, వచ్చే ఎన్నికల్లో పవన్ కల్యాణ్‌ని ముఖ్యమంత్రిగా చూడటం కోసం మనస్ఫూర్తిగా పనిచేస్తానని అన్నారు.

శ్రీ నీలకంఠేశ్వర స్వామి దేవాలయం
గుడ్లూరు (గ్రా&మం), నెల్లూరు జిల్లా
e-Procurement Tender
NIT NO. P1/COE/523/2023-59 Dt:17.09.2023
దేవాలయ పునఃనిర్మాణము కొరకు e-Procurement ద్వారా టెండర్లు కొరడమైనది. వివరములకు https://tender.apeprocurement.gov.in వెబ్‌సైట్‌ను చూడగలరు.
సం/- కార్యనిర్వహణాధికారి

సంపాదకీయం

కడుపు మండుతోంది!

ఆంధ్రప్రదేశ్‌లో చిరుద్యోగులు, కార్మికులు పోరుబాట పట్టారు. ఇదేదో పచ్చ పత్రికలో, ఎర్రపత్రికలో, నల్లపత్రికలో చెప్పే మాట కాదు. వాస్తవమిది. రాష్ట్ర ప్రజలు ఇంత తీవ్రంగా ఆందోళనపథంలో పయనించడం ఇదే ప్రథమం. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోనూ ఏనాడూ ఇటువంటి పరిస్థితి కానరాలేదు. ఆరంభంలో జగన్ ప్రభుత్వం మంచి మంచి సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి, జనం మనసులను చూరగొన్న మాట నిజమే. కానీ అహంభావ వైఖరి, పాలనావైఫల్యం కారణంగా మనసులు మర్చిపోయి, మనుషులను కొల్లగొట్టే ప్రయత్నం జరుగుతోంది. ఫలితంగా రాష్ట్రవ్యాప్తంగా అసహనం ఉన్నట్టుండి పెరిగిపోయింది. జనం కడుపుకాలి రోడ్డెక్కారు. సంక్షేమ పథకాల్లో సైతం కోతలు పడటం, ఆర్థిక వ్యవస్థ విచ్ఛిన్నం కావడం వల్ల కనీస వేతనాలు కూడా అందకపోవడం, నాలుగున్నరేళ్లుగా వేతనాల పెంపులోనూ ఎలాంటి మార్పు లేకపోవడంతో ఈ పరిస్థితి దాపురించింది. గత ఏడాదే ఉద్యోగులు ఆందోళనబాట పట్టి జగన్ సర్కారుకు చెమటలు పట్టించారు. తాజాగా అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశావర్కర్లు, మున్సిపల్ కార్మికులు, సచివాలయ వాలంటీర్ల నిరసనహోరు చాలదన్నట్లు ఎస్ఎస్ఏ, కేజీబీవీ ఉద్యోగులలతోపాటు ఇంకొంతమంది ఉద్యోగులు సమ్మెకు సమాయత్తం కావడం ఆందోళనకరం. ప్రస్తుతం నిరసనలు తెలియజేస్తున్న చిరుద్యోగులు, కార్మికులంతా గత ఎన్నికల సందర్భంగా జగన్ ఇచ్చిన హామీలకు మోసపోయి, చివరకు కడుపుమండి ఉద్యమదారిని ఎంచుకున్నారు. 2023వ సంవత్సరం ఎలాగోలా ముగిసిపోతున్నదని ప్రభుత్వం అనుకుంటున్న తరుణంలో దాదాపు లక్షా 8వేలమంది అంగన్‌వాడీ కార్యకర్తలు విరుచుకుపడ్డారు. చిన్నగా మొదలైన ఈ ఉద్యమం అనూహ్యమైన రీతిలో ఊపందుకుంది. అంగన్‌వాడీ కార్యకర్తల్లో ప్రతి ఒక్కరూ అసమ్మతి జెండా ఎగరేసి, రాష్ట్ర, జిల్లా, మండల కేంద్రాల్లో బైఠాయించారు. ప్రభుత్వ మొండివైఖరి కారణంగా 55,607 అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా లబ్ధిపొందుతున్న మాతాశిశువులు, గర్భిణీలకు గత పదిరోజులుగా సేవలు అందడం లేదు. వారి డిమాండ్లేమీ గొంతెమ్మ కోర్కెలు కావు. పనిభద్రత కల్పించాలని, అన్ని పనులనూ తమ మీదనే రుద్దడంతో పెరిగిపోతున్న పనిభారాన్ని తగ్గించాలని, కనీస వేతనం రూ.26 వేలకు పెంచాలని, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి, చట్టప్రకారం రావాల్సిన గ్రాట్యుటీ, పెన్షన్, సెలవులు, పదవీ విరమణ ప్రయోజనాలను కల్పించాలని కోరుతున్నారు. ఇవి కొత్త డిమాండ్లు కావు. అంగన్‌వాడీ వ్యవస్థ మొదలైన ఐదేళ్ల నుంచి సంబంధిత యూనియన్లు చేస్తున్న డిమాండ్లే. అంగన్‌వాడీలకు చెందిన అక్కచెల్లెమ్మలందరి డిమాండ్ తీర్చే బాధ్యత తనదేనంటూ 2016 నుంచి 2019లో అధికారం చేపట్టే వరకూ ఏకరవుపెట్టిన జగన్‌మోహన్‌రెడ్డి కుర్చీలో కూర్చున్న తర్వాత అంగన్‌వాడీల మొహం చూడటమే మానేశారు. గ్రామ సచివాలయాలపై దృష్టిపెట్టిన సీఎం ఈ అంగన్‌వాడీలను విస్మరించారన్న వాదన ఉంది. ఐసీడీఎస్‌కు వచ్చే నిధులు గురించి ఆందోళనలేని సీఎం వారి విధుల భారాన్ని విస్మరించడం విచారకరం. పైగా అంగన్‌వాడీ వ్యవస్థ మీద ఏ మాత్రం అవగాహనలేని మంత్రి చేసే నిర్లక్ష్యపూరిత వ్యాఖ్యలు ప్రభుత్వ వికృతచేష్టలకు నిదర్శనంగా మారాయి. దీంతో ఈ ఆందోళన మరింత ఉధృతరూపం దాల్చింది. వారితో చర్చలు జరపాల్సిన ప్రభుత్వం అసలు డిమాండ్లు పక్కనబెట్టి కొసరు కోర్కెలు తీర్చేసి, చేతులు దులుపుకోవాలని చూస్తోంది. తెలంగాణరాష్ట్రంలో అంగన్‌వాడీ కార్యకర్తల వేతనాన్ని రూ.13,500కి పెంచారు. కనీసం ఆ మేరకు పెంచినా పరిస్థితి ఇంతదాకా వచ్చేది కాదేమో! పైగా గ్రామీణ ప్రాంతాల్లోని అంగన్‌వాడీ కార్యకర్తలకు నవరత్నాల పథకాలు అందకుండా వారిని అనర్హులుగా చేయడం మరో బాధాకరమైన అంశం. పథకాల వర్తింపులో వారిని ప్రభుత్వోద్యోగుల్లా చూసిన సర్కారు...ప్రయోజనాల విషయంలో వారిని పక్కనబెట్టడం గర్హనీయమే. ఆశావర్కర్లదీ అదే బాధ, అదే బాట. రెండు వారాల క్రితమే కలెక్టరేట్లను ముట్టడించిన 42 వేలమంది ఆశావర్కర్లు అంగన్‌వాడీలకు మద్దతుగా భారీ ర్యాలీలు నిర్వహించారు. వచ్చేమాసంలో పెద్దఎత్తున 'చలో విజయవాడ'కు సిద్ధమవుతున్నారు. పిల్లలనుకనే సమయంలోనూ మెటర్నటీ లీవు లేని కార్మికులు ఎవరైనా ఉన్నారంటే వారు ఆశావర్కర్లే. దారుణ స్థితిగతులను ఎదుర్కొంటున్న కమ్యూనిటీ హెల్త్‌వర్కర్లను ఆశాలుగా మార్చాలని, ప్రభుత్వ సెలవులు, వైద్య, ప్రసూతి సెలవులు ఇవ్వాలన్నదే వారి డిమాండ్. కొవిడ్ సమయంలో వారు చేసిన సేవలు అనిర్వచనీయమని గొప్పలకు పోయిన జగన్ ఇప్పుడు వారి గొంతుకపై కత్తెందుకు పెడుతున్నారో వైసీపీ మ్యానిఫెస్టోనే చెప్పాలి.

పారిశుద్ధ్య కార్మికులకూ ఈ ప్రభుత్వ పాలనలో గడ్డుకాలమే ఎదురైంది. వైసీపీ ప్రభుత్వం పారిశుద్ధ్య కార్మికులందరినీ ఔట్‌సోర్సింగ్ కార్పొరేషన్ (ఆప్కాస్) పరిధిలోకి తీసుకువచ్చి, వారిని ఉద్యోగులుగా చూపించి ప్రభుత్వ పథకాలను కోసేసి, వెన్నుపోటు పొడిచారు. రూ.6 వేలు ఆరోగ్యభృతి పెంచేసి, వారికి రూ.18 వేలకు పెంచినట్లు చెప్పి అసెంబ్లీ సాక్షిగా సీఎం ఎనలేని ప్రేమ ఒలకబోశారు. ఇంజినీరింగ్ విభాగంలో పనిచేసేవారిని పూర్తిగా విస్మరించారు. సమాన పనికి సమాన వేతనం కింద వేతనం చెల్లించి, ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలని పారిశుద్ధ్య కార్మికులు డిమాండ్ చేస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 50 వేల మంది మున్సిపల్, కార్పొరేషన్, ఇంజినీరింగ్ పారిశుద్ధ సిబ్బంది సమ్మెబాట పట్టడంతో రెండు రోజులకే పట్టణాలు, నగరాలు ఎక్కడవేసిన చెత్త అక్కడనే ఉండటంతో దుర్గంధపూరితమయ్యాయి. ఇవన్నీ ఒకెత్తయితే, 'వాలంటరీ వార్' మరో ఎత్తు. జగన్ మానసపుత్రికగా ఆవిర్భవించిన వాలంటీర్ వ్యవస్థను ఆయన అటుజేసి ఇటుజేసి 'సొంత జేబు సైన్యం'గా మార్చేశారు. అన్ని పనులకూ వాడేసి, ఆడేసుకుంటున్నారంటూ చివరకు రెండున్నర లక్షలమంది వాలంటీర్లు విధుల నుంచి వీధుల్లోకి వచ్చారు. 'ఆడుదాం ఆంధ్రా'ను బహిష్కరించారు. ఇంకోవైపు, సమ్మెచేస్తే ఉద్యోగం నుంచి తీసేస్తామని బెదిరించినా, ఏ మాత్రం లొంగకుండా కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయాలు (కేజీబీవీ) ఉపాధ్యాయినీలు సమ్మెకు దిగారు. కనీస వేతన వ్యవస్థను అమలు చేయాలన్నది వారి ప్రధానమైన కోరిక. ఆరువేలమంది కేజీబీవీ బోధన, బోధనేతర సిబ్బంది సమ్మెకు దిగుతుండగా, దానికి సంబంధించిన ఒప్పంద, పొరుగుసేవల సిబ్బంది ఇప్పటికే ఏడెనిమిది రోజులుగా సమ్మెలో ఉన్నారు. అదే సమయంలో సమగ్ర శిక్షా అభియాన్ (ఎస్ఎస్ఏ)కింద పనిచేస్తున్న 12 వేల మంది పొరుగుసేవలు, ఒప్పంద కార్మికుల నిరసనసెగలు ప్రభుత్వానికి తగిలాయి. విద్యుత్ ఇంజినీర్లతోపాటు వివిధ డిమాండ్లపై ప్రభుత్వ ఉద్యోగులు, ఇతర వర్గాల పనివారు ఆందోళనకు సిద్ధమవుతున్నారు. సమ్మెచేస్తే తొలగిస్తామంటూ బెదిరింపులు... అలాగే, జనోద్ధరణ, పేదల పక్షపాతం వంటి పోసుకోలు కబుర్లు మానేసి ఉద్యమకారులతో చర్చలకు ఉపక్రమించాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందని గుర్తెరగాలి. లేకుంటే ఈ ప్రతిఘటన ఫలితం నాలుగు నెలల్లో అధికారమార్పిడి రూపంలో కన్పిస్తుంది.



భయపెడుతున్న కరోనా జెఎన్1

ప్రపంచవ్యాప్తంగా కరోనా జెఎన్1 సబ్‌వేరియంట్ వైరస్ మరోసారి భయపెడుతోంది. కరోనా సబ్‌వేరియంట్ జెఎన్1 వ్యాప్తి వార్తలు ప్రజలను భయకంపితులను చేస్తున్నాయి. "కోవిడ్ వస్తోంది ! కోవిడ్ పోతోంది ! మళ్లీ తిరిగి వస్తోంది!" అనే నినాదం నిజమనిపిస్తోంది. సార్స్ కోవ్ - 2 వేరియంట్స్ మేఘాలు కమ్మి జనాన్ని భయపెట్టడం, తిరిగి తొలగిపోవడం జరుగుతున్నాయి. కరోనా వైరస్ భూగోళంనుంచి పూర్తిగా తొలగిపోవడం అసాధ్యంగానే తోస్తోంది. నవంబర్ 2021లో బైటపడిన ఒమిక్రాన్ వైరస్ కాలక్రమంలో మరెన్నో సబ్‌వేరియంట్లకు కారణమైంది. కరోనా కొత్త వేరియంట్స్, సబ్‌వేరియంట్స్ పుట్టుకతో మానవాళి గజగజ వణకవలసి వస్తున్నది. ప్రస్తుతం ఒమిక్రాన్ సబ్‌వేరియంట్ అయిన జెఎన్1 ఉనికి బయట పడడంతో మరోసారి కరోనా క్రమశిక్షణలు పాటించవలసిన అగత్యం ఏర్పడింది. బిఏ.2.86కు సంబంధించిన సబ్‌వేరియంట్ జెఎన్1 వైరస్ 2023 ఆగస్టులో లగ్జెంబర్గ్‌లో బైటపడి యూకె, ఐస్‌లాండ్, యూఎస్, ఫ్రాన్స్ దేశాల వ్యాపించడం, కొందరిలో నిర్ధారణ కావడంతో ప్రజలు మరోసారి ఉలిక్కిపడ్డారు. తక్కువ ప్రభావం కలిగిన జెఎన్1 సబ్‌వేరియంట్‌ను ఐక్యరాజ్యసమితి "వేరియంట్ ఆఫ్ ఇంటరెస్ట్"గా వర్గీకరించింది. భారతదేశంలోని కేరళ రాష్ట్రంలో తొలి జెఎన్1 వైరస్ 79-ఏళ్ల వృద్ధ మహిళలో బయట పడడం, దినదినం కేసుల సంఖ్య పెరగడంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలను తగు జాగ్రత్తలు తీసుకోవాలంటూ అప్రమత్తం చేస్తున్నారు. 2023 డిసెంబరు 25వరకు దేశవ్యాప్తంగా కోవిడ్ క్రియాశీలత కేసులు 4,053 మార్కు దాటాయి. గత 24 గంటల్లో జెఎన్1 వైరస్ 628 కేసులు నమోదు కావడం, అందులో తెలంగాణలో 10 కేసులు నిర్ధారణ కావడం (హైదరాబాదులో09, కరీంనగర్‌లో01 కేసులు) గుర్తించారు. గత వారంరోజుల్లో తెలంగాణలో 55కేసులు నమోదయ్యాయి. శీతాకాలంలో వివిధ రకాలైన వైరస్‌ల వ్యాప్తికి అనుకూలమైన వాతావరణం, చలి గాలులు మందకొడిగా వ్యాపించడం, రక్తనాళాలు ముడుచుకుపోయి రక్త ప్రసరణ వేగం తగ్గడం, అతినీలలోహిత కిరణాల తీవ్రత తక్కువగా ఉండడం లాంటి అనేక కారణాలతో వ్యక్తుల్లో రోగనిరోధకశక్తి తగ్గడం గమనిస్తున్నారు. కరోనాతోపాటు ఇతర శ్వాసకోశ సంబంధిత వైరస్‌లను అడ్డుకోవడానికి నాణ్యత కలిగిన మాస్కులు వాడితే ఆశించిన ఫలితాలు వస్తాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు. వ్యాధినిరోధకశక్తి బలహీనంగా ఉన్న వారితోపాటు వయోవృద్ధులు, తీవ్రమైన సహ-అనారోగ్యాల పాలైన(కోమార్బిడ్) ప్రజలు, పోషకాహారం లోపించిన నిరుపేదలు, దీర్ఘకాలిక రోగాలతో బాధపడుతున్నవారు, కరోనా సోకి కోలుకున్నవారు తగు జాగ్రత్తలు తప్పనిసరిగా తీసుకోవలసి ఉంటుంది. అన్ని రకాల పండ్లు, కూరగాయలు, తగినంత నీరు తీసుకోవడంద్వారా జెఎన్1 నుంచి రక్షణ పొందవచ్చని గుర్తు చేస్తున్నారు. ఇప్పటికే కర్నాటక ప్రభుత్వం వృద్ధులు, దీర్ఘకాలరోగాలతో బాధ పడుతున్న వారందరూ విధిగా మాస్కులు ధరించాలన్న నియమాన్ని విధిగా పాటించాలని పేర్కొంది. ఇతర రాష్ట్రాలు కూడా జెఎన్1 నుంచి తప్పించుకోవడానికి మాస్కులతో ముక్కులు మూసుకోవడం, భౌతిక దూరాలు పాటించడం, సానిటైజర్లు వాడడం లాంటి నియమాలను పాటించాలి. ఆసుపత్రుల్లో అవసర ఏర్పాట్లు చేయడం, ప్రజలకు తగుసూచనలు చేయడం దేశవ్యాప్తంగా కొనసాగుతున్నది. చిన్న జ్వరం వచ్చినా ప్రజలు మానవ ఆవాసాలకు దూరంగా క్వారంటైన్ అవ్వాలని సూచిస్తున్నారు. జీవ కణంలోని జెనెటిక్ మెటీరియల్ సహాయంతో వైరస్‌లు కొంత మార్పులు పొంది రిప్లికేట్ కావడంతో నూతన వేరియంట్లు/సబ్‌వేరియంట్లు పుట్టుకొస్తాయి. కేరళలో తొలి జెఎన్1 సబ్‌వేరియంట్ కేసు బయట పడగా, దేశవ్యాప్తంగా ఇప్పటి వరకు 656 కేసులు బైటపడి రోజురోజుకు పెరగడం కొంత కలవరాన్ని కలిగిస్తున్నది. ఇతర రాష్ట్రాల్లోకూడా వందలాది కేసులు నిర్ధారణ కావడం గమనించాలి. దేశవ్యాప్తంగా దాదాపు 300 వరకు కేసులు నమోదుకావడంతో ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలి. జెఎన్1 సబ్‌వేరియంట్ సోకిన వ్యక్తుల్లో జ్వరం, దగ్గు, ముక్కు కారడం, గొంతు నొప్పి, ఒంటి నొప్పులు, అలసట, శ్వాస ఇబ్బందులు, జీర్ణనాళ సమస్యలు, రుచి కోల్పోవడం, జలుబు, తలనొప్పి, డయేరియా/విరోచనాలు, వాంతులు, కండరాల నొప్పులు, వణుకు, రక్త చలన దోషం లాంటి రోగ లక్షణాలు కనిపిస్తాయి. కరోనా వైరస్ మహమ్మారిని తట్టుకోవడానికి తప్పనిసరిగా మాస్కులు వాడడం, సానిటైజర్లతో చేతులు శుభ్రం చేసుకోవడం, భౌతిక దూరాలు పాటించడం, తుమ్ములు/దగ్గు వచ్చినపుడు దూరం జరగడం, అస్వస్థత అనిపించిన వెంటనే పరీక్షలు చేయించుకోవడం, పోషకాహారం తినడం లాంటి జాగ్రత్తలు తీసుకుంటూ మన ఆరోగ్య దీపాన్ని కరోనా మేఘాలు తాకకుండా చూసుకుందాం.

డా: బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037

పార్లమెంటు సమరానికి సవాళ్లు

మక్కెన సుబ్బారావు

ఐదురాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల బడలిక తీరకముందే లోక్‌సభ ఎన్నికలపై సన్నద్ధత సమాలోచనలు మొదలుపెట్టాయి పాలక బీజేపీ, ప్రతిపక్ష 'ఇండియా' కూటమి. లోకసభ ఎన్నికలతోపాటే ఆంధ్రప్రదేశ్, ఒరిస్సా, సిక్కిం, అరుణాచలప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికలు జరుగుతాయి. జమిలి ఎన్నికలపై ఎక్సర్‌సైజు చేస్తున్న మోదీ ప్రభుత్వం 2024 ద్వితీయార్థభాగంలో జరగవలసిఉన్న జమ్ము-కశ్మీర్ (సుప్రీంకోర్టు ఆదేశం ప్రకారం), హర్యానా (సెప్టెంబరు), మహారాష్ట్ర (అక్టోబరు), జార్ఖండ్ (నవంబరు/డిసెంబరు) అసెంబ్లీ ఎన్నికలను కూడా ఏప్రిల్‌లో సార్వత్రిక ఎన్నికలతో జతచేయవచ్చు. అయితే జమిలి ఎన్నికలపై మాజీ రాష్ట్రపతి అధ్యక్షతన కమిటీ వేశామన్న సాకుతో ఆచరణ సాధ్యమైన ఈ ప్రక్రియజోలికి మోదీజీ వెళ్లకపోవచ్చు. ఎన్నికలు జరగాల్సిన నిర్ణీత సమయానికి ఆరు నెలలు ముందుకు జరిపే అధికారం ఎన్నికల కమిషన్‌కు ఉంది. పాలక బీజేపీ, ప్రధానమంత్రి నరేంద్రమోదీ నాయకత్వంలో వరుసగా మూడవసారి అధికారం చేబట్టి హాట్రిక్ రికార్డుకోసం తాపత్రయపడుతోంది. భౌతిక పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయని అధినాయకత్వం భావిస్తోంది. డిసెంబరు 3న వెల్లడైన మూడు ఉత్తరాది రాష్ట్రాల (మధ్యప్రదేశ్, చత్తీస్‌ఘర్, రాజస్థాన్) అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు ఆ పార్టీకి అటువంటి భరోసా ఇస్తున్నాయి. అది భ్రాంతి అనేది ప్రత్యర్థి కాంగ్రెస్ అంచనా. ఎందుకంటే, 2019 ఎన్నికల్లో బీజేపీ చత్తీస్‌ఘర్‌లో 11కు 9సీట్లు, మధ్యప్రదేశ్‌లో 29కి 28సీట్లు, రాజస్థాన్‌లో 25సీట్లుకు 24సీట్లు గెలుచుకుంది. అది పుల్వామాలో టెర్రరిస్టుదాడి నేపథ్యంలో. ఈ పర్యాయం సాధారణ పరిస్థితిలో మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో ఓట్ల శాతాన్నిబట్టి తాము కచ్చితంగా చెప్పుకోదగ్గ స్థానాలు గెలుచుకుంటామని కాంగ్రెస్ అంచనా. అయితే ఓటర్లు లోకసభ ఎన్నికలను భిన్నంగా చూస్తారని, రాష్ట్రంలో అధికారం తప్పకుండా ప్లస్ అవుతుందని, అందువల్ల పూర్వ ఫలితాలను నిలబెట్టుకుంటామని బీజేపీ భావిస్తోంది. 2019 ఎన్నికల్లో లోకసభలో 303 సీట్లు, 39శాతం ఓట్లు సాధించిన బీజేపీ 2024 లక్ష్యం 400 సీట్లు, 50శాతం ఓట్లు. 300 సీట్లుంటేనే పార్లమెంటరీ సాంప్రదాయాలను పాటించని, ప్రతిపక్షాలను గౌరవించని, ఏకపక్షంగా పార్లమెంటును నడుపుతున్న బీజేపీ 400 సీట్లు సాధిస్తే దానితీరు నల్లేరుపైనడక కాదా? లౌకిక వ్యవస్థపై హిందూత్వం నాట్యం చేయదా? రాజ్యాంగ, ప్రజాస్వామిక వ్యవస్థలు, జీవనసరళి మరింత చిందరవందర కావా? ప్రధానమంత్రి బీజేపీ ముఖ్యుల సమావేశంలో ప్రసంగిస్తూ మొన్నటి అసెంబ్లీ ఎన్నికలలాగా, క్రితం ఎన్నికల్లో పార్టీ ఓడిన నియోజకవర్గాలపై ముందుగా దృష్టి సారించాలన్నారు. దేశవ్యాప్తంగా కొత్త ఓటర్లు, యువత, మహిళలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, కేంద్ర ప్రభుత్వ పథకాలను సోషల్‌మీడియా, యువమోర్చా ద్వారా విరివిగా ప్రచారంలో పెట్టాలని దిశానిర్దేశం చేశారు. దీనిపై ఒక వెబ్‌సైట్ కూడా ప్రచురిస్తున్నారు. ఎలక్ట్రానిక్ మీడియాలో 'ఖుశాలి' పేరుతో వివిధరంగాల్లో మోదీ తొమ్మిదేళ్ల

పాలన సాఫల్యాలంటూ నిత్యప్రచారం అప్పుడే మొదలైంది. ఆర్ఎస్ఎస్, ఆ పరివారంలో భాగమైన సవాలక్ష సంఘాల దన్ను, హిందూత్వ ఎజండా బీజేపీకి పెట్టనికోట. జనవరి 22న ప్రధానమంత్రి ప్రారంభిస్తున్న అయోధ్య రామాలయం ఈ పర్యాయం బీజేపీ, హిందుత్వశక్తుల ప్రధాన ఎన్నికల ప్రచారాస్త్రం కానుంది. ఈ ఆధ్యాత్మిక కార్యక్రమాన్ని తమ సొంత రాజకీయ కార్యక్రమం చేశారు. రామాలయ నిర్మాణంకోసం బీజేపీ, విహెచ్‌పీ తదితర శక్తులు చేసిన ఉద్యమాలను హైలైట్‌చేస్తూ, ఈ పవిత్ర కార్యాన్ని అడ్డుకున్నాయంటూ ప్రతిపక్షాలను దూషిస్తూ ప్రచారం ఎక్కుపెడుతున్నారు. జనవరి 22న దేశమంతటా రామాలయాల్లో రామనామం ఘోషించనున్నది. అదే బీజేపీ సార్వత్రిక ఎన్నికల ప్రచారానికి అంకురార్పణకానుంది.

'ఇండియా' కూటమి సవాలు

రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని కాపాడుకునే నిమిత్తం వచ్చే ఎన్నికల్లో బీజేపీని ఓడించే లక్ష్యంతో "భారత జాతీయ అభివృద్ధి సమ్మిళిత కూటమి"గా (ఐఎన్ఐఎ-ఇండియా) ఏర్పడిన 28 ప్రతిపక్ష రాజకీయ పార్టీలు డిసెంబరు 19న దిల్లీలో (రోజువారీ కార్యక్రమంగా పార్లమెంటు సభ్యులను వరుసబెట్టి ఉభయసభల నుండి సస్పెండ్ చేస్తూ ఉండగా) సమావేశమై భవిష్యత్ కార్యాచరణ గూర్చి చర్చించాయి. ఇది ఆ కూటమి నాల్గవ సమావేశం. దాని నిర్ణయానుసారం ఈ నెల 22న, పార్లమెంటు సభ్యుల సస్పెన్షన్‌లకు నిరసనగా దేశమంతటా ఈ కూటమి ప్రదర్శనలు, బైఠాయింపులు జరిపింది. ఇది వాటి తొలి ప్రత్యక్ష ఐక్యకార్యాచరణ. భాగస్వామ్యపక్షాలు నెలాఖరులోపు రాష్ట్రాల్లో సీట్ల సర్దువాటు పూర్తిచేసుకోవాలని నిర్ణయించారు. ఇది నిర్ణయించినంత సులభంకాదు. సీట్ల సర్దుబాటు, నాయకుని ఎన్నిక ఇండియా కూటమి ముందున్న ప్రధాన సమస్యలు. ఈ విషయంలో పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి, తృణమూల్ కాంగ్రెస్ అధినేత మమతా బెనర్జీ ఏకపక్ష సూచనలు ఈ సంక్లిష్టతను సూచిస్తున్నాయి. 1. కాంగ్రెస్ 300 సీట్లకు పోటీచేయాలి. కూటమి భాగస్వామ్యపార్టీలు అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో సీట్ల పంపిణీ అధికారాన్ని ఆ పాలకపార్టీ అధినేతలకు, ఉత్తరప్రదేశ్‌లో అతిపెద్ద ప్రతిపక్షపార్టీ అయిన సమాజ్‌వాదిపార్టీ నేతకు అప్పగించాలి. 2. ప్రధానమంత్రి అభ్యర్థిగా కాంగ్రెస్ అధ్యక్షుడు, దళితనేత మల్లిఖార్జున్ ఖర్గేని ప్రకటించాలి. ఈ ప్రతిపాదనను దిల్లీ ముఖ్యమంత్రి ఆప్ నేత కేజ్రీవాల్ బలపరిచారు. ఖర్గే దీన్ని సున్నితంగా తిరస్కరించారు. తన నాలుగు దశాబ్దాల రాజకీయ జీవితంలో తానెన్నడూ దళితునిగా రాజకీయాలు చేయలేదన్నారు. ముందు ఎన్నికల్లో గెలుపుపై కేంద్రీకరించాలని, అనంతరం నాయకుణ్ణి ఎన్నుకోవచ్చునన్నారు.

రాష్ట్రస్థాయిలో పార్టీల మధ్య వైరుధ్యాలు, వైషమ్యాలు ఉన్నందున సీట్ల సర్దుబాటులో ఇబ్బందులు తప్పవు. కేరళ, బెంగాల్ రాష్ట్రాల్లో వామపక్షాలు, కాంగ్రెస్ మధ్య సఖ్యత సాధ్యంకాకపోవచ్చు. బెంగాల్, యూపీ, బిహార్, పంజాబ్, దిల్లీలాంటి రాష్ట్రాల్లో కాంగ్రెస్‌ను నామమాత్రపు స్థాయికి కుదించే ప్రయత్నాలు జరగవచ్చు. ఒకవేళ కొన్ని రాష్ట్రాల్లో పరస్పర పోటీలు తప్పకపోయినా, ఆ ఘర్షణను రాష్ట్రానికే పరిమితం చేసుకుని, జాతీయస్థాయిలో కూటమి ఐక్యతను పరిరక్షించుకోవలసి ఉంటుంది.

రాహుల్ భారత్ న్యాయయాత్ర

కన్యాకుమారి నుంచి కాశ్మీరానికి కాంగ్రెస్ యువనేత రాహుల్‌గాంధి సాగించిన భారత్ జోడోయాత్ర దేశంలో బీజేపీ సృష్టించిన ద్వేషపూరిత వాతావరణానికి, ప్రజల మధ్య విభజన, వైషమ్యాలు, మైనారిటీల అణచివేతలకు వ్యతిరేకంగా సామరస్యం ప్రబోధించిన పాదయాత్ర. అది తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ పునరుజ్జీవనకు ఉపకరించింది. అదేవిధంగా తూర్పు నుంచి పశ్చిమానికి మరోయాత్ర చేపట్టాలన్న ఆలోచన కొంతకాలంగా వినిపిస్తోంది. కాంగ్రెస్ జాతీయ కార్యవర్గం ఇటీవల దీన్ని ఆమోదించింది. అయితే దూరం చాలా ఎక్కువగా ఉండటం, నాలుగునెలల్లో దేశంలో ఎన్నికలున్నందున దీన్ని హైబ్రిడ్ (బస్సుయాత్రం, పాదయాత్ర మిళితం)గా జరపనున్నట్లు నిర్ణయించారని బుధవారం ప్రకటించారు. దీనికి 'భారత్ న్యాయ యాత్ర' అని పేరుపెట్టారు. మొత్తం 6200 కిలోమీటర్లు,14 రాష్ట్రాలు-85 జిల్లాల గుండా ఈశాన్యంలోని మణిపూర్ నుండి బయలుదేరి పశ్చిమాన ముంబై చేరుకునే ఈ యాత్ర జనవరి 14న మొదలై మార్చి 20న ముగుస్తుంది. ఇది కాంగ్రెస్ తనసుతాను పునరుద్ధరించుకునేందుకు, ప్రజలకు భరోసా ఇచ్చేందుకు తలపెట్టిన యాత్ర. రాహుల్‌గాంధిని తిరుగులేని నాయకునిగా నిలబెడుతుంది.

కొసమెరుపు:

కాంగ్రెస్ జాతీయ కార్యదర్శుల పునర్‌నియామకల్లో అధ్యక్షుడు ఖర్గే ప్రియాంకగాంధీకి ఉత్తరప్రదేశ్ ఇన్‌ఛార్జి బాధ్యతలు తప్పించారు. ఆమె పోర్టుఫోలియోలేని ప్రధాన కార్యదర్శిగా ఉన్నారు. సోనియాగాంధీ ఆరోగ్య కారణాలరీత్యా వచ్చే ఎన్నికల్లో పోటీ చేయకపోవచ్చు. రాయ్‌బరేలి నియోజకవర్గం నుండి ప్రియాంక పోటీ చేస్తారా లేక రాహుల్‌గాంధీ ఓడిన అమేధిస్థానంలో పోటీచేసే స్మృతి ఇరానీని ముచ్చెమటలు పట్టిస్తారా? వేచి చూడవలసిందే.

సీనియర్ జర్నలిస్టు
ఫోన్: 9490952109

నిరంకుశ టెలికమ్యూనికేషన్ల బిల్లు

డా.యం.సురేష్‌బాబు

పార్లమెంటులో ప్రవేశపెట్టిన టెలికమ్యూనికేషన్స్ బిల్లు 2023 అత్యంత క్రూరమైనది. ఇది వైర్డు, ఎలక్ట్రానిక్, ఆప్టికల్ మొదలైన వాటితో సహా ఏదైనా రూపంలో ప్రసారంచేసే విడుదలయ్యే, స్వీకరించే ప్రతి సందేశంపై ప్రభుత్వ నియంత్రణ ఉంటుంది. బిల్లులోని సందేశం సిగ్నల్, రచన, వచనం, చిత్రం, ధ్వని, వీడియో, డేటా స్ట్రీమ్, ఇంటెలిజెన్స్ లేదా టెలికమ్యూనికేషన్ ద్వారా పంపే సమాచారము. ఇది చాలా విస్తృతమైనది, భారతదేశ సరిహద్దుల్లోని ప్రతి ఇంటర్నెట్/డిజిటల్ యాప్ రాబోయే చట్టానికి లోబడి ఉండాలి. ఈ బిల్లు కొత్త అధికార పాలనను సృష్టిస్తోంది, ఇక్కడ ఏదైనా టెలికమ్యూనికేషన్ సేవ భారతదేశంలో పని చేయడానికి అధికారం కోసం దరఖాస్తు చేసుకోవాలి. టెలికమ్యూనికేషన్ సందేశాల విస్తృత నిర్వచనంతో, ఇది అక్కడ ఉన్న ప్రతి సోషల్ మీడియా అప్లికేషన్‌కు ఆదర్శంగా వర్తిస్తుంది - వాట్స్అప్, ఫేస్బుక్, ఎక్స్, ఇన్‌స్టాగ్రామ్ మొదలైనవి. ఈ బిల్లు తప్పనిసరిగా ఇంటర్నెట్‌కు లైసెన్స్ పాలనను తెస్తుంది. చట్టాన్ని పాటించని సేవలు భారతదేశంలో టిక్‌టాక్‌లాగా బ్లాక్ చేయవచ్చు లేదా నిషేధించవచ్చు. దేశంలోని ఇంటర్నెట్ కంపెనీలు స్టార్టప్‌ల యొక్క ప్రముఖ పరిశ్రమ సంస్థ అయిన ఇంటర్నెట్ మొబైల్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా, నియంత్రణ నుండి ఓవర్-ది-టాప్ ప్లాట్‌ఫారమ్‌లను తొలగించే బిల్లును స్వాగతిస్తుంది. ఇది తప్పుడు సంకేతం గా భావించవచ్చు, ఎందుకంటే ఈ బిల్లు ప్రతి ఇంటర్నెట్ కంపెనీ అధికార పాలన, దానిలోని సమ్మతి అవసరాలతో తీవ్ర ప్రభావాన్ని చూపుతుంది. టెలికమ్యూనికేషన్స్ బిల్లు ఇంటర్నెట్ నిరంకుశ నియంత్రణకు పునాది వేస్తుంది. టెలి కమ్యూనికేషన్ బిల్లు 2023 భారత ప్రభుత్వం వలస చట్టాల కంటే ఎక్కువగా నియంత్రిస్తుంది. అన్ని రకాల కమ్యూనికేషన్‌లపై పూర్తి నియంత్రణను కలిగి ఉండేలా ప్రభుత్వం రెండు చట్టాలను తీసుకువస్తోంది. ఇంటర్నెట్‌లో కమ్యూనికేట్ చేస్తున్న ప్రతి ఒక్కరినీ నియంత్రించడానికి శిక్షించడానికి ప్రభుత్వాన్ని అనుమతిస్తుంది. ఇది అక్షరాలా ప్రతి ఒక్కరినీ వారి నియంత్రణలోకి తీసుకువస్తోంది, స్వతంత్ర యూట్యూబ్ ఛానెల్‌లు ఉన్న వ్యక్తులపై లేదా ఇక్కడ వీడియోలను పోస్ట్ చేసే

ట్విట్టర్ జర్నలిస్టులపై కూడా ప్రభుత్వం పరిధిలోకి వస్తారు. ప్రసార నెట్‌వర్క్‌లు లేదా ప్రసార సేవలనుండి కూడా దాడిచేసి పరికరాలను స్వాధీనం చేసుకునేందుకు 'అధీకృత అధికారులకు' అధికారాలను ఇస్తుంది. ఏదైనా టెలికమ్యూనికేషన్స్ సేవలు లేదా నెట్‌వర్క్‌ను నియంత్రించడానికి కేంద్రాన్ని అనుమతిస్తుంది. ఏ వ్యక్తి నుండి ఏదైనా సందేశాన్ని అడ్డగించవచ్చు లేదా నిర్బంధించవచ్చు. సంబంధిత అధికారికి అర్థమయ్యే విధంగా ఈ సందేశాలను బహిర్గతం చేయమని ఏ వ్యక్తినైనా బలవంతం చేయడానికి కేంద్రం అనుమతిస్తుంది. మోదీ ప్రభుత్వం 2024 ఎన్నికలకు ముందు అన్ని రకాల సమాచారాన్ని నియంత్రించడానికి ఓవర్‌డ్రైవ్‌లో స్పష్టంగా తెలియజేస్తుంది.

టెలికమ్యూనికేషన్స్ బిల్లు 2023 ఇండియన్ టెలిగ్రాఫ్ యాక్ట్ 1885 ఇండియన్ వైర్‌లెస్ టెలిగ్రాఫీ యాక్ట్ 1933 వలస చట్టాలను భర్తీ చేస్తుంది. బిల్లులోని నిబంధనలు పబ్లిక్ ఎమర్జెన్సీ లేదా సేఫ్టీ సందర్భంలో ఏదైనా టెలికమ్యూనికేషన్స్ సర్వీస్ లేదా నెట్‌వర్క్‌ని స్వాధీనం చేసుకోవడానికి కేంద్ర ప్రభుత్వం లేదా రాష్ట్ర ప్రభుత్వం అనుమతిస్తాయి. ఇది కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ అధికారులు ఒకే వ్యక్తి లేదా వ్యక్తుల తరగతి నుండి సందేశాలను అడ్డగించడానికి లేదా నిర్బంధించడానికి లేదా ప్రసారం చేయడానికి అనుమతిస్తుంది. ప్రజల భద్రత కోసం మొత్తం టెలికాం నెట్‌వర్క్‌లోని ప్రతి సందేశాన్ని నియంత్రించడానికి, గూఢచర్యం చేయడానికి ఈ ఒక్క చర్య అధికారులకు అపారమైన అధికారాలను ఇస్తుంది. టెలికమ్యూనికేషన్స్ సేవల ద్వారా ప్రతి సోషల్ మీడియా వినియోగదారుని బయోమెట్రిక్ ధృవీకరణను బిల్లు తప్పనిసరి చేస్తుంది. ఇది అన్ని రకాల కమ్యూనికేషన్‌ల గుర్తింపును తన పరిధిలోకి తీసుకుంటుంది. ఈ నిబంధనల శక్తిని వివరించడానికి, రైతుల నిరసన సమయంలో ట్వీట్ చేసే ప్రతి వ్యక్తి అన్ని వివరాలను యాక్సెస్ చేయడానికి, నిర్దిష్ట హ్యాష్‌ట్యాగ్ లేదా కీవర్డ్‌తో ప్రతి సందేశాన్ని ఆపడానికి లేదా వ్యక్తులు వారి స్వంత ఖాతాలను యాక్సెస్ చేయకుండా నిరోధించడానికి పనికివస్తుంది.

ఈ బిల్లులోని ప్రతి అంశం పోలీసులు గూఢచార సంస్థ నిరంతరం పర్యవేక్షించేందుకు వీలు కల్పిస్తుంది. ఇంటర్నెట్ షట్‌డౌన్‌లను నివారించడానికి ఇన్ఫర్మేషన్ టెక్నాలజీపై పార్లమెంటరీ కమిటీ సిఫార్సుపై ప్రత్యామ్నాయ సాంకేతికల కోసం ప్రత్యామ్నాయంగా మెసేజ్‌లను నిలుపుదల చేయడానికి అన్ని నిబంధనలను బిల్లు కలిగి ఉంది. ఇంటర్నెట్ యాక్సెస్ సమస్య టెలికమ్యూనికేషన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రధానఅంశం. మారుమూల ప్రాంతాలకు యాక్సెస్ సమస్యలను పరిష్కరించడానికి, ప్రత్యామ్నాయంగా ఉపగ్రహ ఆధారిత ఇంటర్నెట్ అన్వేషించబడింది. దీని కోసం స్పెక్ట్రమ్ కేటాయింపులు వివాదాస్పదంగా ఉన్నాయి. స్పెక్ట్రమ్ కేటాయింపులు సుప్రీంకోర్టు తీర్పును పునః సమీక్షించనున్నారు. కేవలం అడ్మినిస్ట్రేటివ్ అనుమతులను ఉపయోగించి స్పెక్ట్రమ్ కేటాయింపులు సరైన ప్రక్రియ లేకుండా అక్రమ కేటాయింపులు వలన స్కామ్‌లకు దారితీయవచ్చని భావిస్తున్నారు. ఇది కేవలం ప్రజా భద్రత కోసం అందించిన నిబంధనలు అయితే, బిల్లులోని జాతీయ భద్రతా నిబంధనలను తెలియజేసి దేశాలు లేదా వ్యక్తుల నుండి నిర్దిష్ట టెలికమ్యూనికేషన్స్ పరికరాలు టెలికమ్యూనికేషన్స్ సేవల వినియోగాన్ని నిలిపివేయడానికి, తొలగించడానికి లేదా నిషేధించడానికి కేంద్ర ప్రభుత్వానికి అనుమతిస్తాయి. టిక్‌టాక్ నిషేధించినట్లుగా, దేశాలు లేదా వ్యక్తుల నుండి ఇలాంటి కమ్యూనికేషన్స్ మీడియా అప్లికేషన్‌లను బ్లాక్ చేయవచ్చు.జాతీయ భద్రతా నిబంధనలు ఎన్‌క్రిప్షన్, సైబర్ సెక్యూరిటీ కమ్యూనికేషన్‌లో డేటా ప్రాసెసింగ్ సహా పరికరాలు, సేవలకోసం టెలికాం ప్రమాణాలను నిర్దేశించడానికి కేంద్ర ప్రభుత్వాన్ని అనుమతిస్తాయి. టెలికమ్యూనికేషన్స్ పరికరాల భద్రతా ప్రమాణాలు ముఖ్యమైనవి. భారత ప్రభుత్వానికి వాటిపై నియంత్రణ లేకపోతే జాతీయ భద్రతకు హానికరం. భారతదేశం కూడా తన టెలికమ్యూనికేషన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌లో భాగంగా ఎలాంటి చైనీస్ పరికరాలను కోరుకోవడం లేదు. వాట్సాప్ సిగ్నల్ మెసెంజర్‌ల ఎన్‌క్రిప్షన్‌ను విచ్ఛిన్నం చేయాలనే ప్రభుత్వ ఆసక్తిని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం ఏర్పాటుచేసిన టెలికమ్యూనికేషన్స్ సేవల కోసం ఎన్‌క్రిప్షన్ ప్రమాణాల సమస్య తీవ్ర ప్రమాదకరంగా ఉండవచ్చు.

ప్రజాసైన్స్‌వేదిక అధ్యక్షులు

కొలిక్కిరాని సీట్ల సర్దుబాటు

- 'ఇండియా' కూటమిలో కొనసాగుతున్న ప్రతిష్ఠంభన
- 50 నుంచి 60 స్థానాల్లో పోటీకి ఎస్పీ సన్నద్ధం
- 20 నుంచి 25 స్థానాలు ఆశిస్తున్న కాంగ్రెస్
- 12 స్థానాలు అడుగుతున్న ఆర్ఎల్డీ

న్యూఢిల్లీ: రానున్న లోక్‌సభ ఎన్నికల్లో కీలక రాష్ట్రమైన ఉత్తరప్రదేశ్‌లో 'ఇండియా' కూటమి పక్షాల మధ్య సీట్ల సర్దుబాటుపై ప్రతిష్ఠంబన కొనసాగుతోంది. యూపీలో ప్రధాన ప్రతిపక్షంగా ఉన్న సమాజ్‌వాదీ పార్టీ (ఎస్పీ) సీట్ల సర్దుబాటు విషయమై కసరత్తు చేస్తోంది. ఇక్కడ కాంగ్రెస్, ఎస్పీ, రాష్ట్రీయ లోక్ దళ్ (ఆర్ఎల్డీ) మధ్య పొత్తు ఉన్నప్పటికీ ఎస్పీ పెద్దన్న పాత్ర పోషిస్తోంది. కాగా దేశంలోనే అత్యధికంగా యూపీలో 80 లోక్‌సభ స్థానాలుండగా... పొత్తులో భాగంగా కాంగ్రెస్‌కు 10 సీట్లు, ఆర్ఎల్డీకి 5 నుంచి 7 సీట్లను ఇచ్చేందుకు ఎస్పీ సుముఖంగా ఉన్నట్లు పార్టీ వర్గాల సమాచారం. అయితే, విపక్ష పార్టీల్లో అతిపెద్ద జాతీయ పార్టీగా ఉన్న కాంగ్రెస్, రాష్ట్ర పార్టీగా ఉనికిని చాటుకోవాలనుకుంటున్న ఆర్ఎల్డీ ఆ ప్రతిపాదనను అంగీకరిస్తాయా లేదా అనేది ప్రశ్నార్థకంగా ఉంది. అయితే ఈ మూడు పార్టీల మధ్య ప్రస్తుతం సత్సంబంధాలు లేవు. ఇటీవల మధ్యప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో సీట్లపంపిణీకి ఒప్పుకోకపోవడంతో కాంగ్రెస్‌పై ఎస్పీ మండిపంది. యూపీలో ఇందుకు తగిన సమాధానం చెబుతామని కూడా హెచ్చరిక సందేశాలిచ్చింది. ఆర్ఎల్డీ సైతం రాజస్థాన్ ఎన్నికల్లో తమకు ఒక్క సీటు మాత్రమే ఇవ్వడంతో కాంగ్రెస్‌పై ఆగ్రహం వ్యక్తం చేసింది. లోక్‌సభ ఎన్నికల్లో ఎక్కువ సీట్లు కావాలని డిమాండ్ చేస్తోంది. 'ఇండియా' కూటమి సీట్ల పంపిణీలో భాగంగా ఉత్తరప్రదేశ్ నుంచి 20-25 లోక్‌సభ సీట్లను కాంగ్రెస్ ఆశిస్తోంది. 2009 లోక్‌సభ ఎన్నికల్లో 21 సీట్లలో తాము గెలిచిన విషయాన్ని గుర్తు చేస్తోంది. కనీసం 20కి తగ్గకుండా తమకు సీట్లు కావాలని కాంగ్రెస్ పట్టుబడుతోంది. మరోవైపు ఆర్ఎల్డీ సైతం తమకు ఈసారి గట్టి వాటా కావాలని, 12 సీట్లు ఇవ్వాలని డిమాండ్ చేస్తోంది. కాగా, ఏప్రిల్-మేలో జరిగే లోక్‌సభ ఎన్నికల్లో 50 నుంచి 60 సీట్లలో పోటీ చేయాలని ఎస్పీ పట్టుదలగా ఉంది. కనీసం 50 సీట్లలో పోటీ అయితే ఖాయమని ఆ పార్టీ నేతలు చెబుతున్నారు. అయితే ఇండియా కూటమిలో ఉన్న ఈ మూడు భాగస్వామ్య పార్టీలు (కాంగ్రెస్, ఎస్పీ, ఆర్ఎల్డీ) మాత్రం ఇంతవరకూ యూపీలో సీట్ల పంపిణీపై అధికారికంగా ఎలాంటి ప్రకటన చేయలేదు. యూపీలో జరిగిన 2019 లోక్‌సభ ఎన్ని కల్లో మాయావతి సారథ్యంలోని బీఎస్పీతో సమాజ్‌వాదీ పార్టీ పొత్తు పెట్టుకుంది. 37 సీట్లలో ఎస్పీ పోటీ చేయగా, బీఎస్పీ 38, ఆర్జేడీ 3 సీట్ల పోటీ చేశాయి. కాంగ్రెస్‌కు రాయబరేలి, అమేథి సీట్లను మాత్రమే వదిలిపెట్టింది. రాయబరేలిలో సోనియాగాంధీ, అమేథిలో రాహుల్ పోటీ చేశారు. ఈ ఎన్నికల్లో ఎస్పీ-5, బీఎస్పీ-10 సీట్లలో విజయం సాధించగా... ఆర్ఎల్డీ ఒక్కసీటు కూడా గెలుచుకోలేకపోయింది. కాంగ్రెస్ ఒక్క రాయబరేలిలో మాత్రమే విజయం సాధించగలిగింది.

మల్లయోధులతో రాహుల్ గాంధీ భేటీ

చండీగఢ్: కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ బుధవారం ఉదయం మల్లయోధులతో ఇక్కడ భేటీ అయ్యారు. ఆయనతో సమావేశమైన వారిలో ప్రముఖ మల్లయోధుడు బజరంగ్ పునియా ఉన్నారు. హరియాణాలోని ఝుజ్జర్ జిల్లాకు చెందిన వీరేందర్ అఖాడాలో ఈ సమావేశం జరిగింది. క్రీడాకారులను లైంగికంగా వేధించినట్లు ఆరోపణలు, ఆ తర్వాత ఎన్నికల వ్యవహారంతో భారత రెజ్లింగ్ సమాఖ్య చుట్టూ వివాదాలు ముసురుకొన్న వేళ...ఈ పరిణామం చోటుచేసుకుంది. దీనిపై పునియా మీడియాతో మాట్లాడుతూ రాహుల్‌గాంధీ మర్యాదపూర్వకంగా కలిశారని, తమతో పాటు రెజ్లింగ్ ఆడారని తెలిపారు. ఇటీవల జరిగిన రెజ్లింగ్ సమాఖ్య ఎన్నికల్లో మాజీ అధ్యక్షుడు, బీజేపీ ఎంపీ బ్రిజ్ భూషణ్ సింగ్ సన్నిహితుడు సంజయ్‌సింగ్ విజయం సాధించారు. ఇది రెజ్లర్లను తీవ్ర నిరాశకు గురిచేసింది. సంజయ్ ఎన్నికపై ఆవేదన వ్యక్తం చేస్తూ ఇప్పటికే సాక్షి మీమాలిక్ రిటైర్మెంట్ ప్రకటించగా... బజ్‌రంగ్ పునియా, వీరేందర్ యాదవ్ పద్మశ్రీ అవార్డులు వాపస్ చేశారు. ఖేల్‌రత్న, అర్జున అవార్డులు వెనక్కి ఇచ్చేస్తున్నట్లు వినేశ్ ఫొగాట్ ప్రకటించారు. వివాదాల నేపథ్యంలో కొత్తగా ఎన్నికైన సమాఖ్య పాలక మండలిపై కేంద్ర క్రీడాశాఖ వేటువేసిన సంగతి తెలిసిందే. అండర్-15, అండర్-20 జాతీయ రెజ్లింగ్ పోటీలను హడావుడిగా నిర్వహించేందుకు సిద్ధం కావడాన్ని తప్పుపడుతూ ఈ నిర్ణయం తీసుకుంది.

భయపెడుతున్న కరోనా

కొత్తగా 529 కేసుల నమోదు

న్యూఢిల్లీ: దేశంలో మంగళవారం ఉదయం 8 గంటల నుంచి బుధవారం ఉదయం 8 గంటల వరకు కొత్తగా 529 కోవిడ్ కేసులు నమోదయ్యాయి. దీంతో భారత్‌లో కరోనా యాక్టివ్ కేసుల సంఖ్య 4,093కు చేరుకున్నట్లు కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ బుధవారం ఓ ప్రకటన ద్వారా వెల్లడించింది. వైరస్ బారినపడి మంగళవారం ముగ్గురు చనిపోయారని అధికారులు తెలిపారు. వీరిలో ఇద్దరు కర్నాటక వాసులు కాగా... మరొకరు గుజరాత్‌కు చెందినవారని చెప్పారు. మంగళవారం వరకు భారతదేశంలో మొత్తం 109 కోవిడ్ ఉపరకం జేఎన్.1 కేసులు నమోదైనట్లు కేంద్ర ఆరోగ్య శాఖ వెల్లడించింది. వీటిలో గుజరాత్ నుంచి 36, కర్నాటక- 34, గోవా- 14, మహారాష్ట్ర- 9, కేరళ- 6, రాజస్థాన్ - 4, తమిళనాడు- 4, తెలంగాణ నుంచి 2 కేసులు ఉన్నట్లు తెలిపింది. మరోవైపు కరోనా మహమ్మారి నుంచి కోలుకున్న వారి సంఖ్య 4.4 కోట్లకు పెరిగింది. జాతీయ రికవరీ రేటు 98.81 శాతం, మరణాల రేటు 1.19 శాతంగా ఉంది. దేశంలో ఇప్పటివరకు 220.67 కోట్ల కోవిడ్ టీకాలు పంపిణీ చేసినట్లు ఆరోగ్య శాఖ అధికారులు తెలిపారు. నిత్యం పెరుగుతున్న కరోనా కేసులను దృష్టిలో ఉంచుకొని ఆయా రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలను కేంద్ర ప్రభుత్వం ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తోంది. కోవిడ్‌కు సంబంధించి ఇప్పటికే అనేక కీలక మార్గదర్శకాలు విడుదల చేసింది. ప్రతి ఒక్కరూ మాస్క్ తప్పనిసరిగా ధరించాలని సూచించింది. బయటకు వచ్చినప్పుడు విధిగా మాస్క్ వేసుకోవాలని కోరింది. వైద్యుల సలహాలు పాటించడం, పరిశుభ్రత విషయంలోనూ జాగ్రత్తలు తీసుకుంటూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం వంటివి చేయాలని కేంద్ర వైద్యారోగ్య శాఖ సిఫార్సు చేసింది.

పూర్వకాల దురాచారానికి స్వస్తి

చెప్పులు తొడిగి 'నిషేధిత' వీధిలో దళితుల నడక - ఆలయ ప్రవేశం

తిరుప్పూర్: కొన్ని దశాబ్దాలుగా కొనసాగుతున్న దురాచారానికి దళితులు స్వస్తి పలికారు. తమను నిషేధించిన ప్రాంతానికి చెప్పులతో వెళ్లారు. ఆలయాన్ని సందర్శించారు. ఈ సంఘటన తమిళనాడు, తిరుప్పూర్ జిల్లా, మధుతుకులం తాలూకాలోని రాజపూర్ గ్రామంలో జరిగింది. సీపీఎం, వీసీకే, ఏటీపీ వంటి రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి కొందరు 60 మంది దళితులు దశాబ్దాల నాటి దురాచారానికి అంతం పలకాలని నిర్ణయించారు. తమ కాళ్లకు చెప్పులు ధరించి 'నిషేధిత' వీధిలో నడిచారు. గ్రామంలోని రాజా కలియమ్మన్ ఆలయంలోకి పవేశించారు. ఇదంతా పోలీసుల భద్రత నడుమ జరిగింది. ఈ చర్యతో స్థానిక దళితుల్లో భయాలు తొలగిపోతాయని వారు ఆకాంక్షించారు. దళితులు పాదరక్షలు ధరించి 'కంబాలా నైచెన్ వీధి'లో నడిస్తే మూడు నెలల్లోగా మరణం సంభవిస్తుందన్న కథనాలు దశాబ్దాలుగా ఉన్నాయి. దీంతో ఈ దురాచారం కొనసాగుతూ వచ్చింది. షెడ్యూల్డ్ కులాల వారికి వీధుల్లో సైకిళ్లు తొక్కే అనుమతి కూడా లేదని వెల్లడైంది. కాగా దళితులను నిషేధించిన కంబాలా నైచెన్ వీధి 300 మీటర్ల పొడువు ఉంటుంది. ఈ వీధిలో 60 మంది కాళ్లకు చెప్పులు ధరించి నడిచి నాటి ఆచారాన్ని భగ్నం చేశారు. అయితే ఈ గ్రామంలో మొత్తం 900 కుటుంబాలు ఉండగా వీటిలో 800 అగ్రకులమైన గౌండర్లు, నైకర్లకు చెందినవి. 'అరుణతతియార్' వర్గానికి చెందిన వారు కంబాలా నైచెన్ వీధిలో చెప్పులతో నడిస్తే అరిష్టమన్న నమక్మం ఉంది. అలా చేస్తే స్థానిక దేవత ఆగ్రహిస్తుందని, మరణాన్ని శాసిస్తుందని అగ్రవర్ణాల మహిళలు సైతం బెదిరిస్తారని స్థానికులు చెప్పారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చాక అంటరాని తనాన్ని నిర్మూలించారు. కానీ అగ్రవర్ణాల వారు నేటికీ నిమ్న కులాలను అణచివేస్తూ ఆధిపత్యాన్ని ప్రదర్శిస్తున్నాయన్నారు.

ఈ వీధి కింద 'పూడూ' బొమ్మ సమాధి ఉన్నదని, ఎస్సీలు చెప్పులతో నడిస్తే మూడు నెలల్లోగా చనిపోతారన్న కథనాలు నమ్మిన కొందరు ఈ వీధుల్లో చెప్పులు లేకుండా తిరగడం మొదలు పెట్టారని, అప్పటి నుంచి అదే పద్ధతి కొనసాగుతోందని చెప్పారు. ఈ వీధి వైపునకు వచ్చే అనుమతి కూడా దళిత మహిళలకు లేదని తమ దృష్టికి వచ్చిందని తమిళనాడు అంటరానీతనం నిర్మూలన ఫ్రంట్ (తిరుప్పూర్) కార్యదర్శి కేసీ కనగరాజ్ వెల్లడించారు. ఈ గ్రామంలో పర్యటించి క్షేత్రస్థాయి పరిస్థితులను తెలుసుకున్నట్లు చెప్పారు. తొలుత నిరసన చేపట్టాలని భావించగా పోలీసులు అనుమతి లభించలేదని, దాంతో కార్యక్రమాన్ని వాయిదా వేశామని ఆయన తెలిపారు.

సీసీటీవీ కెమెరాకు చిక్కిన అనుమానితులు

ఇజ్రాయిల్ ఎంబసీ సమీపంలో పేలుడు

న్యూఢిల్లీ: దేశ రాజధాని దిల్లీలోని ఇజ్రాయిల్ రాయబార కార్యాలయం సమీపంలో పేలుడుకు సంబంధించి కీలక ఆధారాలను దర్యాప్తు బృందాలు సేకరించాయి. ఇప్పటికే ఇద్దరు అనుమానితులను సీసీటీవీ కెమెరా దృశ్యాల ఆధారంగా గుర్తించారు. వారిని పట్టుకునేందుకు ముమ్మర ప్రయత్నాలు మొదలుపెట్టారు. మంగళవారం సాయంత్రం దేశ రాజధానిలోని ఇజ్రాయిల్ రాయబార కార్యాలయం సమీపంలో జరిగిన పేలుడు కలకలం రేపింది. ఈ ఘటనలో సిబ్బంది అంతా సురక్షితంగా ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఇజ్రాయిల్ రాయబారిని దుర్భాషలాడుతూ రాసిన లేఖను గుర్తించారు. ఈ ఘటనపై దర్యాప్తునకు దిల్లీ పోలీసులు, ఎన్ఐఏ బృందం రంగంలోకి దిగారు. ఇజ్రాయిల్‌కు చెందిన ఇతర సంస్థల వద్ద భద్రతను పెంచారు. కాగా, తమ రాయబార కార్యాలయం సమీపంలో పేలుడుపై ఇజ్రాయిల్ జాతీయ భద్రతా మండలి స్పందించింది. దీనిని ఉగ్రదాడిగా అనుమానించింది. ఈ ఘటన నేపథ్యంలో భారత్‌లోని తమ పౌరుల భద్రతపై ఆందోళన వ్యక్తం చేసింది. జాగ్రత్తగా ఉండాలని తమ పౌరులకు సూచనలు చేసింది. మార్కెట్లు, షాపింగ్ మాల్స్ వంటి బహిరంగ ప్రదేశాలకు వెళ్లడం తగ్గించాలని సలహా ఇచ్చింది. అంతేకాకుండా, ఇజ్రాయిల్ గుర్తులు ప్రదర్శించకుండా ఉండాలని కోరింది. సోషల్ మీడియాలో ప్రయాణ వివరాలు, ఫొటోలు అప్‌లోడ్ చేయొద్దని సూచించింది.

పార్లమెంటు చీకటి గదిగా మారింది

తృణమూల్ నేత డెరెక్ ఒబ్రెయిన్

న్యూఢిల్లీ: పార్లమెంటులో భద్రతా ఉల్లంఘన ఘటనపై కేంద్ర ప్రభుత్వం మౌనం వహించడాన్ని తృణమూల్ కాంగ్రెస్ నాయకుడు డెరెక్ ఒబ్రెయిన్ తప్పుబట్టారు. కేంద్ర ప్రభుత్వ వైఖరిని ఏవిధంగా అర్థం చేసుకోవాలని ప్రశ్నించారు. పార్లమెంటు 'లోతైన చీకటి గది'గా మారిందని అభివర్ణించారు. ఈ మేరకు బుధవారం ఆయన 'ఎక్స్'లో వ్యాఖ్యానించారు. 2001లో పార్లమెంటుపై దాడి తర్వాత, అప్పటి ప్రధాని, హోంమంత్రి ఉభయసభల్లో ప్రకటనలు ఇచ్చారని గుర్తు చేశారు. ఈ విషయమై మూడు రోజుల పాటు పార్లమెంటులో పూర్తి చర్చ జరిగిందని తెలిపారు. ఇప్పుడు మాత్రం ప్రభుత్వం మౌనం వహించడంతో పాటు ఈ విషయమై హోంమంత్రి ప్రకటన చేయడంతో చర్చ జరగాలని డిమాండ్ చేసినందుకు 146 మంది ఎంపీలను సస్పెండ్ చేశారన్నారు. అందుకే పార్లమెంటు లోతైన, చీకటి గదిగా మారిందని పేర్కొన్నారు. డిసెంబర్ 13 (2001లో పార్లమెంట్‌పై దాడి జరిగిందీ ఈరోజే) న జీరో అవర్ సమయంలో ఇద్దరు వ్యక్తులు పబ్లిక్ గ్యాలరీ నుండి పార్లమెంట్ దిగువ సభ ఛాంబర్‌లోకి దూకి, వారు తమ బూట్లలో దాచుకున్న డబ్బాల నుంచి పసుపు రంగు వాయువును విడుదల చేశారు. పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సంఘటన తర్వాత ప్రతిపక్ష ఎంపీలు భద్రతా ఉల్లంఘనపై చర్చకు డిమాండ్ చేశారు. హోంమంత్రి అమిత్ షా ప్రకటన చేయాలని పట్టుబట్టారు. ఇది తరచుగా వాయిదాలకు దారితీసింది. లోక్‌సభలో 100 మంది ప్రతిపక్ష ఎంపీలు, రాజ్యసభలో 46 మంది ఎంపీలు తమ డిమాండ్‌ను పెద్దఎత్తున లేవనెత్తడంతో క్రమశిక్షణా రాహిత్యం పేరుతో మోదీ సర్కారు వారిని సమావేశాల నుంచి సస్పెండ్ చేసింది. కాగా సస్పెండ్ చేయబడిన మొదటి రాజ్యసభ ఎంపీ అయిన ఒబ్రెయిన్, సస్పెండ్ అయిన తర్వాత కూడా సభలోనే ఉండిపోవడంతో... ఆయనపై హక్కుల ఉల్లంఘన తీర్మానం పెట్టారు. ఈ అంశాన్ని సభా హక్కుల కమిటీకి సిఫార్సు చేశారు. పార్లమెంట్ రికార్డుల ప్రకారం, డిసెంబర్ 2001లో పార్లమెంట్‌పై దాడి జరిగిన తర్వాత ఉభయ సభల్లో చర్చ జరిగింది. అప్పటి హోంమంత్రి ఎల్‌కే అద్వానీ చర్చకు సమాధానమివ్వగా... ప్రధాని అతల్ బిహారీ వాజ్‌పేయి ఉభయ సభల్లో జోక్యం చేసుకున్నారు.

2 కోట్ల మంది మహిళలను లక్షాధికారులుగా మారుస్తా: మోదీ

భోపాల్: దేశంలో స్వయం సహాయక సంఘాల (ఎస్‌హెచ్‌జి)తో అనుబంధం ఉన్న 2 కోట్ల మంది మహిళలను లక్షాధికారులు (లఖ్‌పతి) గా మార్చాలని కోరుకుంటున్నట్లు ప్రధాని నరేంద్ర మోదీ బుధవారం వెల్లడించారు. 'వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర'లో భాగంగా మధ్యప్రదేశ్‌లోని దేవాస్ జిల్లాలో వివిధ ప్రభుత్వ కార్యక్రమాల లబ్ధిదారులతో ప్రధాని వర్చువల్ విధానంలో మాట్లాడారు. ఈ సందర్భంగా 'దేశంలోని స్వయం సహాయక సంఘాలతో అనుబంధం ఉన్న 2 కోట్ల మంది మహిళలను లక్షాధికారులుగా మార్చాలనుకుంటున్నాను' అని ప్రధాని వెల్లడించారు.

ఇందుకోసం తనకు సహాయం చేయాలని రుబీనా ఖాన్ అనే మహిళలను అడిగారు. తన గ్రూప్‌లోని ఎంత మంది మహిళలను లక్షాధికారలుగా మార్చాలనుకుంటున్నారని ప్రధాని అడగ్గా... 'దేశంలోని ప్రతి మహిళను లక్షపతిగా చేయాలనుకుంటున్నాను' అని ఆమె సమాధానం ఇచ్చారు. 'ఇది (రుబీనా స్పందన) రాజకీయ ప్రత్యుత్తరం' అంటే మోదీ చమత్కరించడంతో సమావేశంలో ఉన్నవారందరూ పగలబడి నవ్వారు. లక్షాధికారులుగా మారాలనుకుంటున్నవారంతా చేయెత్తాలని మోదీ కోరగా... అందరూ సానుకూలంగా స్పందించారు. మీ అందరి కోసం చేయాల్సింది చాలా ఉందని... ఇందుకోసం తనకు మద్దతు ఇవ్వాలని ప్రధాని వారిని కోరారు. మార్గాన్ని కూడా కనుగొన్నారని ఆమె అన్నారు.

సైనికుల త్యాగాలు వెలకట్టలేనివి

జమ్మూలో కేంద్రమంత్రి రాజ్‌నాథ్‌సింగ్

శ్రీనగర్: జమ్ము కశ్మీర్ పూంచ్ జిల్లాలో జవాన్లు ప్రయాణిస్తున్న రెండు సైనిక వాహనాలపై ఉగ్రవాదులు ఇటీవల కాల్పులకు తెగబడిన నేపథ్యంలో ఇక్కడి భద్రతా పరిస్థితులను సమీక్షించేందుకు రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ బుధవారం జమ్మూలో పర్యటించారు. ఈ సందర్భంగా సైనికులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. దేశంలోని ప్రతి సైనికుడు మన కుటుంబ సభ్యుడితో సమానమని చెప్పారు. ప్రతి భారతీయుడి భావన ఇదేనని, మీకు చెడుచేయాలని చూస్తే సహించేది లేదని రాజ్‌నాథ్‌సింగ్ స్పష్టంచేశారు. అలాంటి దాడులను అడ్డుకోవడంలో భద్రతా, నిఘా సంస్థలు కీలకపాత్ర పోషిస్తాయని, సైనికుల ధైర్యసాహసాలు, త్యాగాలు వెలకట్టలేనివన్నారు. ఒక సైనికుడు అమరుడైతే తామిచ్చే పరిహారం ఆ నష్టాన్ని పూడ్చలేదని వ్యాఖ్యానించారు. 'ప్రభుత్వం మీ వెంటే ఉంటుంది. మీ భద్రత, సంక్షేమం మాకు అధిక ప్రాధాన్యం' అని మంత్రి అన్నారు. కాగా, ఆర్మీ ఆపరేషన్లలో లోపాలకు సంబంధించి బ్రిగేడియర్ స్థాయి అధికారి విచారణను ఎదుర్కొంటున్నారు. పూంచ్ జిల్లాలో ఆర్మీ కస్టడీలో ఉన్న ముగ్గురు పౌరులు మృతి చెందిన ఘటనలో ప్రజల నుంచి ఆగ్రహం వ్యక్తమవుతోంది.

ఎరువుల తయారీ ప్లాంట్‌లో గ్యాస్ లీక్

42 మందికి అస్వస్థత

చెన్నై: ఎరువుల తయారీ యూనిట్ లో అమ్మోనియా గ్యాస్ లీక్ అయిన కారణంగా 42 మంది అస్వస్థతకు గురై ఆసుపత్రిలో చేరారు. ఉత్తర చెన్నైలోని ఎన్నూర్ లోని ఎరువుల తయారీ కేంద్రం 'కోరమాండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్' కు చెందిన సబ్ సీ పైపులో అమ్మోనియా గ్యాస్ లీకేజీని గుర్తించారు. మంగళవారం రాత్రి 11.45 గంటల ప్రాంతంలో ప్లాంట్ లో లీకేజీ జరగడంతో చుట్టుపక్కల ప్రాంతాల్లో దుర్వాసన వ్యాపించింది. తయారీ కేంద్రానికి సమీపంలో ఉన్న పెరియ కుప్పం తదితర ప్రాంతాల్లోకి ఈ వాయువు వ్యాపించడంతో, ఆయా ప్రాంతాల ప్రజలు భయాందోళనలకు గురయ్యారు. ఆ విష వాయువును పీల్చిన వారిలో శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, వాంతులు తదితర సమస్యలు ప్రారంభమయ్యాయి. పరిస్థితి విషమంగా ఉన్న 25 మందిని సమీపంలోని ఆస్పత్రులకు తరలించారు.

గ్యాస్ లీకేజీ విషయం తెలిసిన వెంటనే ప్రజలు భయాందోళనకు గురై ఇళ్లను వదిలి రోడ్లపైకి వచ్చారు. కాగా ఎన్నూర్ లోని సబ్ సీ పైపులో అమ్మోనియా గ్యాస్ లీక్ అయినట్లు గుర్తించామని... వెంటనే స్పందించి, లీకేజీని నిలువరించినట్లు తమిళనాడు ప్రభుత్వం వెల్లడించింది. లీకేజీ వల్ల భరించలేనంత దుర్వాసన వచ్చిందని కంపెనీ ప్రొడక్షన్ హెడ్ చెప్పారు. కోరమాండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ ప్రెసిడెంట్ అండ్ హెడ్ మాన్యుఫ్యాక్చరింగ్ (ఫెర్టిలైజర్), సప్లై చైన్ అమీర్ అల్వీ బుధవారం ఒక ప్రకటన విడుదల చేస్తూ, 'మంగళవారం రాత్రి 11.30 గంటలకు ప్లాంట్ ఆవరణ వెలుపల ఒడ్డున ఉన్న అమ్మోనియా అన్ లోడింగ్ సబ్ సీ పైప్ లైన్లో అమోనియా లీకేజీని గుర్తించాము. మా స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ ను వెంటనే యాక్టివేట్ చేసి, అత్యంత తక్కువ సమయంలో పరిస్థితిని సాధారణ స్థితికి తీసుకువచ్చాము. ఈ ప్రక్రియలో, కొందరు స్థానికులు అసౌకర్యానికి గురయ్యారు. ప్రస్తుతం అందరూ సురక్షితంగా ఉన్నారు. ఈ ఘటనపై సంబంధిత అధికారులకు సమాచారం అందించాం' అని తెలిపారు.

మమతపై అమిత్‌షా మండిపాటు

కోల్‌కతా: కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీపై విమర్శలు గుప్పించారు. బెంగాల్‌లో మమతా బెనర్జీ పాలన కంటే కమ్యూనిస్టు పాలనే బాగుండేదని అన్నారు. బీజేపీ కార్యకర్తలతో కోల్‌కతాలో నిర్వహించిన కార్యక్రమంలో అమిత్‌షా మాట్లాడుతూ తృణమూళ్ కాంగ్రెస్ పార్టీ లక్ష్యంగా ఆరోపణలు గుప్పించారు.

బెంగాల్‌లో మమత పాలనలో అక్రమ వలసలు, గోవుల అక్రమ రవాణా పెరిగిపోయాయని ఆయన అన్నారు. బెంగాల్‌లోనూ బీజేపీ అధికారంలోకి వస్తుందని, అప్పుడు మమతా బెనర్జీ ఆగడాలకు స్వస్తి పలుకుతామని అన్నారు. కనీసం 35 లోక్‌సభ సీట్లు బీజేపీ గెలుచుకుంటుందని చెప్పారు. దీదీ పాలన కంటే 34 ఏళ్లు పాలించిన కమ్యూనిస్టుల పాలన బాగుండేదని అమిత్ షా అన్నారు. ఇదే విషయాన్ని బెంగాల్ ప్రజలు సైతం అనుకుంటున్నారన్నారు. దేశంలో పౌరసత్వ సవరణ చట్టం(సీఏఏ) అమలు చేయడం బీజేపీ నిబద్ధతకు నిదర్శనమని తెలిపారు. ఎట్టిపరిస్థిల్లో సీఏఏను అమలు చేసి తీరుతామని తెలిపారు. సీఏఏ విషయంలో మమతా బెనర్జీ ప్రజలను మరింత గందరగోళానికి గురిచేసే ప్రయత్నాలు చేస్తున్నారన్నారు.

మంచు దుప్పట్లో దిల్లీ

110 విమానాల రాకపోకలకు అంతరాయం

న్యూఢిల్లీ: ఎముకలు కొరికే చలితో దేశ రాజధాని దిల్లీ వణుకుతోంది. ఉష్ణోగ్రతలు దారుణంగా పడిపోవడంతో పొగమంచు నగరాన్ని కప్పేసింది. దీంతో రాజధానివాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రవాణా వ్యవస్థపై పొగమంచు తీవ్ర ప్రభావం చూపించింది. విమానాలు, రైళ్ల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. చలి పరిస్థితులు తీవ్రంగా ఉండటంతో ఇప్పటికే వాతావరణశాఖ దిల్లీలో రెడ్ అలర్ట్ జారీ చేసింది. పొగమంచు దట్టంగా వ్యాపించడంతో ఉదయం కూడా రాత్రిని తలపించింది. కొన్ని ప్రాంతాల్లో 50 మీటర్ల దూరంలో ఉన్న వాహనాలు కూడా కనిపించనంతగా మంచు కమ్మేసింది. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గాలి నాణ్యత కూడా పడిపోయింది. దిల్లీలో కనిష్ఠ ఉష్ణోగ్రత 7 డిగ్రీలకు తగ్గింది. పొగమంచు కారణంగా దిల్లీ విమానాశ్రయంలో విమానాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. దాదాపు 110 దేశీయ, అంతర్జాతీయ విమాన సర్వీసులు ఆలస్యమవుతున్నట్లు ఎయిర్‌పోర్టు అధికారులు వెల్లడించారు. దిల్లీకి రావాల్సిన చాలా విమానాలను దారిమళ్లిస్తుండటంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. రైళ్ల రాకపోకలపైనా పొగమంచు ప్రభావం పడింది. రాజధానికి రావాల్సిన దాదాపు 25 రైళ్లు ఆలస్యంగా నడుస్తున్నట్లు ఉత్తర రైల్వే వెల్లడించింది.

ఉత్తరాది గజగజ

ఉత్తరాదిన అనేక రాష్ట్రాలను చలి గజగజలాడిస్తోంది. పటియాలా (పంజాబ్), లక్నో, ప్రయాగ్‌రాజ్(యూపీ)లో 25 మీటర్ల మేరే కన్పిస్తోంది. అమృత్‌సర్ (పంజాబ్)లో కనీసం ముందున్న వాహనాలు కూడా కనిపించనంతగా మంచు కమ్మేసింది. దీంతో ఆయా ప్రాంతాల్లో రోడ్డు రవాణా ప్రభావితమైంది. మరికొన్ని రోజులపాటు దిల్లీ సహా పంజాబ్, హరియాణా, యూపీ, రాజస్థాన్, మధ్యప్రదేశ్‌లో పొగమంచు పరిస్థితులు మరింత తీవ్రమయ్యే అవకాశముందని వాతావరణ శాఖ అంచనా వేస్తోంది.

మోదీ దిగొచ్చేవరకు 'ఉక్కు' పోరు ఆగదు

- పోరాట కమిటీ, కార్మిక సంఘాల హెచ్చరిక
- 'జిందాల్' ఒప్పందాన్ని బహిరంగ పర్చాలని డిమాండ్
- విశాఖలో భారీ ర్యాలీ, బహిరంగ సభ

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం: విశాఖ ఉక్కు కర్మాగారాన్ని ప్రభుత్వరంగంలోనే కొనసాగిస్తామని ప్రధాని నరేంద్రమోదీ ప్రకటన చేసేవరకు ఉద్యమం ఆగదని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ చైర్మన్, స్టీల్‌ప్లాంట్ గుర్తింపు యూనియన్ (ఏఐటయూసీ) అధ్యక్షుడు డీ ఆదినారాయణ, ఏఐటీయూసీ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎస్ వెంకటసుబ్బయ్య, సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నర్సింగరావు స్పష్టం చేశారు.

విశాఖ ఉక్కు పరిరక్షణ కోసం స్టీల్‌ప్లాంట్, ప్రభుత్వరంగ సంస్థల పరిరక్షణ పోరాట కమిటీ అధ్వర్యంలో విశాఖలో జీవీఎంసీ గాంధీవిగ్రహం వద్ద నిర్వహిస్తున్న నిరశన దీక్షలకు బుధవారంతో వెయ్యి రోజులు పూర్తయింది. ఈ సందర్భంగా రైల్వే డీఆర్ఎం ఆఫీస్ నుండి జీవీఎంసీ గాంధీ విగ్రహం వరకు భారీ ప్రదర్శన నిర్వహించారు. అనంతరం బహిరంగసభ జరిగింది. జేఏసీ చైర్మన్‌లు ఎం జగ్గునాయుడు, జే అయోధ్యరాం, వైస్ చైర్మన్ ఎం. మన్మధరావు, కన్వీనర్ నాగభూషణం అధ్యక్షతన జరిగిన సభలో కార్మిక సంఘాల నేతలు మాట్లాడుతూ... కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్‌ను జిందాల్‌కు కట్టబెట్టేందుకు రహస్య ఒప్పందం చేసుకుందని... ఆ ఒప్పందాన్ని బయటపెట్టాలని ఉద్యోగులు, కార్మికులు డిమాండ్ చేస్తున్నా పెడచెవిన పెడుతోందన్నారు. స్టీల్‌ప్లాంట్‌కు ఉన్న విలువైన భూములను కాజేయడం కోసం మోదీ సర్కారు తీవ్ర ప్రయత్నాలు చేస్తోందన్నారు. స్టీల్‌ప్లాంట్ పరిరరక్షణకోసం కూర్మన్నపాలెం జంక్షన్‌లో దీక్షలు చేపట్టి వెయ్యి యాభైరోజులు కాగా... జీవీఎంసీ గాంధీవిగ్రహం వద్ద దీక్షలు చేపట్టి వెయ్యి రోజులు అవుతోందన్నారు. విశాఖ ఉక్కు పరిరక్షణకై జరుగుతున్న ఉద్యమానికి ఉమ్మడి తెలుగు రాష్ట్రాల ప్రజలు పెద్దఎత్తున మద్దతు తెలుపుతున్నారన్నారు. రాస్తారోకోలు, బంద్‌లు చేపడితే రాష్ట్ర ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొన్నారని గుర్తుచేశారు. రాజకీయాలకు అతీంగా ప్రజాపోరాటం జరుగుతున్నా మోదీ ప్రభుత్వం ఖాతర చేయకుండా ప్రైవేటీకరణ చర్యలు వేగవంతం చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. బీజేపీ ఎంపీ జీవీఎల్ నర్సింహరావు విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరించడం లేదని పదేపదే ప్రకటనలు చేయడాన్ని తప్పుబట్టారు. విశాఖ ప్రజలపై జీవీఎల్‌కు ప్రేమ ఉంటే ఉక్కు మంత్రిత్వశాఖతో, ప్రధాని మోదీతో ప్రకటన చేయించాలని డిమాండ్ చేశారు. మోదీ ప్రభుత్వం స్టీల్‌ప్లాంట్‌ను విక్రయించే యత్నం విరమించే వరకు ఈ పోరాటం కొనసాగుతుందని హెచ్చరించారు. స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరించడానికే కేంద్రం ప్లాంట్‌కు సొంతగనులు కేటాయించకపోవడం, వర్కింగ్ క్యాపిటల్ ఇవ్వకపోవడం, బ్లాస్ట్ ఫర్నీస్‌ను మూసివేసే చర్యలకు పాల్పడిందన్నారు. ఇక నైనా కేంద్రం ప్రైవేటీకరణ కుట్రలను ఆపకపోతే 2024 ఎన్నికల్లో బీజేపీకి రాష్ట్ర తగిన బుద్ధిచెపుతారని హెచ్చరించారు. దేశంలో ఏ స్టీల్‌ప్లాంట్‌కు లేని ఆస్తులు, వనరులు విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు ఉన్నాయి గనుకనే మోదీ ప్రభుత్వం దీనిని కారుచౌకగా అమ్మేయడానికి పూనుకుందని విమర్శించారు. రూ.3లక్షల కోట్ల విలువగల స్టీల్‌ప్లాంట్‌ను 30వేల కోట్లకు కట్టబెట్టే చర్యలకు పాల్పడటాన్ని ప్రజలు తిప్పికొట్టాలన్నారు. గాలి జనార్ధనరెడ్డికి ఏ పరిశ్రమ లేకపోయినా బొగ్గుగనులు కేటాయించి... లాభాల్లో ఉండే విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు సొంతగనులు కేటాయించకపోవడం దుర్మార్గపుచర్య అన్నారు. ఈ సభలో ఐఎన్‌టీయూసీ నాయకులు నాగభూషణం, ఐఎఫ్‌టీయూ నాయకుడు వెంకటేశ్వర్లు, సీఎఫ్‌టీయూఐ నేత సురేష్‌బాబు, టీఎన్‌టీయూసీ నేత రామ్మోహన్‌రావు, ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి పడాల రమణ, జిల్లా ప్రధాన కార్యదర్శి అచ్యుతరావు, స్టీల్ ప్లాంట్ ఏఐటీయూసి నేత రామకృష్ణ , ఎన్‌వైఫ్ఐడబ్ల్యూ రాష్ట్ర అధ్యక్షురాలు ఏ విమల, పీఓడబ్ల్యూ రాష్ట్ర అధ్యక్షురాలు ఎం.లక్ష్మి, ఐద్వా జిల్లా అధ్యక్షురాలు బీ పద్మ, అంబేద్కర్ మెమోరియల్ అధ్యక్షుడు బొడ్డు కళ్యాణరావు, హెచ్ఎంఎస్ నాయకులు దొమ్మేటి అప్పారావు, ఏఐసీటీయూ నాయకులు మోహన్‌రావు, ఏపీఎఫ్‌టీయూ నాయకులు దేవా, ఎస్ఎఫ్ఐడబ్ల్యూ కార్యదర్శి బేగం, రైతుసంఘం నాయకులు జీ నాయనబాబు , డీహెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు జేవీ ప్రభాకర్, జిల్లా అధ్యక్షుడు గుడాల రాంబాబు తదితరుల ప్రసంగించారు.

ఎంఫిల్ డిగ్రీకి గుర్తింపు లేదు

ఎవరూ చేరొద్దంటూ యూజీసీ హెచ్చరిక

న్యూఢిల్లీ: ఎంఫిల్ (మాస్టర్ ఆఫ్ ఫిలాసఫీ)కు సంబంధించి యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) కీలక హెచ్చరిక చేసింది. ఈ డిగ్రీకి యూజీసీ గుర్తింపు లేదని, విద్యార్థులు ఇందులో చేరవద్దని స్పష్టం చేసింది. అంతేకాకుండా 2023-24 విద్యా సంవత్సరానికి సంబంధించి ఎంఫిల్ ప్రవేశాలు నిలిపివేయాలంటూ అన్ని యూనివర్సిటీలను యూజీసీ ఆదేశించింది. 'ఎంఫిల్ అడ్మిషన్ కోసం వివిధ యూనివర్సిటీలు దరఖాస్తులు కోరుతున్నట్లు మా దృష్టికి వచ్చింది. ఎంఫిల్ అనేది గుర్తింపు పొందిన డిగ్రీ కాదు. ఈ ప్రోగ్రామ్‌ను ఉన్నతవిద్యా సంస్థలు అందించరాదంటూ యూజీసీ నిబంధనలు-2022 రెగ్యులేషన్ నంబర్ 14 స్పష్టంగా చెబుతోంది' అని తాజా నోటీసులో యూజీసీ పేర్కొంది. దీంతో 2023-24 విద్యా సంవత్సరానికి ఎంఫిల్‌లో ప్రవేశాల ప్రక్రియను నిలిపివేసే చర్యలు చేపట్టాలని యూనివర్సిటీ అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నామని తెలిపింది. మరోవైపు విద్యార్థులు కూడా ఇందులో అడ్మిషన్ తీసుకోవద్దని యూజీసీ సెక్రటరీ మనీశ్ జోషి స్పష్టం చేశారు.

కలిసి పనిచేద్దాం... పార్టీని గెలిపిద్దాం

మంగళగిరి సమావేశంలో లోకేశ్

విశాలాంధ్ర-తాడేపల్లి: వైసీపీ ప్రభుత్వం మంగళగిరి ప్రజలను మోసం చేసిందని, ఇచ్చిన హామీలు నిలబెట్టుకోలేదని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ విమర్శించారు. అందరం కలిసి పనిచేద్దామని, పార్టీని గెలిపించుకుందామని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. తాడేపల్లి బైపాస్ రోడ్డులోని సీఎస్ఆర్ కళ్యాణ మండపంలో బుధవారం మంగళగిరి నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశం జరిగింది. లోకేశ్ మాట్లాడుతూ తాడేపల్లిలో రైతులకు ఇబ్బంది కరంగా తయారైన యూ1-జోన్ ఎత్తేసి ఉచితంగా రెగ్యులరైజ్ చేస్తామన్నారు. గ్రూపు రాజకీయాలు వద్దని సూచించారు. ఓటర్ల వెరిఫికేషన్ కోసం క్లస్టర్, యూనిట్, బూత్ వ్యవస్థ ఏర్పాటు చేశామన్నారు. ఇంటింటి ప్రచారం చేయాలని, పార్టీ హామీలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఇప్పటికే 52వేల ఇళ్లకు వెళ్లి ప్రచారం చేయగా జనవరి నాటికి ఇంటింటికి ప్రచారం పూర్తి కావాలన్నారు. బాబు హామీ, భవిష్యత్తుకు వాగ్దానం పేరిట చంద్రబాబు 'సూపర్ సిక్స్' పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఆదేశాలిచ్చారు. పార్టీ కార్యకర్తలు, నాయకులు గ్రూప్ రాజకీయాలకు దూరంగా ఉండాలని, ఏ సమస్య వచ్చినా తన దృష్టికి తీసుకొస్తే తప్పక పరిష్కరిస్తానని లోకేశ్ హామీనిచ్చారు. చేసిన పనిని పట్టే పార్టీలో గౌరవం ఉంటుందని నాయకులకు హితవుపలికారు. వారానికి ఐదు రోజులు ఓపిగ్గా ప్రజల సమస్యలు తెలుసుకోవాలని, 45రోజుల్లో పూర్తిచేయవచ్చని ప్రచార ఆర్భాటం వద్దన్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర ఎస్సీ సెల్ అధ్యక్షుడు వేమూరి మైనర్ బాబు, అధికార ప్రతినిధి తమ్మిశెట్టి జానకి దేవి, నియోజకవర్గ పరిశీలకుడు మమ్మిడి సత్యనారాయణ, గుంటూరు పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి పోతినేని శ్రీనివాసరావు, నియోజకవర్గ సమన్వయకర్త నందం అబద్దయ్య, కళ్ళం రాజశేఖర్ రెడ్డి, అమర సుబ్బారావు, వల్లభనేని వెంకట్రావు పాల్గొన్నారు.

ద్రవిడ వర్సిటీ వీసీగా మధుజ్యోతి

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: కుప్పం ద్రవిడ యూనివర్సిటీ ఉప కులపతిగా ఆచార్య డాక్టర్ కొలకలూరి మధుజ్యోతిని నియమిస్తూ ఆంధ్రప్రదేశ్ గవర్నర్, విశ్వ విద్యాలయాల కులపతి ఎస్.అబ్దుల్ నజీర్ ఉత్తర్వులు జారీ చేశారు. తిరుపతిలోని శ్రీ పద్మావతి మహిళా విశ్వ విద్యాలయంలో ప్రొఫెసర్ మధుజ్యోతి తెలుగు విభాగంలో శాఖాధిపతిగా విధులు నిర్వహిస్తున్నారు. పద్మశ్రీ ఆచార్య కొలకలూరి ఇనాక్ కుమార్తె మధుజ్యోతి. తండ్రి కూతుళ్లు ఉప కులపతులుగా సేవలందించే అదృష్టం కొలకలూరి కుటుంబానికి దక్కడం విశేషం. అనంతపురానికి చెందిన ఆచార్య మధుజ్యోతి శ్రీ వెంకటేశ్వర విశ్వ విద్యాలయంలో ఎంఏ గోల్డ్ మెడలిస్ట్. శ్రీకృష్ణ దేవరాయ విశ్వవిద్యాలయం నుంచి పీహెచ్‌డీ చేశారు. అనువాదంలో, తమిళంలో పీజీ డిప్లొమా చేశారు. హిందీ భాషతో పాటు సంస్కృతంలోనూ ప్రావీణ్యత సంపాదించారు. జాతీయ, అంతర్జాతీయ సదస్సుల్లో 160 పైగా పరిశోధనా పత్రాలు సమర్పించారు. బెజవాడ గోపాలరెడ్డి కవిత్వం - సౌందర్యం, తెలుగు సాహితీ వస్తు పరిణామం, సాహిత్య వీక్షణం, దండోరా - అంబేద్కర్ అభీష్టం, శ్రీ తాళ్లపాక సాహిత్యానుశీలం, ఆచార్య కొలకలూరి ఇనాక్ సాహిత్యంపై విమర్శనం, దళిత సంస్కృతి, దళిత సాహిత్య సౌందర్య తత్వం, సంకల్పం సంఘర్షణ జయకేతనం, గుర్రం జాషువా ఇలా 20 పుస్తకాలు రచించి ప్రచురించారు.

జమ్మూకశ్మీర్ ఉగ్ర కుట్ర భగ్నం

శ్రీనగర్: జమ్మూకశ్మీర్‌లో భారత సైన్యం బుధవారం భారీ ఉగ్ర కుట్రను భగ్నం చేసింది. శ్రీనగర్-బారాముల్లా రహదారిపై ఉగ్రవాదులు అమర్చిన భారీ పేలుడు పదార్థాల(ఐఈడీ)ను స్వాధీనం చేసుకొని ధ్వంసం చేశారు. సైన్యానికి చెందిన 'చినార్ కార్ప్స్' ఎక్స్‌లో ఈ విషయాన్ని తెలిపింది. 'శ్రీనగర్-బారాముల్లా హైవేపై లావేపురా సమీపంలో ఐఈడీని స్వాధీనం చేసుకోవడం జరిగింది. చినార్ కార్ప్స్, జమ్మూకశ్మీర్ పోలీసులు ఒక పెద్ద ఉగ్రవాద సంఘటన జరగకుండా నిరోధించారు. ఆ ఐఈడీని లవేపురాలోనే ధ్వంసం చేశారు. కశ్మీర్‌ను ఉగ్రవాద రహితంగా మలిచేందుకు భారత సైతం నిశ్చయించుకుంది, ఆ దిశగా దూసుకెళ్తోంది' అని ఎక్స్ ఖాతాలో రాసుకొచ్చింది. కొంతకాలం నుంచి ఉగ్రవాదులు సైన్యాన్ని లక్ష్యంగా చేసుకొని దాడులు జరుపుతున్నారు. ఇందులో భాగంగానే.. హైవేలు, రోడ్లపై ఐఈడీలను అమర్చుతున్నట్టు తెలిసింది. మెరుపుదాడులు కూడా ప్రారంభించారు. శీతాకాలం రావడంతో ఉగ్రవాదులు రెచ్చిపోతున్నారు. ఇటీవల పూంచ్‌లో ఉగ్రవాదులు భారత సైన్యంపై మెరుపుదాడులు చేసిన సంగతి తెలిసిందే. ఈ దాడిలో ముగ్గురు జవాన్లు మృతి చెందారు. మరో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. దీంతో.. సైన్యం ఉగ్రవాదుల కోసం గాలింపు మొదలుపెట్టింది. ప్రత్యేక ఆపరేషన్లు నిర్వహిస్తోంది. ఈ క్రమంలోనే శ్రీనగర్-బారాముల్లా హైవేపై ఉగ్రవాదులు అమర్చిన ఐఈడీ గురించి తెలుసుకోగలిగారు. ఈ ఐఈడీలు భారత సైన్యానికి గ్యాస్ సిలిండర్ల రూపంలో లభ్యమయ్యాయని సమాచారం. పీటీఐ కథనం ప్రకారం.. బుధవారం ఉదయం భద్రతా దళాలు పెట్రోలింగ్ చేస్తున్న సమయంలో శ్రీనగర్-బారాముల్లా హైవేపై లావేపురా వద్ద గ్యాస్ సిలిండర్ అనుమానాస్పద స్థితిలో పడి ఉండటాన్ని చూశారని, ప్రయాణికుల భద్రతను దృష్టిలో ఉంచుకుని వెంటనే ట్రాఫిక్ మార్గాన్ని మార్చారు. అనంతరం బాంబు నిర్వీర్య విభాగానికి సమాచారం అందించగా, వారు ఘటనా స్థలానికి చేరుకుని ఆ ఐఈడీని నిర్వీర్యం చేసి, ఒక పెద్ద ప్రమాదాన్ని నిరోధించిందని అధికారులు వెల్లడించారు. ఐఈడీని నిర్వీర్యం చేసిన అనంతరం పరిస్థితుల్ని సమీక్షించి.. రోడ్డుపై రాకపోకల్ని పునరుద్ధరించారు.

నేటినుంచి 34వ పుస్తక మహోత్సవం

- సాహితీవేత్తల శతజయంతి సభలు,
- సాహితీ సభలు,
- పుస్కకావిష్కరణలు

విశాలాంధ్ర-విజయవాడ కల్చరల్: విజయ వాడలో పుస్తక మహోత్సవం గురువారం నుంచి ప్రారంభమవుతుంది. విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ అధ్వర్యంలో 34వ పుస్తక మహోత్సవం... ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రాంగణంలో జరుగుతుంది. ఈ మేరకు పుస్తక మహోత్సవం కన్వీనర్ ఎమ్మెస్కో విజయకుమార్ తెలిపారు. ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడుతూ జనవరి 7వ తేదీ వరకు పుస్తకాల పండుగ జరుగుతుందని, 200కు పైగా స్టాల్స్ ఉంటాయని చెప్పారు. పుస్తక మహోత్సవం జరిగే ప్రాంగణానికి వరహాలు శెట్టి పేరు, ప్రధాన సాహితీ వేదికకు ప్రసిద్ధ రచయిత కేతు విశ్వనాథ రెడ్డి పేరును, విద్యార్థుల కార్యక్రమాలు నిర్వహించే ప్రతిభా వేదికకు శ్రీరమణ పేరు పెట్టినట్లు తెలిపారు. కేంద్ర సాహిత్య అకాడమీ అధ్యక్షుడు మాధవ్ కౌశిక్... జ్యోతి ప్రజ్వలన చేసి పుస్తక మహోత్సవాన్ని ప్రారంభిస్తారని చెప్పారు. రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ తదితర ప్రముఖులు పాల్గొంటారన్నారు. వేదికపై ఎమ్మెస్కో వారి పుస్తకావిష్కరణ జరుగుతుందని తెలిపారు. 29వ తేదీ సాయంత్రం 6 గంటలకు సంజీవ్ దేవ్ శతజయంతి సభ, 7 గంటలకు వోల్గా పుస్తకావిష్కరణ సభ, వెన్నా వల్లభరావు పుస్తక ఆవిష్కరణ సభలు జరుగుతాయన్నారు. 30వ తేదీ సాయంత్రం 6 గంటలకు విశాలాంధ్ర వారి పుస్తకావిష్కరణ సభ, జనాభా సంఖ్య, అపోహలు, భారతీయ రాజకీయాలపై కార్యక్రమాలు ఉంటాయన్నారు. 31వ తేదీన కాళీపట్నం రామారావు శత జయంతి సభ జరుగుతుందని తెలిపారు. జనవరి 1వ తేదీ సాయంత్రం 4 గంటలకు పుస్తక ప్రియుల పాదయాత్ర జరుగుతుందని, జస్టిస్ జాస్తి చలమేశ్వర్ దీనిని ప్రారంభిస్తారని విజయకుమార్ తెలిపారు. పాదయాత్ర సిద్ధార్థ నగర్‌లోని మదర్‌థెరిస్సా విగ్రహం నుంచి ఐటీఐ కళాశాల సర్వీస్ రోడ్డు మీదుగా పుస్తక మహోత్సవ ప్రధాన వేదిక వరకు జరుగుతుందని చెప్పారు. అనంతరం ఎమెస్కో వారి పుస్తకాన్ని ఆవిష్కరిస్తారన్నారు. జనవరి 2వ తేదీ సాయంత్రం ఆవంత్స సోమసుందర్ శతజయంతి సభ, సాహితీ మిత్రుల పుస్తకావిష్కరణ సభ జరుగుతాయని అన్నారు. 3వ తేదీ సాయంత్రం 6 గంటలకు నేషనల్ బుక్ ట్రస్ట్ ఇండియా పిల్లల పుస్తకాల ఆవిష్కరణ సభ, విశాలాంధ్ర పుస్తకావిష్కరణలు ఉంటాయన్నారు. భగవద్గీత ఒక అవలోకన ఆవిష్కరణ, భారతీయ నాస్తికవాదం పుస్తకావిష్కరణ, పెరియార్ రామస్వామి నాయకర్ రాజకీయ జీవితం ఆవిష్కరణ కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు. అదే వేదికపై విశాలాంధ్ర విజ్ఞాన సమితి అరుణ తారలు పుస్తకాన్ని ఆవిష్కరిస్తారన్నారు. జనవరి 4వ తేదీన సోమేపల్లి వెంకటసుబ్బయ్య సంస్మరణ సభ, ప్రజాశక్తి బుక్‌హౌస్ పుస్తకాలను ఆవిష్కరిస్తారన్నారు. 5న రాంభట్ల కృష్ణమూర్తి శతజయంతి సభకు విశాలాంధ్ర దినపత్రిక సంపాదకులు ఆర్వీ రామారావు అధ్యక్షత వహిస్తారని తెలిపారు. అనంతరం సత్తి లలితారెడ్డి రాసిన 'సరియైన ఉచ్చారణ' పుస్తకావిష్కరణ ఉంటుందన్నారు. 6వ తేదీన ప్రజాశక్తి పుస్తకావిష్కరణ సభ, చాగంటి కోటేశ్వరరావు మహాభారత ప్రవచనాల ఆవిష్కరణ కార్యక్రమాలు, 7వ తేదీ సాయంత్రం ముగింపు సభ, బహుమతుల ప్రదానం ఉంటాయని విజయకుమార్ తెలిపారు. సాహిత్య అకాడమీ కార్యదర్శి డాక్టర్ కృత్తివెంటి శ్రీనివాసరావు మాట్లాడుతూ పుస్తక పఠనాన్ని పెంపొందించేందుకు ఇలాంటి మహోత్సవాలు దోహదమవుతాయన్నారు. అన్నారు. పుస్తక ప్రియులకు తమ అభిమాన రచయితలను కలుసుకొనే అవకాశం ఇలాంటి సందర్భాల్లో లభిస్తుందని, పబ్లిషర్లకూ గుర్తింపు వస్తుందన్నారు. పుస్తకాల ముద్రణలో భారత్‌ది మూడో స్థానమన్నారు. దేశంలో జరిగినన్ని పుస్తక మహోత్సవాలు ఎక్కడా జరగవన్నారు. పబ్లిషర్లకు ప్రభుత్వం పురస్కారాలు అందించాలని కోరారు. విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ అధ్యక్షుడు మనోహర్ నాయుడు మాట్లాడుతూ నిత్యం సాహితీవేత్తల శతజయంతి సభలు, సాహితీ సభలు, పుస్తకావిష్కరణలు, రచయితలతో ముఖాముఖి కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు. ప్రతిభా వేదిక వద్ద చిన్నారుల్లో సృజనాత్మకతను పెంచే కార్యక్రమాలు ఉంటాయన్నారు. పుస్తక మహో త్సవం నిర్వహణకు సహకారం, ప్రోత్సాహం అందిస్తున్న ప్రభుత్వ శాఖలకు, అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో సొసైటీ కార్యదర్శి కె లక్ష్మయ్య, గౌరవాధ్యక్షుడు బి బాబ్జి, సభ్యులు గోళ్ల నారాయణరావు, కోశాధికారి కె.రవి పాల్గొన్నారు.

బాల సాహిత్యంలో గేయం ముఖ్యం

ప్రముఖ సాహితీవేత్త పెనుమాక నాగేశ్వరరావు

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం: గాన యోగ్యమైనది గేయమని ప్రముఖ సాహితీవేత్త పెనుమాక నాగేశ్వరరావు అన్నారు. గుంటూరులో విశాలాంధ్ర 23వ పుస్తక మహోత్సవం సందర్భంగా స్థానిక లాడ్జి సెంటర్ ఏఎల్ బీఈడీ కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన అభ్యుదయ సాహిత్యోద్యమ నేత డాక్టర్ ఆవంత్స సోమసుందర్ సాహిత్య ప్రాంగణం, నయాగరా కవి, నాటక రచయిత, అనువాదకులు బెల్లంకొండ రామదాసు శతజయంతి సాహిత్య వేదిక నందు బుధవారం 'బాల గేయాల'పై పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పెనుమాక నాగేశ్వరరావు మాట్లాడుతూ పాతకాలం పద్యమైతే వర్తమానం వచన కవిత్వం అని పెద్దలు అన్నారన్నారు. ఛందో వ్యవస్థను రెండు భాగాలుగా విభజిస్తే ఒకటి పద్య భాగంగా, మరొకటి గేయ భాగంగా నిర్ధారించాలని ప్రముఖ సాహితీవేత్త సి.నారాయణరెడ్డి చెప్పారన్నారు. గేయంలో మాత్రా ఛందస్సుకు ప్రాధాన్యం ఉంటుందని, నిజానికి ఆంగ్లేయ సాహిత్య ప్రభావం గేయ రచనపై ఉంటుందన్నారు. 'మాకొద్దీ తెల్లదొరల తనం' అనే గరిమెళ్ళ సత్యనారాయణ గేయం 'మా తెలుగు తల్లికి మల్లెపువ్వు దండ' అనే శంకరం బాడి సుందరాచార్యులు గేయం అందరికీ తెలుసన్నారు. అన్నమయ్య చాలా జానపదాలు రాశారని, బాల సాహిత్యంలో గేయం ఒక ముఖ్యమైన ప్రక్రియ అని పెనుమాక నాగేశ్వరరావు అన్నారు. విశ్రాంత ఉపాధ్యాయులు కొణతం నాగేశ్వరరావు మాట్లాడుతూ బాల గేయాలు ద్వారా నేటి బాల, బాలికలకు అనేక విషయాలను తల్లిదండ్రులే నేర్పించే అవకాశం ఉందన్నారు. బాలలు మంచి పౌరులుగా ఎదగటానికి ఇవి దోహమవుతాయన్నారు. బాలల గేయాల పోటీలతో పోటీతత్వంతో పాటు స్నేహపూర్వక వాతావరణం వృద్ధి చెందుతుందరు. ఈ పోటీలకు భాష్యం, ఎస్‌వీబీకే, కేఏల్‌పీ స్కూల్స్ విద్యార్థినీ, విద్యార్థులు ప్రతిభ కనపర్చారన్నారు. కాగా, విజేతలకు 30వ తేదీన బహుమతులను ప్రదాం చేయనున్నారు. కార్యక్రమంలో అరసం జాతీయ అధ్యక్షుడు పెనుగొండ లక్ష్మీనారాయణ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వల్లూరు శివప్రసాద్, జిల్లా కార్యదర్శి బుల్లా రవికుమార్, గుంటూరు విశాలాంధ్ర బుక్‌హౌస్ మేనేజర్ మురకొండ మల్లికార్జునరావు పాల్గొన్నారు.

నేటి కార్యక్రమాలు: అరసం జిల్లా శాఖ కార్యవర్గ సభ్యులు మల్లెల శ్రీనివాసరావు అధ్యక్షతన 'కథ చెప్పండి-విద్యార్థులకు పోటీ' జరగనుంది. వక్తగా కవి షేక్.మహబూబ్ సుభాని హాజరవుతారు.

కొబ్బరి మద్దతు ధర రూ.250-300 పెంపు

- బీహార్‌లో గంగా నదిపై వంతెన నిర్మాణం
- న్యూజిలాండ్‌లో కాన్సులేట్ జనరల్ ఏర్పాటు
- త్రిపురలో ఖోవాయి-హరీనా రోడ్డు విస్తరణ
- కేంద్ర కేబినెట్ నిర్ణయాలు

న్యూఢిల్లీ: వచ్చే ఏడాది కోసం కోప్రా (ఎండు కొబ్బరి) కనీస మద్దతు ధరను క్వింటాకు రూ.250 నుంచి రూ.300 వరకు పెంచాలని కేంద్ర కేబినెట్ నిర్ణయించింది. దీంతో క్వింటా ధర రూ.11,160-రూ.12,000గా ఉండనున్నది. ఈ మేరకు ప్రధాని మోదీ అధ్యక్షతన బుధవారం జరిగిన ఆర్థిక వ్యవహారాల కేబినెట్ కమిటీ (సీసీఈఏ) సమావేశం నిర్ణయించింది. అలాగే బీహార్‌లో గంగానదిపై 4.56 కిమీల వంతెన నిర్మాణానికి, న్యూజిలాండ్‌లోని ఆక్ల్యాండ్‌లో భారత కాన్సులేట్ జనరల్ ఏర్పాటునకు, త్రిపురలో ఖోవాయి-హరీనా రోడ్డు విస్తరణను కేబినెట్ ఆమోదించింది. సమావేశం అనంతరం కేంద్రమంత్రి అనురాగ్ ఠాకూర్ విలేకరులతో మాట్లాడుతూ కేబినెట్ నిర్ణయాలను వెల్లడించారు. 'కొబ్బరి ధరలు అంతర్జాతీయ స్థాయిలో పడిపోయాయి. సాగు వ్యయం కంటే 50శాతం ఎక్కువగా ఎంఎస్పీని కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించింది. 2024 సీజన్ కోసం క్వింటాపై రూ.250 నుంచి రూ.300 వరకు పెంచింది. దీంతో ఎఫ్ఏక్యూ కొబ్బరి క్వింటా ధరపై రూ.250 పెరుగగా ధర రూ.12,000కు చేరింది. కొబ్బరి తరుముకు మద్దతు ధర రూ.300 పెరిగి రూ.11,160 అయ్యింది' అని అన్నారు. 'పదేళ్లలో కొబ్బరి తురుము, కొబ్బరి కాయ ఎంఎస్పీ రూ.5,250, రూ.5,500 చొప్పున పెరిగినట్లు తెలిపారు. ప్రస్తుత సీజన్‌లో రికార్డు స్థాయిలో 1.33 లక్షల టన్నుల కొబ్బరిని రూ.1,493 కోట్లకు ప్రభుత్వం కొనుగోలు చేసింది. తద్వార తొమ్మిది వేల మంది రైతులకు లబ్ధి చేకూరింది. 2022 సీజన్‌తో పోల్చితే పంట సేకరణలో 227శాతం పెంపుదల నమోదైంది' అని ఠాకూర్ వెల్లడించారు. న్యూజిలాండ్‌లోని ప్రవాసీల సౌకర్యార్థం ఆక్ల్యాండ్‌లో కాన్సులేట్ జనరల్‌ను ప్రారంభించి, 12 నెలల్లో పూర్తిస్థాయిలో అందుబాటులోకి తేవాలని కేబినెట్ నిర్ణయించింది. కాన్సులేట్ జనరల్ కార్యాలయాన్ని ప్రారంభించడం ద్వారా దౌత్యపరంగానే కాకుండా అంతర్జాతీయ స్థాయి కార్యకలాపాలకు సౌకర్యంగా ఉంటుంది. న్యూజిలాండ్‌లో మొత్తం 2.5లక్షల మంది భారత సంతతి ప్రజలు ఉండగా ఒక్క ఆక్ల్యాండ్‌లోనే 1.7లక్షల మంది ఉన్నారు. బీహార్‌లో గంగా నదిపై 4.556 మీటర్ల ఆరు లేన్ల హైలెవల్/ఎక్స్‌ట్రా డోస్డ్ కేబుల్ వంతెన నిర్మాణానికి మంత్రివర్గం అంగీకరించింది. దిఘా, సోనేపూర్‌ను కలిపే ఈ వంతెన నిర్మాణానికి రూ.3,064.45 కోట్లు వెచ్చించనున్నది. 'ఇంజినీరింగ్, ప్రొక్యూర్‌మెంట్, కనస్ట్రక్షన్' (ఈసీపీ) నమూనాలో 5జీ - బీఐఎం (బ్రిడ్జ్ హెల్త్ మానిటరింగ్ సిస్టమ్) మోడల్‌లో వంతెన నిర్మాణం ఉంటుంది. ప్రతినెలా డ్రోన్ మ్యాపింగ్ జరుగుతుంది. ప్రారంభించిన రోజు నుంచి 42 నెలల్లో ప్రాజెక్టు పూర్తి చేయాలని కేబినెట్ నిర్ణయించింది. పాట్నా నుంచి గోల్డెన్ క్వాడ్రిలేటర్ కారిడార్ మీదగా ఔరంగాబాద్ వద్ద ఎన్‌హెచ్-139, సోనేపూర్ (ఎన్‌హెచ్-31), ఛాప్రా, మోదీహరి (తూర్పు-పశ్చిమ కారిడార్ పాత ఎన్‌హెచ్-27), ఉత్తర బీహార్‌లోని బెట్టియా (ఎన్‌హెచ్-727)ను ఈ వంతెను కలుపుతుందని అధికారిక ప్రకటన తెలిపింది. బుద్ధా సర్క్యూట్‌లో భాగంగా ఈ ప్రాజెక్టు ఉంటుందని కూడా వెల్లడించింది. ఇక త్రిపురలోని ఖోవాయి-హరీనా రోడ్డు వెడల్పును పెంచే ప్రాజెక్టును రూ.1,511.70 కోట్లు (జేపీవై 23,129 మిలియన్లు) రుణ మొత్తంతో కలిపి రూ.2,486.78 కోట్లతో చేపట్టేందుకు కేబినెట్ అంగీకారం తెలిపింది. ఓడీఏ స్కీములో భాగంగా జపాన్ ఇంటర్నేషనల్ కోఆపరేటివ్ ఏజెన్సీ (జేఐసీఏ) నుంచి రుణ సాయం పొందనుంది. త్రిపురలో రోడ్డు రవాణా మెరుగుదలకు ఈ ప్రాజెక్టు దోహద మవుతుంది. అంతేకాకుండా త్రిపుర నుంచి అసోం, మేఘాలయకు ప్రత్యామ్నాయ మార్గాన్ని అందుబాటు లోకి తెస్తుంది. ఎన్‌హెచ్ 208ఏ గుండా అసోం, త్రిపుర మధ్య ప్రయాణ సమయం కూడా తగ్గుతుంది. బంగ్లదేశ్ సరిహద్దుకు అతి సమీపంలో ఈ ప్రాజెక్టు ఉండటంతో కైలాషహర్, కమల్‌పూర్, ఖోవాయి బార్డర్ చెక్ పోస్టు ద్వారా బంగ్లాదేశ్‌కు కనెక్టివిటీ మెరుగవుతుంది.

రెజ్లింగ్ పాలనా వ్యవహారాలకు మరోసారి అడ్‌హక్ కమిటీ

న్యూఢిల్లీ: లైంగిక ఆరోపణలు, భారత రెజ్లింగ్ సమాఖ్య (డబ్ల్యూఎఫ్ఐ) కొత్త పాలకవర్గంపై సస్పెన్షన్‌తో రోజువారీ కార్యకలాపాల కోసం అడ్‌హక్ కమిటీ ఏర్పాటుకు కేంద్ర క్రీడాశాఖ ఆదేశాలిచ్చింది. దీంతో భారత ఒలింపిక్ సంఘం (ఐఓఏ) తాత్కాలిక కమిటీని ఏర్పాటు చేసింది. దీనికి భూపిందర్ సింగ్ బజ్వా నేతృత్వం వహించనుండగా.. ఎంఎం సోమయా, మంజూష కన్వర్ సభ్యులుగా నియమితులయ్యారు. జవాబుదారీతనం, పారదర్శకత కోసం ఈ కమిటీని ఏర్పాటు చేసినట్లు ఐఓఏ తెలిపింది. రెజ్లింగ్ సమాఖ్య అధ్యక్షుడు, అధికారులు నిబంధనలకు విరుద్ధంగా ఏకపక్ష నిర్ణయాలు తీసుకున్న క్రమంలో తాత్కాలిక కమిటీ ఏర్పాటు చేశామని ఐఓఏ చీఫ్ పీటీ ఉషా తెలిపారు. ఈ నెల 21న జరిగిన ఎన్నికల్లో అధ్యక్షుడిగా బ్రిజ్‌భూషణ్ నమ్మిన బంటు సంజయ్ గెలిచాడు. ఆ వెంటనే డబ్ల్యూఎఫ్ఐ నియమావళికి విరుద్ధంగా ఈ నెల 28 నుంచి అండర్-15, 20 జాతీయ ఛాంపియన్‌షిప్స్ నిర్వహిస్తామని ప్రకటించడం, పాత కార్యవర్గం (పరోక్షంగా బ్రిజ్‌భూషణ్) నియంత్రణలోనే సమాఖ్య ఉండటం లాంటి కారణాలతో కేంద్ర క్రీడాశాఖ కొత్త పాలకవర్గాన్ని సస్పెండ్ చేసింది. దీంతో రెజ్లింగ్‌కు రిటైర్మెంట్ ఇస్తున్నట్లు, ఆటతో బంధాన్ని తెంచుకుంటున్నట్లు బ్రిజ్‌భూషణ్ ప్రకటించారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2021-23, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.